




www.navabhoomi.in | epaper.navabhoomi.in

RNI No:TELTEL:82083

అనుక్షణం

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

Navabhoomi daily fallows..

హైదరాబాద్ | 06 సోమవారం | జనవరి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 111


# డిండికి మహర్దశ

- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3.60 లక్షల ఎకరాలకు సాగునీరందించే డిండి ఎత్తిపోతల పథకం పనులు వేగవంతం
- ఏదుల-డిండి అనుసంధానానికి రేవంత్ సర్కార్ ఓకే
- రూ.1800కోట్లతో టెండర్లు పిలిచేందుకు సమ్మతి

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3.60 లక్షల ఎకరాలకు సాగునీరందించే డిండి ఎత్తిపోతల పథకం పనులు ఇక వేగవంతంకానున్నాయి. ఈ పథకానికి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో అంతర్భాగమైన ఏదుల రిజర్వాయర్‌నుంచి సాగునీటిని అందించే పనులను చేపట్టడానికి ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. శనివారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో ఈ మేరకు ఈ పనులు చేపట్టేందుకు రూ.1800కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు ఆహ్వానించాలని కేబినెట్‌లో నిర్ణయించారు. ఈ పనులకు టెండర్లు పిలవడంతోపాటు, ప్రాజెక్టుకు అవసరమైన పర్యావరణ అనుమతులకోసం, పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పూర్తిచేసేందుకు సమాంతరంగా కార్యాచరణ అమ లు చేయాలని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ నిర్ణయించింది. ఏదుల రిజర్వాయర్ నుంచి ఉల్పర బ్యారేజీవరకు అవసరమయ్యే లైన్ డిజైన్లకు మంత్రివర్గం శనివారం ఆమోద ముద్రవేసింది.

## జాతీయ రాజకీయాల్లో తగ్గిన
# తెలుగువారి పాత్ర

- ప్రపంచ రాజకీయలను ప్రభావితం చేసిన పీవీ,ఎన్టీఆర్,వెంకయ్యనాయుడు
- చంద్రబాబునాయుడి హయాంలో ఐటీ రంగాన్ని వేగంగా అభివృద్ధి
- వైఎస్సార్ హయాంలో ఓఆర్ఆర్,ఫార్మా,ఐటీ రంగాల్లో అభివృద్ధి
- దేశంలో బల్క్‌డ్రగ్‌లో 35 శాతం హైదరాబాద్ నుంచి తెలుగువాళ్లే ఉత్పత్తి
- ప్రపంచ తెలుగు సమాఖ్య ముగింపు వేడుకల్లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్-నవభూమిబ్యూరో

జాతీయ రాజకీయాల్లో తెలుగువారి పాత్ర సన్నగిల్లిందన్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి. హైదరాబాద్ హెచ్ఐసీసీ వేదికగా మూడు రోజులపాటు జరిగిన ప్రపంచ తెలుగు సమాఖ్య 12వ మహాసభల ముగింపు కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విదేశాలకు వెళ్లిన

# హైడ్రా మళ్లీ దూకుడు!

- ఖానామెట్ అయ్యప్ప సొసైటీలో అక్రమంగా నిర్మించిన భారీ అపార్ట్‌మెంట్‌ను కూల్చివేత
- అయ్యప్ప సొసైటీని సందర్శించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్, జీహెచ్ఎంసీ,అధికారులు
- 100 ఫీట్ రోడ్డు పక్కనే అపార్ట్‌మెంట్ నిర్మాణం అక్రమమని తేల్చిన అధికారులు
- హైకోర్టు ఆదేశాలు, జీహెచ్ఎంసీ ఇచ్చిన నోటీసులను సైతం బిల్డర్ బేఖాతర్

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

హైడ్రా దూకుడు.. ఐదంస్తుల అపార్ట్‌మెంట్ నేలమట్టం అలా.. 200 ఎకరాల వరకు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. హైదరాబాద్‌లోని చెరువులు, కుంటలను కాపాడడమే లక్ష్యంగా తీసుకొచ్చిన హైడ్రా.. మళ్లీ దూకుడు మొదలుపెట్టింది. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టాక వెంటనే హైడ్రా వ్యవస్థను తీసుకొచ్చారు. ఇప్ప టికే హైడ్రా వందలాది కట్టడాలను నేలమట్టం చేసింది. అలా.. 200 ఎకరాల వరకు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. తాజాగా.. తన పనిని మరోసారి ప్రారంభించిం ది. ఇప్పటి వరకు ఆక్రమణకు గురైన మీరాలం, బమ్ రుక్ ఉద్ దౌలా, మాదాపూర్ తమ్మిడికుంట వంటి ఎనిమిది చెరువులు, 12 పార్కుల భూములను హైడ్రా కాపాడింది. అలాగే.. ఆయా చెరువుల పరిధిలోని ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో నిర్మించిన కట్టడాలను కూల్చింది. ఆ స్థలాలను విముక్తి కల్పించింది. అలాగే.. రాయదుర్గం పరిధిలని ఖాజాగూడ భగీరథమ్మ చెరువు ఎఫ్టీఎల్, బఫర్ జోన్లో నిర్మించిన ఇళ్లను, దుకాణాలను సైతం తొలగించింది. తాజాగా.. శేరిలింగంపల్లి పరిధిలోని ఖానామెట్ అయ్యప్ప సొసైటీలో అక్రమంగా నిర్మించిన భారీ అపార్ట్‌మెంట్‌ను కూల్చివేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఖానామెట్ అయ్యప్ప సొసైటీలో 684 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ అపార్ట్‌మెంటును నిర్మించారు.

## బాత్రూముల్లో వీడియోల ఘటనలో
# ఇద్దరి అరెస్టు




- బాత్‌రూం వెంటిలేటర్‌కు ఆనుకొని వసతిగృహం సిబ్బంది గదులు
- వెంటిలేటర్ వద్ద కెమెరాలు అమర్చినట్లు చేతిగుర్తులు
- అనుమానితులైన ఇద్దరు అదుపులోకి..సెల్‌ఫోన్ల స్వాధీనం
- డెలిట్ అయిన వీడియోలను ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా వెనక్కి
- నేరం రుజువైతే నిందితులపై కఠిన చర్యలు: ఏసీపీ శ్రీనివాసరెడ్డి

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

మేడ్చల్ జిల్లా కండ్లకోయ సీఎంఆర్ ఇంజినీరిం గ్ కాలేజీలో అమ్మాయిల బాత్రూంల్లో వీడియో లు తీసిన ఘటన కేసులో పోలీసులు ఆదివారం ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఏ1 నంద కిశోర్, ఏ2 గోవింద కుమార్‌ను రిమాండ్‌కు తరలించారు. కాలేజీ ఛైర్మన్ చామకూరి గోపాల్ రెడ్డి సహా ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో గోపాల్ రెడ్డిని ఏ7గా చేర్చారు. కండ్లకోయ సీఎంఆర్ కాలేజీలోని ఐటీ క్యాంపస్ హాస్టల్‌లోని స్నానాల గదిలో విద్యార్థినుల వీడియోలు చిత్రీకరించారనే ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. కండ్లకోయ సీఎంఆర్ ఉమెన్స్ కాలేజీ హాస్టల్‌లోని బాత్‌రూంలో కెమెరాలు పెట్టి వీడియోలు తీశారని బుధవారం

# లవర్స్‌కు ఓయో బిగ్ షాక్..

- ఇక మీదట పెళ్లి అయిన వారికి మాత్రమే ఓయో రూమ్స్ ఇవ్వాలనే నిబంధన
- ఓయో కొత్త రూల్ ప్రకారం ఓయో రూమ్స్ వచ్చే వారి రిలేషన్ గురించి ప్రశ్నలు
- రిలేషన్‌కి సంబంధించిన ప్రూఫ్‌చెక్ చేసిన తర్వాతే వారికి రూమ్‌ను కేటాయింపు
- యూపీలోని మీరట్‌లో మాత్రమే అమల్లో ఈ నిబంధన..తర్వాత అన్ని నగరాల్లో..




2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

ఓయో ప్రారంభంలో ఒరవేల్ స్టేస్ అనే పేరుతో ప్రారంభమైంది, తర్వాత ఓయోగా మార్చబడింది. ఈ బ్రాండ్ ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా బడ్జెట్ హోటళ్లు ఇతర అతిథి సేవలను అందిస్తుంది.ఓయోను 2013లో రితేష్ అగర్వాల్ స్థాపించారు. అప్పటి నుండి, ఇది భారతదేశం ఇతర దేశాలలో వేగంగా విస్తరించి, ప్రయాణికులకు వివిధ బడ్జెట్‌లకు అనుగుణంగా ఉండే అనేక రకాల సేవలను అందిస్తోంది. అయితే మన దేశంలో ఓయో రూమ్స్ దుర్వినియోగం జరుగుతున్నాయ ని ఆరోపణలు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయి. గతంలో ప్రేమికులు పార్కులను తమ అడ్డగా మార్చుకునేవారు. కానీ కాలక్రమేణ లవర్స్

## ప్రధాని మోదీ పర్యటన..
# ఏపీకి కీలక ప్రకటన

- 8న రాష్ట్రానికి రానున్న ప్రధాని నరేంద్ర మోదీ
- ప్రధాని రాక వేళ విశాఖలో భారీ రోడ్ షోకు ప్లాన్
- బహిరంగ సభలో ఏపీకి సంబంధించి ప్రధాని కీలక ప్రకటన?
- ఏపీకి మేలు చేసే శుభవార్తను వినిపిస్తారని ఊహాగానాలు

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

ప్రధాని మోదీ ఈ నెల 8న విశాఖ రానున్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి హాజరైన ప్రధాని.. ఆ తరువాత రాష్ట్రానికి వస్తున్నారు. కేంద్రంలో, ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం ఉండటంతో ప్రధాని పర్యటన ను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ పర్యటన వేళ కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది. ప్రధాని రాక వేళ విశాఖలో భారీ రోడ్ షోకు ప్లాన్ చేసారు. పలు కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. ఆ తరువాత జరిగే బహిరంగ సభలో ఏపీకి సంబంధించి ప్రధాని కీలక ప్రకటన చేస్తారనే అంచనాలు వ్యక్తం అవుతున్నాయి. భారీ రోడ్ షో - సభ ప్రధాని మోదీ ఈ నెల 8వ తేదీ సాయంత్రం 4.15 గంటలకు విశాఖపట్నం లోని ఐఎన్ఎస డేగా (నేవల్ ఎయిర్‌స్టేషన్)లో దిగుతారు. ఈ సందర్భంగా ప్రధానికి గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు స్వాగతం పలుకుతారు. అనంతరం నేవీ నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. ఆ తర్వాత అక్కడి నుంచి రోడ్డు మార్గాన 4.45 గంటలకు బయలుదేరి జాతీయ రహదారిలో తాటిచెట్లపాలెం జంక్షన్, సంపత్ వినాయక్ గుడి, దత్తా ఐలాండ్ మీదుగా ఏయూ ఎకనామిక్స్ విభాగం ఎదురుగా ఉన్న వెంకటాద్రి వంటిల్లు వరకూ రోడ్ షో లో పాల్గొంటారు. అక్కడి నుంచి ఓపెన్‌టాప్ వాహనం పై నుంచి ప్రజలకు అభివాదం చేస్తారు. త్రీటౌన్ జంక్షన్ మీదుగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభా వేదిక వద్దకు చేరుకుంటారు. చంద్రబాబు, పవన్ తో కలిసి రోడ్ షోలో ప్రధానితో పాటుగా ఓపెన్‌టాప్ వాహనంపై

## జగన్ జిల్లా టూర్లకు
# ఆదిలోనే బ్రేకులు?

- కేడర్‌కు ధైర్యం చెప్పేందుకు జగన్ జిల్లాల పర్యటన
- నెలరోజుల క్రితం పార్టీ సమావేశంలో ప్రకటన
- ప్రతీ బుధ,గురువారాల్లో జిల్లాకేంద్రంలో కేడర్‌తో మీట్
- తర్వాత జనవరి నెలాఖరు నుంచి టూర్లు..జగన్ ప్రకటన
- ఇప్పుడు ఫిబ్రవరి 2,3వ వారాల్లో టూర్ అంటూ ప్రకటన
- టూర్ వాయిదా వెనుక విదేశీ పర్యటనే కారణమా

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జిల్లాల యాత్రకు శ్రీకారం చుడతానని దాదాపు నెల రోజుల క్రితం పార్టీ సమావేశాలలో చెప్పడం జరిగింది. తాను వచ్చి క్యాడర్‌కి ధైర్యం చెబుతాను భరోసా కల్పిస్తామని వారితోనే ఉంటానని ఆయన ప్రకటించారు. అంతే కాదు ప్రతీ బుధ గురువారం రెండు రోజుల పాటు జిల్లా కేంద్రంలో ఉండి క్యాడర్ ని

# ఏపీ డీజీపీగా మాదిరెడ్డి ప్రతాప్?

- ఈ నెలాఖరున రిటైర్ కానున్న డీజీపీ ద్వారాకా తిరుమలరావు
- ఐపీఎస్ అధికారులకు ఎక్స్‌టెన్షన్ ఇచ్చి సర్వీసు పొడిగించడం కుదరదు
- కొత్త డీజీపీని నియమించేందుకు సీఎం చంద్రబాబు కసరత్తు
- సీఎం మదిలో సీనియర్ ఐపీఎస్ అధికారి మాదిరెడ్డి ప్రతాప్

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

ఇక కూటమి అధికారంలోకి రావడంతోనే ఆర్టీసీ ఎండీగా ఉన్న ద్వారకా తిరుమలరావుని నియమించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ హయాంలో పనిచేసిన వారు అంతా పక్కకు వెళ్లారు. వైసీపీ పాలనలో జగన్ గౌతం సవాంగ్ కి మొదట చాన్స్ ఇచ్చారు. ఆ తరువాత రాజేంద్ర నాథ్ రెడ్డిని అపాయింట్ చేశారు. ఇక కూటమి అధికారంలోకి రావడంతోనే ఆర్టీసీ ఎండీగా ఉన్న ద్వారకా తిరుమలరావుని నియమించారు. ఆయన ఆర్టీసీ ఎండీగా అప్పటికి ఉన్నారు. దాంతో పాటు ఆయన సీనియారిటీ సిన్సియారిటీని దృష్టిలో పెట్టుకుని కూడా డీజీపీని చేశారు. ఇక జనవరి నెలాఖరుకు ద్వారకా తిరుమలరావు రిటైర్ కాబోతున్నారు. ఐపీఎస్ అధికారులకు ఎక్స్ టెన్షన్ ఇచ్చి సర్వీసుని పొడిగించడం కుదరదు. దాంతో కొత్త డీజీపీని నియమించాల్సి ఉంది. ఇదిలా ఉంటే చీఫ్ మినిస్టర్ చంద్రబాబు మదిలో సీనియర్ ఐపీఎస్ అధికారి మాదిరెడ్డి ప్రతాప్ పేరు ఉందని ప్రచారం సాగుతోంది. 1991 బ్యాచ్ కి చెందిన ప్రతాప్ సమర్ధవంతుడైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. ఇదిలా ఉంటే మాదిరెడ్డి ప్రతాప్ దివంగత నేత ఉమ్మడి ఏపీ మాజీ సీఎం వైఎస్సార్‌కి అత్యంత ఇష్టుడిగా పేరు తెచ్చుకున్నారని చెబుతారు. వైఎస్సార్ సీఎం గా ఉనన్ టైం లో ఏపీ ఇన్వెస్ట్మెంట్ ప్రమోషన్ బోడు సీఈవోగా నియమించారు. ఏపీకి ఆనాడు గూగుల్ క్యాంపస్ ని హైదరాబాద్ కి తీసుకుని రావడంతో ఎంతో కృషి చేశారు. ఉన్నత విద్యావంతుడిగా మాదిరెడ్డి ప్రతాప్ కి పేరు ఉంది. అంతే కాదు తనకు అప్పగించిన పోస్టింగులలో నూరు శాతం ఆయన పనితీరు చూపిస్తారు అని అంటారు. ఇక జగన్ పాలనలో మాత్రం మొదట్లో మాదిరెడ్డి ప్రతాప్ పట్ల సానుకూలంగా ఉన్నా ఆ తరువాత మాత్రం ఆయనకు సరైన పోస్టింగ్ దక్కలేదు అని ప్రచారంలో ఉంది. చంద్రబాబు సీఎం అయ్యాక కీలకమైన ఫైర్ సర్వీసెస్ డీజీగా మాదిరెడ్డి ప్రతాప్ ని నియమించారు. ఇక

# హిందూ ధర్మాన్ని నాశనం చేసిన 'కల్కి'

- సినిమా వాడిగా సిగ్గు పడుతున్నా: పాటల రచయిత అనంత శ్రీరాం
- హిందూ ధర్మాన్ని అవమానించేలా, అవహేళన చేసేలా, కించపరిచేలా తెలుగు సినిమాలు వస్తున్నాయి
- అలాంటి సినిమాలను బహిష్కరించాలని అనంత శ్రీరాం డిమాండ్

2




విజయవాడ-నవభూమిబ్యూరో

తెలుగు చలన చిత్ర పరిశ్రమపై ప్రముఖ గేయ రచయిత అనంత శ్రీరామ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నిప్పులు చెరిగారు. తెలుగు సినిమాలతో హిందూ ధర్మ వినాశనం జరుగుతోందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తాను కూడా ఓ సినిమా పరిశ్రమకు చెందిన వాడినే అయినప్పటికీ- తప్పును తప్పుగా చెప్పకపోతే ఈ హైందవ ధర్మంలో పుట్టినట్టే కాదని అన్నారు. విజయవాడలో హైందవ శంఖారావం సభ విజయవాడ కేసరపల్లిలో ఏర్పాటైన హైందవ శంఖారావం మహాసభలో అనంత శ్రీరామ్ పాల్గొన్నారు. విశ్వ హిందూ పరిషత్ ఈ సభను నిర్వహించింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో వీహెచ్‌పీ, హిందూ ధర్మాక సంఘాల నాయకులు, ప్రతినిధులు ఈ సభకు హాజరయ్యారు. ఈ సభను ఉద్దేశించి అనంత శ్రీరామ్ మాట్లాడారు. హిందూ ధర్మాన్ని అవమానించేలా, అవహేళన చేసేలా, కించపరిచేలా తెలుగు సినిమాలను తీస్తోన్నారని అన్నారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమకు అత్యధిక మంది నటులు, దర్శకులను అందించిన ఉమ్మడి కృష్ణా జిల్లా గడ్డ మీద నిలబడే తాను ఈ మాటలు అంటున్నానని అన్నారు. అలాంటి సినిమాలను బహిష్కరించాల ని డిమాండ్ చేశారు. పురాణాలు సైతం వక్రీకరణ.. ఎంతో ఘనకీర్తి కలిగిన మన పురాణాలు, ఇతిహాసాలను సైతం తెలుగు సినిమాలు కించపరుస్తోన్నాయని అనంత శ్రీరామ్ అన్నారు. తమ సన్నివేశాలకు తగ్గట్టుగా వాటిని మార్చుకుంటోన్నారని మండిపడ్డారు. ధర్మరాజు కంటే కర్ణుడిని గొప్పవాడిగా సినిమా



# ఏపీలో విద్యార్థులకు శుభవార్త.. డబ్బులు జమచేస్తామన్న ప్రభుత్వం

**అమరావతి-నవభూమి:**రాష్ట్రంలోని విద్యార్థులకు ఇబ్బందులు తొలగించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని కాలేజీ యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయనుంది. ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేసిన విజ్ఞప్తి మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులలో కొంత మొత్తం ముందస్తుగా విడుదల చేసి కాలేజీ యాజమాన్యాలకు భరోసా కల్పించాలని ఇటీవల జరిగిన ఏపీ కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే కాలేజీ యాజమాన్యాలు విద్యార్థుల్ని ఇబ్బంది పెట్టకుండా చూడాల్సిందిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలెక్టర్లను ఆదేశించారు. గత టీడీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విద్యార్థులు చదువుతున్న కళాశాల యాజమాన్యాల ఖాతాల్లోకే జమచేసేది. అయితే 2019 ఎన్నికల్లో గెలుపొంది అధికారంలోకి వచ్చిన వైసీపీ.. ఈ విధానాన్ని మార్చింది. కాలేజీలకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమచేసే విధానం తెచ్చారు. ఆ తర్వాత విద్యార్థులు, తల్లుల పేరిట జాయింట్ బ్యాంక్ ఖాతాలు తెరిపించి అందులో జమ చేయడం మొదలెట్టారు. విద్యార్థుల తల్లులు ఆ తర్వాత ఈ మొత్తాన్ని కాలేజీ యాజమాన్యాలకు చెల్లించాల్సి ఉండేది. అయితే వైసీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు బకాయిలు పెట్టడంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు అందించని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల ప్రచారం సమయంలో తాము అధికారంలోకి వస్తే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. నారా లోకేష్ సైతం యువగళం పాదయాత్రలో ఇదే విషయంపై విద్యార్థులకు హామీ ఇచ్చారు.



## తెలంగాణలో కొత్త పథకం.. 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' ఎలా ఇస్తారు..? రైతుల్లో ఎన్నో అనుమానాలు..!



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో మరో కొత్త పథకాన్ని ప్రకటించారు సీఎం రేవంత్ రెడ్డి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు.. భూమిలేని రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇవ్వగా.. అందుకు సంబంధించి ఇప్పుడు సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. జనవరి 04న జరిగిన కేబినెట్ భేటీలో ప్రధానంగా మూడు హామీలపై కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అందులో భాగంగా.. రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతు భరోసా పథకం ఒకటి కాగా.. కొత్త రేషన్ కార్డుల జారీ మరొకటి. ఈ రెండింటితో పాటు భూమిలేని రైతు కూలీలకు రూ.12 వేల ఆర్థిక సాయం కూడా ఇవ్వనున్నట్టు ప్రకటించారు. ఈ మూడు పథకాలు జనవరి 26వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. భూమిలేని వ్యవసాయ రైతు కుటుంబాలకు ఏడాదికి 12 వేల రూపాయలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. గతంలో తాను పాదయాత్ర చేసిన సమయంలో కౌలు రైతుల కష్టాలు తన దృష్టికి వచ్చాయని, అందుకే భూమిలేని వ్యవసాయ కుటుంబాలకు కూడా ఏడాదికి 12,000 రూపాయలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్టుగా తెలిపారు. ఈ పథకానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అని నామకరణం చేసినట్టుగా రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇదంతా బాగానే ఉంది కానీ.. అసలు ఈ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ఏ విధంగా ఇస్తారు? ఏ ప్రాతిపదికన రైతు కూలీలను గుర్తిస్తారు? కేవలం రైతు కూలీలకే ఇస్తారా.. కౌలు రైతులకు కూడా ఇస్తారా..? ఈ మొత్తాన్ని నెలకు ఇంతా అని ఇస్తారా.. ఒకేసారి మొత్తం అకౌంట్‌లో వేస్తారా..? ఇలా రకరకాల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంపైనే సర్వత్రా చర్చ నడుస్తోంది. భూములు ఉన్న రైతులు కొందరు వ్యవసాయం చేయలేక కౌలుకిస్తుంటారు. మరి ఆ కౌలు చేసే రైతులకు ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఆర్థిక సాయం ఇస్తే.. మరి అసలు భూములున్న రైతులకు రైతుభరోసా ఇస్తుందా ఇవ్వదా అన్నది ఇప్పుడు ప్రజల్లో నెలకొన్న ప్రధాన డౌటనుమానం. సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన.. కౌలు రైతులకు సంతోషాన్ని కలిగిస్తుండగా కౌలుకు భూములిచ్చిన రైతులకు మాత్రం ఆందోళన కలిగిస్తోంది. ఒకవేళ భూములు ఉన్న రైతులకు, భూమి లేకుండా వ్యవసాయం చేసే రైతులకు 12 వేల రూపాయలు ఇస్తే, ఈ పథకాలను మరికొంతమంది దుర్వినియోగం చేసే అవకాశం ఉంటుందన్న వాదన కూడా వినిపిస్తోంది. కౌలు రైతులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలంటే ఆ రైతు ఏ పొలంలో వ్యవసాయం చేస్తున్నారు..? దాని తాలూకా కౌలు పత్రాన్ని తీసుకోవాల్సి వస్తుందా.. ఒకవేళ అది సదరు రైతు ఇస్తే ఆ రైతుకు రైతు భరోసా వచ్చే అవకాశం ఉండదు.. మరి అలాంటప్పుడు కౌలు రైతులకు భూమి ఉన్న రైతులు సహకరించే పరిస్థితి ఉంటుందా అన్న చర్చ కూడా జరుగుతోంది. అసలు సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం ఆచరణ సాధ్యమైనదేనా అన్నది ప్రస్తుతం జోరుగా చర్చ నడుస్తోంది.

## కొత్త వైరస్‌పై భయాందోళనలు.. ఏపీ ప్రజారోగ్యశాఖ కీలక సూచనలు..



**అమరావతి -నవభూమి:**హెచ్ఎంపీవీ వైరస్.. పూర్తిగా చెప్పాలంటే హ్యూమన్ మెటా న్యూమో వైరస్.. గత కొన్ని రోజులుగా దేశ ప్రజలను ఆందోళన పరుస్తున్న అంశమిది. చైనాలో ఈ వైరస్ కేసులు భారీగా నమోదవుతున్న నేపథ్యంలో.. కరోనా తరహాలో మరో మహమ్మారి తప్పదా అనే ఆందోళన వ్యక్తమవుతోంది. చైనాతో పాటుగా జపాన్‌లోనూ భారీగా కేసులు నమోదవుతున్న వేళ.. ఈ భయం మరింత ఎక్కువైంది. ఇక ఇప్పటికే కొవిడ్ మహమ్మారి విలయ తాండవాన్ని చూసిన దేశం, కేంద్ర ప్రభుత్వం.. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ కొత్త వైరస్ గురించి ఎప్పటికప్పుడు సమీక్షలు జరుపుతోంది. ప్రస్తుతానికి మన దేశంలో ఈ కొత్త వైరస్ కేసులేవీ నమోదు కాలేదని.. ఆందోళన అక్కర్లేదని అధికారులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలోనే హెచ్ఎంపీవీ వైరస్ గురించి ఏపీ ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ పద్మావతి కీలక వ్యాఖ్యలు చేశారు. హెచ్ఎంపీవీ వైరస్ సోకిన తర్వాత మూడు నుంచి 10 రోజుల్లోగా వ్యాధి లక్షణాలు బయటపడుతాయని చెప్పారు. సాధారణ జలుబు లక్షణాలే ఈ వైరస్ సోకిన వారికి కూడా ఉంటాయన్న ఏపీ ప్రజారోగ్యశాఖ డైరెక్టర్.. దగ్గు, గొంతు నొప్పి, ముక్కు కారడం, ముక్కు దిబ్బెడ వంటి సమస్యలు కన్పిస్తాయని తెలిపారు. అయితే ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో హెచ్ఎంపీవీ కేసులు లేవని పద్మావతి తెలిపారు. దేశంలోనూ ఎలాంటి కేసులు నమోదు కాలేదని వివరించారు. కొత్త వైరస్ గురించి ప్రజలు ఎవరూ భయపడాల్సిన పనిలేదన్నారు. కొత్త వైరస్ న్యూమో విరిలే కుటుంబానికి చెందినదని.. కొవిడ్ తరహాలోనే ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఏపీ ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ పద్మావతి వెల్లడించారు. వైరస్ సోకిన వ్యక్తులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వారి నోటి నుంచి వెలువడే తుంపర్ల ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తుందన్నారు. వ్యాధి సోకిన వారితో షేక్ హ్యాండ్స్, సన్నిహితంగా మెలగడం ద్వారా వైరస్ విస్తరించే అవకాశం ఉందన్నారు. వైరస్ సోకిన వారిలో సాధారణ ఫ్లూ లక్షణాలే ఉంటాయని.. కొన్నిసార్లు న్యూమోనియా, బ్రాంకైటిస్ (ఆస్తమా) వంటి

## జగన్ జిల్లా టూర్లకు ఆదిలోనే..

**(1వపేజీ తరువాయి)**పూర్తి స్థాయిలో కలుస్తాను అని వారి నుండి అభిప్రాయాలు సేకరించడం ద్వారా పార్టీని గ్రౌండ్ లెవెల్ నుంచి పునరుత్తేజం కల్పించేలా చూస్తాను అని జగన్ ప్రకటించారు. దీంతో జగన్ జిల్లాల టూర్ మీద వైసీపీలో కొంత ఉత్సాహం కనిపించింది. మొదట సంక్రాంతి పండుగ తరువాత అన్నారు, ఆ తరువాత జనవరి నెలాఖరు అన్నారు. అయితే ఇపుడు చూస్తే ఆదిలోనే బ్రేకులు పడేట్టుగా ఉన్నాయని అంటున్నారు. జగన్ ఈ నెల 11 నుంచి రెండు వారాల పాటు లండన్ ట్రిప్ పెట్టుకున్నారు. ఈ మేరకు ఆయన సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి విదితమే. తన విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వాలని ఆయన కోరారు. దాని మీద విచారణ ఈ నెల 8కి వాయిదా పడింది. ఆ రోజున కోర్టు ఇచ్చే తీర్పు బట్టి జగన్ పర్యటన ఉండొచ్చు. అయితే జగన్ కి అనుమతి లభిస్తే ఆయన ఈ నెలాఖరు వరకూ విదేశాలలోనే ఉండే చాన్స్ ఉంది. ఆయన నెల చివరికి వచ్చినా అప్పటి నుంచి జిల్లా పర్యటనకు ఏర్పాట్లు చేయడం అంటే కుదిరేది కాదు, కాబట్టి అన్నీ చూసుకుని మాఘమాసం లో మంచి ముహూర్తాన జగన్ జిల్లాల పర్యటనలకు సిద్ధపడతారు అని అంటున్నారు అంటే ఫిబ్రవరి రెండో వారంలో కానీ మూడవ వారంలో కానీ జగన్ జిల్లాల టూర్ ఉండే చాన్స్ ఉందని అంటున్నారు. అయితే వైసీపీకి మొత్తం దిక్కు అయిన జగన్ జిల్లాల టూర్ పేరుతో జనంలోకి వస్తేనే పార్టీ యాక్టివ్ అవుతుందని నాయకులు అంటున్నారు. గతంలో విపక్షంలో ఉన్నపుడు జగన్ పెద్దగా ఆలస్యం చేయకుండానే ప్రజలలోకి వచ్చారు. అయితే ఈసారి అయిదేళ్ల పాటు అధికారంలో ఉన్న పార్టీగా వైసీపీ జనంలోకి వెళ్తోంది. కాబట్టి తమ ప్రభుత్వానికి కూటమి ప్రభుత్వ పాలంకు మధ్య జనాలు తేడా తెలుసుకోవడానికి కొంత వ్యవధి ఇవ్వాలన్న ఆలోచనతొనే జగన్ ఈ విధంగా ఆరేడు నెలల సమయం తీసుకున్నారు అని అంటున్నారు. మొత్తం మీద జగన్ ఎంత వేగంగా జనంలోకి వస్తే అంత పార్టీకి మేలు అన్న మాట ఉంది. అయితే జనవరి నెలలో జగన్ విదేశీ పర్యటన ఉండడంతో ఫిబ్రవరికి ఆయన టూర్లు వాయిదా పడవచ్చు అన్నది వినిపిస్తున్న మాట. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## ఏపీ డీజీపీగా మాదిరెడ్డి ప్రతాప్?

**(1వపేజీ తరువాయి)**ఆయన బుడమేరు వరదల సమయంలో చేసిన విశేష కృషి విధి నిర్వహణలో చూపించిన అంకిత భావానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చాలా ఇంప్రెస్ అయ్యారని చెబుతారు. దాంతో ఆయనకే కొత్త డీజీపీగా అపాయింట్మెంట్ అన్నది ఖరారు అవుతుంది అని అంటున్నారు. అయితే సీనియర్ల జాబితాలో హరీష్ కుమార్ గుప్తా, పీఎస్ఆర్ ఆంజనేయులు, , కేవీఆర్ ఎన్ రాజేంద్రనాథ్ రెడ్డి, నలిన్ ప్రభాత్, మహేష్ దీక్షిత్, అమిత్ గార్గ్ వంటి వారు ఉన్నారు. అయితే బాబు మాత్రం కొత్త డీజీపీగా మాదిరెడ్డి ప్రతాప్ పేరుని కన్ ఫర్మ్ చేసే ఆలోచనలో ఉన్నారని ప్రచారం సాగుతోంది. ఇప్పటికే కొత్త సీఎస్ గా విజయానంద్ ని నియమించారు. డీజీపీగా మాదిరెడ్డి ప్రతాప్ కి చాన్స్ ఇవ్వడం ద్వారా పాలనను పూర్తి స్థాయిలో పరుగులు పెట్టించాలని చూస్తున్నారు అని అంటున్నారు. అన్నీ అనుకూలిస్తే కనుక కొత్త డీజీపీ మాదిరెడ్డి ప్రతాప్ అవుతారు అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## హిందూ ధర్మాన్ని నాశనం చేసిన 'కల్కి'

**(1వపేజీ తరువాయి)**రంగం చిత్రీకరించిందని విమర్శించారు. అగ్నిదేవుడు ఇచ్చిన ధనస్సును అందుకున్న అర్జునుడి కంటే సూర్యుడు ఇచ్చిన ధనస్సును చేతబట్టిన కర్ణుడు వీరుడంటూ ఇటీవలే వచ్చిన కల్కి సినిమాలో చెప్పారని, యుద్ధంలో నెగ్గేది ధనస్సా, ధర్మమా అని మనం ప్రశ్నించుకుండా మనం ఊరుకుంటామా? అని ప్రశ్నించారు అనంత్ శ్రీరామ్. రాముడు-లవకుశల మధ్య యుద్ధమా? రాయి అహల్యగా మారినట్లు, శ్రీరాముడు- లవకుశ మధ్య యుద్ధం జరిగినట్లు చిత్రీకరణకు అందంగా ఉండటానికి వాల్మీకీ రాసిన రామాయణాన్ని సైతం తెలుగు చిత్ర పరిశ్రమ వక్రీకరించిందని అనంత శ్రీరామ్ అన్నారు.

# తెలంగాణలో వారందరికీ శుభవార్త.. ప్రతీ నెలా 5వ తేదీలోపే ఖాతాల్లోకి డబ్బులు.. మంత్రి కీలక ప్రకటన



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో.. గ్రామీణ ప్రజలకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించేందుకు కృషి చేయాలని డీపీఓలకు సీతక్క సూచించారు. ఈ క్రమంలోనే.. సీతక్క శుభవార్త వినిపించారు. గ్రామాల్లోని సఫాయి కార్మికులతో పాటు మల్టీపర్పస్ వర్కర్లకు ప్రతి నెలా.. ఐదో తారీఖులోపే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి వివరించారు. కోయ జాతికి చెందిన తాను కాంగ్రెస్ ఇచ్చిన అవకాశంతో మంత్రి పదవి చేపట్టానని మంత్రి సీతక్క గుర్తుచేశారు. తాను ఎంత సున్నితమో అంత కఠినం కూడా అని.. సీతక్క చెప్పుకొచ్చారు. హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో.. జిల్లా పంచాయతీ అధికారులతో సీతక్క సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలోనే... గ్రామీణాభివృద్ధి, పల్లెల్లో పారిశుద్ధ్యం, ప్రజల సంక్షేమంపై సీతక్క కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రామాలను ప్రగతి పథంలో నిలపాల్సిన బాధ్యత డీపీఓలదేనని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గ్రామీణ ప్రజలకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించేందుకు కృషి చేయాలని.. గ్రామాల్లో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల ప్రగతికి స్థానిక పరిస్థితులను బట్టి ప్రణాళికలు రూపొందించి.. వాటిని అమలు చేయాల్సిన బాధ్యత ఉందని మంత్రి సూచించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు లేకపోయినా, ఒత్తిడి తట్టుకుని పనిచేసిన డీపీఓలను మంత్రి సీతక్క అభినందించారు. గ్రామీణ ప్రజలకు సేవ చేసే భాగ్యం దక్కిందని.. అందుకే ఉద్యోగాన్ని కేవలం పనిగా కాకుండా బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. సిబ్బందితో అధికారులు స్నేహపూర్వక సంబంధాలను కొనసాగిస్తూ.. పనుల పురోగతిని పర్యవేక్షించాలన్నారు. సిబ్బందితో ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షలు నిర్వహించి.. పనుల్లో వేగం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. "నా శాఖను నేను నా కుటుంబంగా భావిస్తున్నాను. పంచాయతీ రాజ్ శాఖ మన అందరిదీ. మీరూ దీన్ని కుటుంబంగా భావించి పని చేయాలి." అని మంత్రి సీతక్క తెలిపారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు సఫాయి కార్మికులు, మల్టీపర్పస్ వర్కర్ల పాత్ర ఎంతో ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. గ్రామాల్లో వీరి సేవలకు తగిన గుర్తింపు ఇవ్వాలనే ఉద్దేశంతో.. ఇకపై ప్రతి నెల 5వ తేదీలోపు జీతాలు చెల్లించేలా చర్యలు చేపట్టినట్టు మంత్రి తెలిపారు. గ్రామ పంచాయతీ ద్వారా కాకుండా కమిషనర్ కార్యాలయం నుంచే జీతాలు చెల్లించే విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్యల నివారణ కోసం ప్రత్యేక దృష్టి పెట్టాలని.. గ్రామీణ నీటి సరఫరా అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. సరఫరా చేసే తాగు నీటిపై ప్రజల్లో నమ్మకం కల్పించడమే లక్ష్యమని, సమ్మర్ యాక్షన్ ప్లాన్ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు సహకారం ఎప్పుడు ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. కింది వర్గాల సామర్థ్యంపై ఉన్న దురాభిప్రాయాలను తమ పనితీరుతో తప్పనిసరిగా నిరూపించాలని మంత్రి సీతక్క అన్నారు.

# డిండికి మహర్దశ

**(1వపేజీ తరువాయి)**వీటి నిర్మాణాలకు రూ.1800 కోట్ల అంచనాతో టెండర్లు పిలవాలని నీటిపారుదల శాఖ ప్రతిపాదనలను ఆమోదించిం ది. ఈనిర్మాణంలో భాగంగా ఏదుల రిజర్వాయర్ నుంచి 800 మీటర్ల అప్రోచ్ ఛానల్, 2.525 కిలోమీటర్ల ఓపెన్ కెనాల్, తొమ్మిది మీటర్ల డయాతో 16 కిలోమీటర్ల టన్నెల్, మళ్లీ 3.050 కిలోమీటర్ల ఓపెన్ కెనాల్ నిర్మిస్తారు. మొత్తం 21.575 కిలోమీటర్ల తర్వాత ఈ నిర్మాణం దుందుభి నదిలోకి వెళుతుంది. అక్కడి నుంచి 6.325 కిలోమీటర్ల తర్వాత ఉన్న పోతిరెడ్డిపాడు చెక్‌డ్యామ్‌కు 1.5 కిలోమీటర్ల దిగువన ఉల్పర వద్ద బ్యారేజీని నిర్మిస్తారు. అయితే పోతిరెడ్డిపాడు చెక్‌డ్యామ్ స్థానంలో రబ్బర్‌డ్యాం నిర్మిస్తారు. త్వరలోనే డిజైన్లకు తుదిరూపమిచ్చి గ్లోబల్ టెండర్లు ఆహ్వానించనున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. ఏదుల-డిండి అనుసంధానానికి, వాటి పనులు చేపట్టేందుకు కేబినెట్ ఆమోదం తెలిపినప్పటికీ ఈ లింక్ ద్వారా ఎలాంటి ఆటంకాల్లేకుండా నీరందాలంటే పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాలకు పర్యావరణ అనుమతులు రావాల్సి ఉంది. పర్యావరణ అనుమతులొస్తేనే ఏదులకు నార్లాపూర్ నుంచి పూర్తిస్థాయి నీరందుతుందని, తద్వారా ఏదుల నుంచి డిండికి రావాల్సిన 30 టీఎంసీల నీరు సీజన్‌లో చేరుతుందని చెబుతున్నారు. పాలమూరు-రంగారెడ్డి పథకంపై జాతీయగ్రీన్ ట్రిబ్యునల్‌లో పర్యావరణ ఉల్లంఘన కేసు నమోదవడంతో, కేంద్ర పర్యావరణ శాఖ నుంచి అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కేసు క్లియరెన్స్, కేంద్ర పర్యావరణ అనుమతుల కోసం బాధ్యతలను ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ అండ్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ (ఈపీటీఆర్ఐ)కి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఇందుకోసం ఆసంస్థకు రూ.87.95లక్షల మొత్తాన్ని కూడా చెల్లించింది. ఈ అనుమతుల కోసం మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రంతో చర్చలు జరుపుతోంది. ఈ క్లియరెన్సులు వస్తేనే పనులు ఎలాంటి ఆటంకాల్లేకుండా పూర్తవడంతోపాటు కేటాయింపుల మేరకు నీరు డిండి ఎత్తిపోతలకు చేరనుంది. పాలమూరు-రంగారెడ్డిలో కీలకమైన నార్లాపూర్ వద్ద ఏర్పాటు చేస్తున్న 145 మెగావాట్ల సామర్థ్యంగల ఎనిమిది పంపులు పూర్తిస్థాయిలో పనిచేయాల్సి ఉండగా, కేసుల ప్రభావంతో కేవలం రెండింటినే నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రస్తుతం ఏదుల-డిండి లింక్ పనులు చేపట్టడంతోపాటు, మరోవైపు దిగువన రిజర్వాయర్ల పెండింగ్ పనులు, పెండింగ్ భూసేకరణ పనులు, కాల్వల నిర్మాణ పనులు సమాంతరంగా చేపట్టి పూర్తిచేయాలని, అదే సమయంలో కేంద్ర అనుమతులు సాధించేలా కార్యాచరణ అమలు చేయాలని భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులకు సూచించారని ఇంజనీర్లు తెలిపారు.

## జాతీయ రాజకీయాల్లో తగ్గిన తెలుగువారి పాత్ర

**(1వపేజీ తరువాయి)**తెలుగువారంతా ఒకే వేదిక మీదకు రావడం సంతోషంగా ఉందన్నారు. విదేశాలకు వెళ్లిన వారికి తెలుగుతో అనుబంధం తగ్గిపోతోంద న్నారు సీఎం రేవంత్. నాలెడ్జ్ కోసం ఏ భాష నేర్చుకున్నా తెలుగును తక్కువగా చేయొద్దని సూచించారు. హైదరాబాద్‌లో అద్భుతమైన అంతర్జాతీయ సంస్థలున్నాయని, నగర అభివృద్ధికి పాటుపడేందుకు తెలుగు పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. రాజీవ్ గాంధీ ఈ దేశానికి కంప్యూటర్ పరిచయం చేసి.. సాంకేతిక నైపుణ్యాన్ని అందించారని.. ఆ తర్వాత నారా చంద్రబాబు నాయుడు కంప్యూటర్ యుగాన్ని ముందుకు తీసుకెళ్లారని సీఎం రేవంత్ తెలిపారు.

ఐటీని వేగంగా అభివృద్ధి చేసే ముఖ్యమంత్రిగా నిర్ణయాలు తీసుకోవడంతో ఈరోజు ఈ ప్రాంతమంతా అత్యంత ఆధునిక సాంకేతిక నైపుణ్యంతో అభివృద్ధి జరుగుతోందన్నారు. ఈ అభివృద్ధి ప్రపంచంతో పోటీ పడే విధంగా మనకు అవకాశాలు కల్పిస్తోందన్నారు సీఎం రేవంత్. దానికి కొనసాగింపుగా వైఎస్ఆర్ హయాంలో ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ, ఫార్మా రంగాల్లో పెట్టుబడులతో మరింత ముందుకు తీసుకెళ్లారని రేవంత్ వివరించారు. దేశంలో ఉత్పత్తి అవుతున్న బల్క్ డ్రగ్‌లో 35 శాతం మన హైదరాబాద్ నుంచి తెలుగువాళ్లే ఉత్పత్తి చేస్తున్నారంటే ఇది మనందరికీ గర్వకారణమని రేవంత్ పేర్కొన్నారు. తెలంగాణ ఆదాయంలో 65 శాతం హైదరాబాద్ నుంచే వస్తుందన్నారు. అందుకు కారణం ఆనాటి ముఖ్యమంత్రులు తీసుకున్న కీలక నిర్ణయాలే కారణమని వ్యాఖ్యానించారు. జాతీయ రాజకీయాల్లో తెలుగువారి ప్రభావం తగ్గిపోతుందన్న సీఎం రేవంత్.. నీలం సంజీవరెడ్డి, పీవీ నరసింహారావు, నందమూరి తారక రామారావు దేశ రాజకీయాల్లో ఎంతో కీలక పాత్ర పోషించారని రేవంత్ అన్నారు.

ఆ తర్వాత వెంకటస్వామి, జైపాల్ రెడ్డి, వెంకయ్యనాయుడు జాతీయ రాజకీయాల్లో ప్రభావం చూపారన్నారు. రెండు మూడు తరాలకు మధ్య చంద్రబాబు నాయుడు, వైఎస్ఆర్ ప్రభావం చూపించినా.. ప్రస్తుతం జాతీయ రాజకీయాల్లో తెలుగువారి పాత్ర సన్నగిల్లుతోందన్నారు. సీజేఐగా ఎన్వీ రమణ, ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు, ఉత్తమ పార్లమెంటేరియన్ గా జైపాల్ రెడ్డి రాణించిన సందర్భాలున్నాయన్నారు. అయితే, నేడు చట్టసభల్లో ఎవరైనా తెలుగువారు మాట్లాడతారా అని ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## హైడ్రా మళ్లీ దూకుడు!

**(1వపేజీ తరువాయి)**ప్రస్తుతం ఇంకా ఇది నిర్మాణ దశలోనే ఉంది. దాదాపు చివరి దశలో ఉంది. ఈ అపార్ట్‌మెంట్ అక్రమంగా నిర్మిస్తున్నారంటూ స్థానికుల నుంచి హైడ్రాకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. హైకోర్టు, జీహెచ్ఎంసీ ఆదేశాలు జారీ చేసినా అక్రమ నిర్మాణం కొనసాగుతున్నాయంటూ స్థానికులు హైడ్రా దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో నిన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు అయ్యప్ప సొసైటీని సందర్శించారు. 100 ఫీట్ రోడ్డు పక్కనే నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్ నిర్మాణం అక్రమమని తేల్చారు. హైకోర్టు ఆదేశాలు, జీహెచ్ఎంసీ ఇచ్చిన నోటీసులను సైతం బిల్డర్ బేఖాతర్ చేశాడని తేలింది. సెల్లార్‌తోపాటు జీ ప్లస్ 5 అంతస్తులు కలిగిన ఈ భవనం అక్రమ నిర్మాణం అంటూ 2024 ఫిబ్రవరిలోనే నిర్ధారించారు. అయినా బిల్డర్ పట్టించుకోకుండా నిర్మిస్తూనే ఉన్నాడు. దానిపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు కూడా ఆదేశించింది. జూన్‌లో జీహెచ్ఎంసీ మరోసారి నోటీసులు పంపింది. అయినా బిల్డర్ పట్టించుకోలేదు. దీంతో హైడ్రా రంగ ప్రవేశం చేసింది. స్వయంగా రంగనాథ్ వచ్చి చూశారు. అక్రమ నిర్మాణమే అని నిర్ధారించుకున్న తరువాత ఈ ఉదయం నుంచి కూల్చివేత పనులు ప్రారంభించారు.

## బాత్రూముల్లో వీడియోల

**(1వపేజీ తరువాయి)**రాత్రి విద్యార్థినులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో ఈ ఘటనను సుమోటోగా స్వీకరించింది తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్. వెంటనే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని హైదరాబాద్ సీపీని మహిళా కమిషన్ ఆదేశించింది. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇప్పటికే ఐదుగురు అనుమానితుల ను అదుపులోకి విచారిస్తున్నారు. వారి సెల్ ఫోన్లను పరిశీలిస్తున్నారు. కాగా, నిందితులు వీడియోలు చిత్రీకరిస్తున్న సమయంలో కిటికీలపై కొన్ని చేతి ముద్రలు ఉండడాన్ని గమనించిన విద్యార్థినులు ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయంపై మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని తెలిపారు. విద్యార్థినుల వసతి గృహాలను పరిశీలించిన వారు కొన్ని గదులు సిబ్బందికి అనుసంధానం చేసి ఉన్నాయని తెలిపారు. అలా ఉండటం వల్ల వీడియోలు తీయడానికి ఆస్కారం ఉందన్నారు. బాత్రూంల వెంటిలేటర్లు ఇతర గదులకు అనుసంధానం చేసి ఉన్నాయని ఏసీపీ తెలిపారు. అనుమానితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్లలో వీడియోలు తీశారా?, డిలీట్‌చేశారా? లేదా అన్నదానికి కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ద్వారా తెలుసుకుంటున్నామని చెప్పారు. ఒకవేళ రుజువైతే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

## లవర్స్‌కు ఓయో బిగ్ షాక్..

**(1వపేజీ తరువాయి)**ఏకాంతంగా గడపటానికి ఎక్కువగా ఓయో రూమ్స్‌ను తమకు బెస్ట్ ఛాయిస్‌గా ఎంపిక చేసుకుంటున్నారు. ఓయో రూమ్స్ లవర్స్‌గా అడ్డగా మారిపోయిందనే చెప్పాలి. ఓయో రూమ్స్ పట్ల సమాజంలో ఏ రకమైన భావన ఉందో అందరికీ తెలిసిందే. నార్మల్ ఫ్యామిలీస్ ఓయో రూమ్ అంటేనే అసహ్యించుకునే రోజులు వచ్చాయి. అసాంఘిక కార్యకలాపాలకు ఓయో రూమ్స్ అడ్డాగా మారాయి. ఈ హోటల్స్‌పై పోలీసులు స్పెషల్ నజర్ పెట్టాల్సిన ఆవశ్యకత కనిపిస్తుంది. వ్యక్తిగత సమాచారంతో పాటు, ఫోన్ నెంబర్ తీసుకున్న తర్వాతే రూం ఇవ్వడం జరుగుతోంది. ఇదిలా ఉంటే న్యూ ఇయర్ వేడుకల సమయంలో ఓయో రూమ్స్ బుకింగ్ కూడా రికార్డు స్థాయిలో జరిగినట్టు లెక్కలు చెబుతున్నాయి. యూత్ ఎక్కువగా ఓయో రూమ్స్ బుకింగ్ చేసుకున్నట్టు తెలుస్తోంది. న్యూ ఇయర్ వేడుకల్లో ఓయో రూమ్స్‌కు ప్రేమికులు క్యూ కట్టారు. 10 లక్షల మందికి పైగానే ఓయో రూమ్స్ బుక్ చేసుకున్నట్టు యాజమాన్యం ఓ ప్రకటన విడుదల చేసింది. దీంతో పెద్ద ఎత్తున ఓయో రూమ్స్‌పై విమర్శలు వినిపించాయి. అయితే తాజాగా ఓయో సంస్థ తాజాగా తమ రూల్స్‌ను మార్చింది. ఇక మీదట పెళ్లి అయిన వారికి మాత్రమే ఓయో రూమ్స్ ఇవ్వాలనే నిబంధనను తీసుకువచ్చింది. కేవలం వివాహం అయిన వారికి మాత్రమే ఇక మీదట రూమ్స్ ఇవ్వాలని నిర్ణయించింది. ఓయో కొత్త రూల్ ప్రకారం ఓయో రూమ్స్ వచ్చే వారి రిలేషన్ గురించి మొదట ప్రశ్నిస్తారు. తర్వాత వారి రిలేషన్‌కి సంబంధించిన ప్రూఫ్‌ను ఒకటికి రెండుసార్లు చెక్ చేసిన తర్వాతే వారికి రూమ్‌ను కేటాయించడం జరుగుతోంది. ఓయో సంస్థ తీసుకున్న ఈ నిర్ణయం లవర్స్‌కు పెద్ద దెబ్బ అని చెప్పాలి. తాజా రూల్స్‌ప్రకారం.. అవివాహిత జంటలు ఇకపై రూమ్స్‌లో చెక్‌ఇన్‌చేయలేరు. అయితే, ఇది ప్రస్తుతం యూపీలోని మీరట్‌లో మాత్రమే అమల్లో ఉంది. రానున్న రోజుల్లో మరిన్ని నగరాల్లో ఈ రూల్‌తీసుకువచ్చే అవకాశం కనిపిస్తోంది.


## ప్రధాని మోదీ పర్యటన..

**(1వపేజీ తరువాయి)**ప్రధానితోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ డిప్యూటీ సీఎం పవన్ కేంద్ర మంత్రులు ఉంటారు. సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు ప్రధాని సభా ప్రాంగణంలో ఉంటారు. పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. బహిరంగ సభలో తొలుత గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం ప్రసంగాల తర్వాత ప్రధాని ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారు. సాయంత్రం 6.30 గంటలకు సభ ముగిసిన తర్వాత తిరిగి రోడ్డు మార్గాన ఎయిర్‌పోర్టుకు చేరుకుని ఏడు గంటలకు ఢిల్లీ బయలుదేరి వెళతారు. కాగా, పూర్తిగా ఇది అధికారిక పర్యటన కావటంతో రాజకీయ ప్రసంగాలు చేసే అవకాశం లేదని అంచనా వేస్తున్నారు. ప్రధాని స్పందన ఇదే సమయంలో కేంద్రంలో ప్రధానిగా మూడో సారి బాధ్యతలు చేపట్టిన తరువాత మోదీ ఏపీ విషయంలో అన్ని అంశాల పట్ల సానుకూలంగా ఉంటున్నారు. ఇప్పటికే అమరావతి, పోలవరం అంశాల్లో ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. నిధులు ప్రకటించారు. ఇప్పుడు ఈ పర్యటనలో విశాఖ రైల్వే జోన్ కు శంకుస్థాపన చేయనున్నారు. అదే సమయంలో రాష్ట్రంలో చాలా కాలంగా పెండింగ్ అంశంగా ఉన్న స్టీల్ ప్లాంట్ పైన నిర్ణయం ప్రకటించాలనే డిమాండ్ వినిపి స్తోంది. జమిలికి సిద్ధం అవుతున్న వేళ దక్షిణాదిన తెలుగు రాష్ట్రాలకు ఇప్పుడు బీజేపీకి కీలకంగా మారుతున్నాయి. ఈ క్రమంలో స్టీల్ ప్లాంట్ పైన ప్రకటన చేస్తారా అనే చర్చ వినిపిస్తోంది. ప్రధాని తన ప్రసంగంలో ఏం చెప్పబోతున్నారనేది ఇప్పుడు ఆసక్తి కరంగా మారుతోంది.

## ఫాంపాండ్‌లో పడి రైతు మృతి

**బిజినేపల్లి-నవభూమి:** ఫాంపాండ్‌లో పడి రైతు మృతి చెందిన సంఘటన నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని నందివడ్డేమాన్‌లో చోటుచేసు కున్నది. నంది వడ్డేమాన్ గ్రామానికి చెందిన రైతు బంగారయ్య (45) పొలంలో తవ్విన ఫాంపాండ్ ద్వారా పంట సాగు చేశా డు. రోజు మాదిరిగా శనివారం సా యంత్రం పంటకు నీరు పారించేం దుకు వెళ్లాడు. ఫాంపాండ్‌లో ఏర్పాటు చేసిన మోటారు ఫుట్‌బాల్‌కు చెత్త అడ్డు వచ్చి నీళ్లు రాలేదు. తాడు సాయంతో నీటిలోకి దిగి చెత్త తీస్తుండగా తాడు తెగిపోయింది. అతనికి ఈత రాకపోవడంతో నీట మునిగి మృతి చెందాడు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 | హైదరాబాద్ సోమవారం 06 । జనవరి । 2025

# ప్రియాంక గాంధీ చెంపల మాదిరిగా రోడ్లను నున్నగా చేస్తా..



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీలో త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న బీజేపీ అభ్యర్థి రమేష్ బిధురివివాదస్పద వ్యాఖ్యలు చేశారు. రానున్న ఎన్నికల్లో తాను గెలిస్తే కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా చెంపల మాదిరిగా తన అసెంబ్లీ నియోజకవర్గంలోని రోడ్లను నున్నగా చేస్తానని అన్నారు. ఈ నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. ఢిల్లీ సీఎం అతిషిపై కల్కాజీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న రమేష్ బిధురి ఆదివారం ఒక కార్యక్రమంలో మాట్లాడారు. ‘బీహార్ రోడ్లను హేమమాలిని చెంపల వలె నున్నగా చేస్తానని లాలూ యాదవ్ ఒకసారి ప్రస్తావించారు. కానీ ఆ వాగ్దానాన్ని నెరవేర్చడంలో ఆయన విఫలమయ్యారు. అయితే ఓఖ్లా, సంగమ్ విహార్‌లోని రోడ్లను మేం అభివృద్ధి చేశాం. అదే మాదిరిగా కల్కాజీలోని ప్రతి రహదారి ప్రియాంక గాంధీ చెంపల మాదిరిగా నున్నగా ఉండేలా చూస్తాం’ అని అన్నారు.కాగా, బీజేపీ అభ్యర్థి రమేష్ బిధురి వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. ఆ పార్టీ నాయకురాలు సుప్రియా శ్రీనాట్ ఘాటుగా విమర్శించారు. ఆయన వ్యాఖ్యలు సిగ్గుచేటని అన్నారు. బీజేపీ మహిళా వ్యతిరేక ఆలోచనకు ఇది నిదర్శమని ఆరోపించారు. ‘ప్రియాంక గాంధీ గురించి రమేష్ బిధురి చేసిన ప్రకటన సిగ్గుచేటు మాత్రమే కాదు, మహిళల పట్ల ఆయన అసహ్యకరమైన మనస్తత్వాన్ని కూడా చూపుతున్నది. తోటి ఎంపీపై పరుష పదజాలం వాడి ఎలాంటి శిక్ష అనుభవించని వ్యక్తి నుంచి ఇంకేం ఆశించాలి? బీజేపీ అసలు ముఖం ఇదే’ అని ఎక్స్‌లో విమర్శించారు.

## ఓయో సంచలన నిర్ణయం.. ఇకపై లవర్స్‌కు నో రూమ్స్!




ఓయో సంచలన నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి పెళ్లికాని జంటలకు రూమ్స్ ఇవ్వకూడదని నిర్ణయించుకుంది. ఈ మేరకు చెక్ ఇన్ పాలసీలో కీలక మార్పులు తీసుకొచ్చింది.ఇకపై జంటలు ఓయోలో రూమ్ తీసుకోవాలంటే వారి పెళ్లి చెల్లుబాటు అయ్యే ఐడీ ప్రూఫ్స్‌ను సమర్పించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో అయినా.. ఆఫ్‌లైన్‌లో అయినా సరే రూమ్ బుక్ చేసుకునే సమయంలో తమ రిలేషన్‌షిప్‌ను నిర్ధారించే ఐడీ ప్రూఫ్‌ను సమర్పించాల్సి ఉంటుంది. సరైన ఐడీ ప్రూఫ్స్ లేకపోతే బుకింగ్స్‌ను తిరస్కరించాలని తమ పార్టనర్ హొటల్స్‌కు ఓయో సూచించింది. ఈ నిబంధన మొదట మీరట్‌లో ప్రయోగాత్మకంగా ప్రారంభం కానుంది. అక్కడ వచ్చే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఈ చెక్‌ఇన్ పాలసీని మిగతా నగరాల్లో అమలు చేయనున్నారు.

## కారును ఢీకొట్టిన డంపర్.. ఇద్దరు బీజేపీ నేతలు మృతి



**భువనేశ్వర్-నవభూమి:** బీజేపీ నేతలు ప్రయాణించిన కారును డంపర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు బీజేపీ నేతలు మరణించారు. మరికొందరు గాయపడ్డారు. అయితే ఉద్దేశపూర్వకంగానే డంపర్ డ్రైవర్ తమ కారును ఢీకొట్టినట్లు గాయపడిన బీజేపీ నేతలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒడిశాలోని సంబల్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కొందరు బీజేపీ నేతలు కారులో భువనేశ్వర్ నుంచి కర్డోలాకు తిరిగి వెళ్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున ఎన్‌హెచ్ 53లో ఆ కారును డంపర్ ఢీకొట్టింది. దీంతో అది బోల్తా పడింది. బీజేపీ గోశాల మండల అధ్యక్షుడు దేబేంద్ర నాయక్, మాజీ సర్పంచ్ మురళీధర్ చురియా ఈ ప్రమాదంలో మరణించారు. డ్రైవర్‌తోపాటు మరో ముగ్గురు బీజేపీ నేతలు గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.కాగా, డంపర్ డ్రైవర్ తమ కారును మూడు సార్లు ఢీకొట్టినట్లు గాయపడిన బీజేపీ నేత సురేష్ చందా ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగానే ఈ ప్రమాదం కలిగించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో డంపర్ డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కృష్ణ జింకను చంపిన చిరుత.. షాక్‌తో మరో ఏడు జింకలు మృతి




**అహ్మదాబాద్-నవభూమి;** జింకలున్న సఫారీ పార్క్‌లోకి చిరుతపులి ప్రవేశించింది. ఒక కృష్ణ జింకను అది చంపింది.అయితే భయం, షాక్ వల్ల మరో ఏడు జింకలు చనిపోయాయి. ఈ విషయం తెలిసి అటవీశాఖ అధికారులు ఆశ్చర్యపోయారు. గుజరాత్‌లోని నర్మదా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జనవరి 1న ఐక్యతా విగ్రహం సమీపంలోని కెవాడియా అటవీ డివిజన్ సరిహద్దులో ఉన్న పర్యాటక పార్క్‌లోకి ఒక చిరుత చొరబడింది. ఒక కృష్ణ జింకపై దాడి చేసి చంపింది.కాగా, పార్క్‌లో ఏర్పాటు చేసిన సీసీటీవీల ద్వారా చిరుత చొరబాటును అటవీశాఖ సిబ్బంది గమనించారు. వెంటనే అప్రమత్తమై అక్కడకు చేరుకున్నారు. దీంతో ఆ చిరుత అక్కడి నుంచి పారిపోయింది. అది దాడి చేసి చంపిన కృష్ణ జింకతోపాటు మరో ఏడు జింకలు కూడా చనిపోవడాన్ని అటవీశాఖ సిబ్బంది పరిశీలించారు. ఆ జింకలు షాక్‌తో మరణించి ఉంటాయని అటవీ శాఖ అధికారి అనుమానం వ్యక్తం చేశారు. జింకల కళేబరాలకు పోస్ట్‌మార్టం నిర్వహించిన తర్వాత కననం చేసినట్లు చెప్పారు.మరోవైపు ఈ సంఘటన నేపథ్యంలో రెండు రోజుల పాటు ఆ పార్క్‌ను మూసివేశారు. జనవరి 3న పర్యాటకుల కోసం తిరిగి తెరిచారు. అయితే సఫారీ పార్కు నుంచి ఆ చిరుత పూర్తిగా వెళ్లిందా లేక ఎక్కడైనా దాగి ఉందా? అన్నది స్పష్టం కాలేదు. దీంతో ఆ చిరుత మళ్లీ తిరిగి రావచ్చున్న ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో అటవీశాఖ సిబ్బంది మరింత అలెర్ట్‌గా ఉన్నారు. సఫారీ పార్కులో ఏర్పాటు చేసిన 400కుపైగా ఉన్న సీసీటీవీల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

## కూలిన కోస్ట్‌గార్డ్ హెలికాప్టర్.. ముగ్గురు మృతి

**అహ్మదాబాద్-నవభూమి:** ఇండియన్ కోస్ట్ గార్డ్‌కు చెందిన అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ (ఏఎల్‌హెచ్) కూలిపోయింది. దీంతో మంటలు చెలరేగాయి. హెలికాప్టర్‌లోని ముగ్గురు సిబ్బంది ఈ ప్రమాదంలో మరణించారు. గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో ఈ సంఘటన జరిగింది. ఇండియన్ కోస్ట్ గార్డ్‌కు చెందిన ధ్రువ్ హెలికాప్టర్ సాధారణ గస్తీ కోసం బయలుదేరింది. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో పోర్‌బందర్ సమీపంలోని గ్రౌండ్‌లో అది కూలిపోయింది. ఆ వెంటనే మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపుచేశారు.కాగా, ఇండియన్ కోస్ట్ గార్డ్‌కు చెందిన ఎయిర్ ఎన్‌క్లేవ్ వద్ద ఈ ప్రమాదం జరిగినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అందులో ప్రయాణించిన సిబ్బందిలో ముగ్గురు మరణించినట్లు చెప్పారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. హెలికాప్టర్ కూలడానికి కారణం ఏమిటన్న దానిపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# చైనాలో కొత్తరకం వైరస్ వ్యాప్తి.. డబ్ల్యూహెచ్ఓకు భారత్ కీలక విజ్ఞప్తి



**బీజింగ్-నవభూమి:** చైనాలో హ్యూమన్ మెటానిమోవైరస్ అనే మరో కొత్తరకం మహమ్మారి వ్యాప్తి చెందుతోందని, బాధితులు పెద్ద ఎత్తున ఆసుపత్రులకు క్యూ కడుతున్నారని పలు అంతర్జాతీయ సంస్థలు, సోషల్ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఫ్లూ, ఇతర శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల మాదిరిగానే దీని లక్షణాలు ఉంటాయని వైద్య నిపుణులు తెలిపారు. దగ్గు, జ్వరం, జలుబు, ముక్కు పట్టేసినట్టు ఉండటం.. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటివి కనిపిస్తాయి. పొరుగు దేశంలో వైరస్ వ్యాప్తితో భారత్ అప్రమత్తమైంది.కోవిడ్-19 పుట్టిల్లు చైనాలో మరో కొత్తరం వైరస్ వ్యాప్తి కలకలం రేపుతోంది. ఇది మరో మహమ్మారిగా మారుతుందా? అని ప్రపంచం ఆందోళనకు గురవుతున్నాయి. దీంతో ప్రపంచ దేశాలు అప్రమత్తమయ్యాయి. భారత్ సైతం తాజా పరిణామాలను నిశితంగా గమనిస్తోంది. ఈ క్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ )కు కీలక విజ్ఞప్తి చేసింది. చైనాలో వైరస్ వ్యాప్తి, ఆరోగ్య పరిస్థితుల గురించి ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలని కోరింది. కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకారం.. ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ అధ్యక్షతన శనివారం జాయింట్ మోనిటిరింగ్ గ్రూప్ సమావేశమైంది. పొరుగు దేశంలో ప్రస్తుత పరిస్థితి.. భారత్‌లో సంసిద్ధతపై చర్చించారు. ఈ సమావేశంలో డబ్ల్యూహెచ్ఓ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెల్, ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ఐసీఎంఆర్, న్యూఢిల్లీ ఎయిమ్స్‌కు చెందిన వైద్య నిపుణులు పాల్గొన్నారు. కొనసాగుతున్న ఫ్లూ సీజన్ దృష్ట్యా.. ప్రస్తుత వైరస్ వ్యాప్తి పెరుగుదల అసాధారణం కాదని నిపుణులు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం చైనాలో వైరస్ తీవ్రతకు చలికాలంలో వ్యాప్తిచెందే ఇన్‌ఫ్లుయెంజా వైరస్, ఆర్ఎస్వీ, హ్యూమన్ మెటానిమోవైరస్ వంటి వైరస్‌లు కారణమని నివేదికలు చెబుతున్నాయి. అంతేకాదు, ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకారం.. ఈ వైరస్‌లు భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే వ్యాప్తిలో ఉన్నాయి. “అందుబాటులో ఉన్న అన్ని ఛానెల్ల ద్వారా చైనాలో పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం నిశితంగా గమనిస్తోంది.. చైనాలో పరిస్థితికి సంబంధించి ఎప్పటికప్పుడు అప్‌డేట్‌లు పంచుకోవాలని డబ్ల్యూహెచ్ఓను కూడా అభ్యర్థించింది” అని ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. చైనాలో వైర కొత్త రకం వైరస్ వ్యాప్తి చెందుతోందని, భారీగా వచ్చే బాధితులతో ఆసుపత్రులు సతమతమవుతున్నాయని సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ అయిన విషయం తెలిసిందే. హఠాత్తుగా వ్యాప్తికి హ్యూమన్ మెటానిమోవైరస్ కారణమని ప్రచారం జరుగుతోంది.

కేంద్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అతుల్ గోయల్ మాట్లాడుతూ.. ‘చైనాలో హెచ్ఎంపీవీ వ్యాప్తి గురించి వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. హెచ్ఎంపీవీ అనేది సాధారణ శ్వాసకోశ వైరస్.. జలుబు వంటి లక్షణాలు ఉంటాయి.. కొంతమందికి ముఖ్యంగా వృద్ధులు, చిన్నారుల్లో ఫ్లూ వంటి లక్షణాలు కనిపిస్తాయి.. కానీ ఇది తీవ్రమైన లేదా ఆందోళన కలిగించే విషయం కాదు’ అని చెప్పారు. శీతాకాలంలో శ్వాసకోశ వ్యాధులు వ్యాప్తి సాధారణమని చెప్పారు.

# నా చావుకు కారణమైన ఆమెకు గుణపాఠం చెప్పాలి.. కన్నీళ్లు పెట్టిస్తోన్న భార్య బాధితుడి చివరి మాటలు



టెకీ అతుల్ సుభాష్.. కేఫ్ యజమాని పునీత్ ఖురానా వీరంతా భార్యల సతాయింపులతో బలవన్మరణానికి పాల్పడిన బాధితులు. దేశంలో ఇలాంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. చట్టాలను కొందరు అడ్డం పెట్టుకుని తప్పుడు కేసులతో అత్తింటివాళ్లను పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారు. బిహార్‌కు చెందిన అతుల్ సుభాష్.. బెంగళూరులో గత నెలలో ఆత్మహత్య చేసుకోవడం దేశం మొత్తం సంచలనంగా మారింది. తాజాగా ఢిల్లీలోనూ ఓ కేఫ్ యజమాని సైతం ఇలాగే చనిపోయాడు..

**గుజరాత్ భార్య బాధితుడు**

మొన్న టెకీ అతుల్ సుభాష్.. నిన్న కేఫ్ యజమాని పునీత్ ఖురానా.. నేడు సురేశ్ సథాదియా.. ఇలా భార్య బాధితుల వరుస ఆత్మహత్యలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. మహిళల రక్షణ కోసం తీసుకొచ్చిన చట్టాలను కొందరు దుర్వినియోగం చేస్తూ.. భర్త, అత్తింటివాళ్లను తప్పుడు కేసులతో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గుజరాత్‌లోని బొటాడ్ జిల్లా జమర్లా గ్రామానికి చెందిన సురేశ్ సథాదియా (39) అనే వ్యక్తి భార్య వేధింపులతో డిసెంబరు 30న ఇంటిలోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి ముందు అతడు ఓ సెల్ఫీ వీడియోను రికార్డు చేసి.. అందులో భార్యపై ఆరోపణలు చేశాడు.

తన చావుకు కారణమైన ఆమెకు తగిన గుణపాఠం చెప్పాలని కుటుంబసభ్యులను వీడియోలో కోరినట్టు పోలీసులు వెల్లడించారు. డిసెంబరు 30 ఇంటిలో ఉరేసుకుని సురేశ్ చనిపోయినట్టు తెలిపారు. అతడి మొబైల్ ఫోన్‌లో రికార్డు చేసిన వీడియోను కుటుంబసభ్యులు గుర్తించారు. ‘నా భార్యే చావుకు కారణం.. ఆమెకు గుణపాఠం చెప్పండి’ అని సురేశ్ వీడియోలో చెప్పడం స్పష్టంగా ఉందని పోలీసులు వివరించారు. సురేశ్ సథాదియా తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు.. అతడి భార్య జయబెన్‌పై కేసు నమోదుచేశారు. తరుచూ గొడవపడి.. పుట్టింటికి వెళ్లిపోతూ తన కుమారుడ్ని మానసికంగా వేధించిందని ఆయన ఆరోపించారు.“డిసెంబరు చివరి వారంలో సురేశ్‌తో గొడవపడిన కోడలు జయబెన్.. పుట్టింటికి వెళ్లిపోయింది... నచ్చజెప్పి తిరిగి తీసుకొచ్చేందుకు వెళ్తే ఘోరంగా అవమానించింది... దీంతో తీవ్ర ఆవేదనకు గురై అక్కడ నుంచి వచ్చిన తర్వాత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు’ అని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ఆధారంగా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 100 (ఆత్మహత్యకు ప్రేరేపించడం) కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు. ఇక, టెకీ అతుల్ సుభాష్ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 24 పేజీల సూసైడ్ నోట్, దాదాపు గంటన్నర నిడివి ఉన్న సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. భార్య, ఆమె కుటుంబసభ్యులు తనను ఏవిధంగా వేధింపులకు గురిచేసిందీ అందులో వివరించాడు. న్యాయవ్యవస్థపై కూడా ఆరోపణలు చేసిన అతుల్.. న్యాయమూర్తి రూ.5 లక్షలు లంచం అడిగినట్టు వాపోయాడు.

# ఈసారి మెట్రో బాదుడు



**బెంగళూరు-నవభూమి:** ప్రజలపై మరో అదనపు బాదుడుకు కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతున్నది. రెండు రోజుల క్రితమే ఆర్టీసీ బస్ చార్జీలు పెంచిన సిద్ధరామయ్య ప్రభుత్వం తాజాగా మెట్రో రైల్ టికెట్ ధరల పెంపునకు రెడీ అవుతున్నది. 10 నుంచి 15 శాతం టిక్కెట్ చార్జీల పెంపు ఉండవచ్చునని భావిస్తున్నారు. శక్తి పథకం పేరుతో మహిళా ప్రయాణికులకు అమలు చేస్తున్న ఉచిత బస్సు పథకం భారాన్ని తగ్గించుకోవడానికి బస్సు చార్జీలను 15 శాతం పెంచుతూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సర్కారు గురువారం నిర్ణయం తీసుకుంది. 2023లో గెలుపే లక్ష్యంగా ఎడాపెడా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తర్వాత వివిధ సేవల చార్జీలను కూడా ఎడాపెడా పెంచుతూ తమపై బారం మోపుతున్నదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికే పెట్రోల్, కొత్త వాహనాలపై అదనపు సర్ చార్జీలను పౌరుల నుంచి వసూలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ చార్జీలు పెంచింది. త్వరలో పాల ధరలను కూడా పెంచుతామని ప్రకటించింది. ప్రభుత్వం నియమించిన ముగ్గురు సభ్యుల కమిటీ బెంగళూరులోని నమ్మ మెట్రో చార్జీల పెంపునకు సిఫార్సు చేసింది. 10-15 శాతం మేర మెట్రో చార్జీలను పెంచే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది.

**గోశాల ప్రాజెక్టుకు మంగళం!**

రాష్ట్రంలో గోవులను కాపాడే లక్ష్యంతో తాము ప్రారంభించిన గోశాల ప్రాజెక్టును రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందని ప్రతిపక్ష బీజేపీ శనివారం ఆరోపించింది. గతంలో బీజేపీ ప్రభుత్వ పాలనలో ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 35 గోశాలలను మంజూరు చేశారు. ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేస్తోందని బీజేపీ ఆరోపించింది. గోవులను కాపాడటమంటే ఈ దేశ సంస్కృతిని కాపాడటమేనని ఎక్స్ వేదికగా బీజేపీ పేర్కొంది.

# రంకేసిన తొలి జల్లికట్టు..



**చెన్నై-నవభూమి:** రాష్ట్రంలో సంప్రదాయ, సాహస జల్లికట్టు(పోటీలను శనివారం పుదుకోట జిల్లా తచ్చంకుర్చిలో రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఎస్.రఘుపతి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి వి.మెయ్యనాథన్ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ఎం.అరుణ నేతృత్వంలో ఎద్దులను నిలువరించేందుకు గుర్తింపుకార్డులు కలిగిన వీరులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉదయం 8 గంటలకు వాడివాసల్ మీదుగా తచ్చంకురిచ్చి ఆలయ ఎద్దు మైదానంలో రంకెలేస్తూ పరుగులు తీసింది.

ఈ ఏడాదిలో రాష్ట్రంలో నిర్వహించిన తొలి జల్లికట్టు కార్యక్రమం ఇదే కావడంతో రాష్ట్రం నలు మూలల నుంచే కాకుండా, స్వదేశీ, విదేశీ పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఈ పోటీలను ఆసక్తిగా వీక్షించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రప్రభుత్వం సహకరించడంతో పాటు అనుమతిని జారీ చేసింది. పుదుకోట( జిల్లాలో అత్యధిక సంఖ్యలో జల్లికట్టు కార్యక్రమాలు నిర్వహిస్తారు. అంతేకాకుండా ఎద్దుల బండ్ల పోటీల ప్రధాన పండుగ సీజన్‌లో ఏర్పాటు చేస్తారు. ఈ నేపథ్యంలో శనివారం తచ్చంకుర్చిలో నిర్వహించిన జల్లికట్టులో తిరుచ్చి, దిండుగల్, శివగంగ, మనప్పారై, పుదుకోట జిల్లాల నుంచి 600పైగా ఎద్దులు పాల్గొన్నాయి. సుమారు 320 మందికి పైగా యువకులు రంకెలేస్తూ పరుగులు తీసిన ఎద్దులను నిలువరించేందుకు పోటీ పడ్డారు. రాష్ట్రప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు పశు సంవర్ధక శాఖ వైద్యులు ముందుగానే జల్లికట్టు ఎద్దులు, యువకులకు వైద్యపరీక్షలు నిర్వహించి గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు.ఇదిలా ఉండగా గాయపడిన యువకులను, ప్రజలను వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు ఆరోగ్యశాఖ అధికారులు అంబులెన్సులను అందుబాటులో ఉంచారు. అలాగే ప్రథమ చికిత్సలను అందించారు. రెవెన్యూ, అగ్నిమాపక, పోలీసు తదితర శాఖల అధికారులు కలిసి కట్టుగా ఈ పోటీలు నిర్వహించేందుకు సహకరించారని జల్లికట్టు నిర్వాహకులు తెలిపారు. పలు రౌండ్లుగా సాగిన ఈ పోటీలో విజేతలకు, ఎవరికి పట్టుబడిన ఎద్దుల యజమానులకు విలువైన బహుమతులు పంపిణీ చేసి అభినందించారు.

## కుంభమేళ సిత్రాలు: 32 ఏళ్లుగా స్నానం చేయలేదు.. తలపై బార్లీ సాగు



**ప్రయాగ్ రాజ్-నవభూమి:** మహా కుంభమేళ కోసం దేశం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున బాబాలు.. సాధువులు.. అఘోరాలు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్ కు చేరుకుంటున్నారు. ఈ సందర్భంగా కొందరు బాబాలు.. సాధువులు అమితంగా ఆకర్షిస్తుంటారు. అలాంటి ఇద్దరికి చెందిన విశేషాల్ని చూస్తే.. వీరిలో ఒక బాబా గత 32 ఏళ్లుగా స్నానమే చేయలేదు. మరో బాబా తల మీద ఏకంగా బార్లీని పండిస్తున్నారు. వీరిద్దరూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. 32 ఏళ్లుగా స్నానం చేయని బాబా పేరు ఛోటూ బాబా. ఆయన అసలు పేరు గంగాపురి మహరాజ్. అసోంలోని కామాఖ్య పీఠానికి చెందిన ఆయన ఎత్తు కేవలం 3.8 అడుగులు మాత్రమే. ఆయన వయసు 57 ఏళ్లు. గడిచిన 32 ఏళ్లుగా ఆయన స్నానం చేయలేదు. తానో కోరిక కోరుకున్నానని.. అది తీరే వరకు స్నానం చేయకూడదని నిర్ణయించుకున్నట్లుగా చెప్పిన ఆయన.. తన కోరిక ఏమిటో మాత్రం వెల్లడించలేదు. ఆత్మ పరమాత్మతో అనుసంధానం అవుతుందని.. అందుకే తాను మహా కుంభమేళకు వచ్చినట్లుగా పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. సాధువుగా మారి గడిచిన ఐదేళ్లుగా తలపై బార్లీ సాగు చేస్తున్న ధాన్ వాలే బాబా సోషల్ మీడియాలో ప్రముఖంగా ఉంటారు. ఆయన తీరు భిన్నంగా ఉంటుంది. అందుకే ప్రయాగ్ రాజ్ లో ఆయన ప్రముఖంగా కనిపిస్తారు. ఆయన్ను అందరూ గుర్తిస్తారు. ఆయన అసలు పేరు అమర్ జీత్. కెమికల్స్ తో పండించిన ఆహార పదార్థాలతో మనుషుల అనారోగ్యం పాలవ్నుతన్నారని.. అందుకే ప్రకృతి సిద్ధమైన సాగు మీద అవగాహన కల్పించటం కోసం ఆయనీ విచిత్రమైన పని చేస్తుంటారు. తల మీద బార్లీ సాగు చేసే ఆయన.. పడుకునే విధానం ఎలా ఉంటుందన్న సందేహం పలువురికి వస్తుంది.

## అమెరికాలో జెండా అవనతంపై ట్రంప్ కీలక ట్వీట్



**న్యూయర్క్-నవభూమి:** దేశంలో అయి నా ప్రముఖులు లేదంటే ఆ దేశానికి సేవలందించిన వారు చనిపోతే సంతాప దినాలు పాటించడం కామన్. పార్టీలతో సంబంధం లేకుండా ఆ మాత్రం గౌరవం ఇవ్వడం సాధారణం. అది వారం రోజులు కావచ్చు.. పది రోజులు కావచ్చు సంతాప దినాలుగా పాటిస్తుంటారు. ఆ సమయంలో తమ దేశ జాతీయ జెండాలను అవనతం చేస్తుంటారు. ఏఇటీవల అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ ఇటీవల కన్నుమూశారు. ఈ నేపథ్యంలో 30 రోజులపాటు జాతీయ జెండాను అవనతం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ జాతీయ జెండాను అవనతం చేయాలని ఆదేశించారు. అయితే..ఈ నిర్ణయాన్ని కాబోయే అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తప్పుపట్టారు. అంతేకాకుండా ఈ నిర్ణయంపై అమెరికన్లు అంత సంతోషంగా లేరని కామెంట్స్ చేశారు. ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ఆయన ఈ పోస్ట్ చేశారు. ? తాను అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టే క్రమంలో జాతీయ జెండాను అవనతం చేశారని, ఇది చాలా గొప్ప విషయంగా వారు భావిస్తున్నారని బైడెన్‌ను ఉద్దేశించి ట్రంప్ అభిప్రాయడపడ్డారు. వాస్తవంగా వారికి దేశం అంటే ప్రేమ లేదని, అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ మరణం కారణంగా కాబోయే అధ్యక్షుడి శకం ప్రారంభానికి జెండా అవనతమై ఉండడం బహుశా ఇది మొదటిసారి కావచ్చని తెలిపారు. ఎవరూ దీనిని చూడాలని కోరుకోరని.. కానీ తనకు ఈ కొత్త అనుభవం ఎదురైందని పేర్కొన్నారు. ఈ నిర్ణయంపై అటు అమెరికా ప్రజలు కూడా సంతోషంగా లేరని ట్రంప్ అభిప్రాయపడ్డారు. మరోవైపు.. ట్రంప్ కామెంట్స్‌పై వైట్‌హౌస్ ప్రతినిధి కరీన్ జిన్ పియర్ స్పందించారు. తమ నిర్ణయాన్ని పునఃపరిశీలించే ఆలోచన అస్సలు లేదని అభిప్రాయపడ్డారు. మరోవైపు.. జనవరి 20న ట్రంప్ అధికారిక బాధ్యతలు స్వీకరించనున్నారు.

## రోదసిలో మొలకెత్తిన బొబ్బర

**న్యూఢిల్లీ-నవభూమి:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అద్భుత విజయాలు సాధిస్తున్నది. గత నెల 30న ప్రయోగించిన పీఎస్4-ఆర్బిటాల్ ఎక్స్‌పెరిమెంట్ మాడ్యూల్ (పీఓఈఎం)లో బొబ్బర గింజలు (కౌపీ సీడ్స్) మొలకెత్తాయి. వీటికి ఆకులు కూడా మరికొద్ది రోజుల్లో రావచ్చునని ఆశిస్తున్నారు. దాదాపు శూన్య గురుత్వాకర్షణ స్థితిలో, అంతరిక్ష పరిసరాల్లో జీవం మొలకెత్తడం భారత దేశానికి ఇదే మొదటిసారి. ఈ వివరాలను ఇస్రో శనివారం వెల్లడించింది. పీఓఈఎం గత నెల 30న ఇస్రో ప్రయోగించిన స్పేడెక్స్‌లో భాగం. ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్ మాట్లాడుతూ, భారతీయ స్పేస్ ల్యాబ్‌లో జీవి మొలకెత్తడం చాలా ఉత్తేజితంగా ఉందన్నారు.

## మీ ప్రవర్తన అమానవీయం..ఈడీ తీరును తప్పుబట్టిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ-నవభూమి:** ఓ కేసులో నిందితుడిని 15 గంటల పాటు నిరంతరాయంగా విచారించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తీరును సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. హర్యానా కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే సురేందర్ పన్వార్‌ను చట్ట విరుద్ధ ఇసుక తవ్వకం.
మనీలాండరింగ్ కేసులో నిరుడు ఈడీ అరెస్టు చేసి విచారించింది. అయితే, ఈ కేసు ఉగ్రవాదానికి






సంబంధించినది కాదని, ఇసుక అక్రమ మైనింగ్‌కు సంబంధించినదని గురువారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసిహ్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. 'ఈడీది అమానవీయ ప్రవర్తన. నిందితుడు బలవంతంగా వాంగ్మూలం ఇచ్చేట్టుంది' అని వ్యాఖ్యానించింది.



## మార్చురీ వ్యవస్థ మెరుగుపడాలి...!

న్యాయ ప్రక్రియలకు సహాయపడటానికి వైద్య పరిజ్ఞానాన్ని ఉపయోగించే వైద్యశాఖను న్యాయ వైద్యశాస్త్రం అంటారు ఇందులో భాగంగా మరణానంతర పరీక్షలు, గాయాల విశ్లేషణ, మానభంగాల బాధితుల నుంచి సాక్ష్యాలు సేకరించడం, విశ్లేషించడం వంటివి చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ విభాగాన్ని సమూల ప్రక్షాళన చేసేందుకు, హైకోర్టు క్రిమినల్ అప్పీల్ నెం. 326 ఆఫ్ 2017లో వెల్లడించిన ఆదేశాలను అనుసరించి, ప్రభుత్వం ఒక నిపుణుల కమిటీని నియమించింది (జీవో: 129, 16-10-2024). హైకోర్టు న్యాయమూర్తులు తమ తీర్పులో శవపరీక్షల నిర్వహణలో పాటించాల్సిన శాస్త్రబద్ధమైన ప్రమాణాలపైనా, తదనంతరం తయారు చేసే నివేదికల నిబద్ధతపైనా విస్తృత చర్చ జరిపారు.

ఆధునిక సమాజంలో ప్రజల అసహజ మరణాలకు గల కారణాలను తెలుసుకోవడం, దోషులను శిక్షించడం, నేరాలను నివారించడం ప్రభుత్వాల బాధ్యత. ఈ ప్రక్రియలో పోలీసులూ, కోర్టులతో పాటు ఫోరెన్సిక్ వైద్యుల పాత్ర చెప్పుకోదగ్గది. మన రాష్ట్రంలో బోధనాసుపత్రులతో పాటు నిర్దేశిత జిల్లా, తాలూకా ఆసుపత్రులలో శవపరీక్షలు నిర్వహిస్తారు. ప్రస్తుత పరిస్థితులలో చాలా చోట్ల ఫోరెన్సిక్ వైద్యులు అందుబాటులో ఉండడంచేత నాణ్యతా ప్రమాణాలతో శవపరీక్షలు నిర్వహించడానికి అవకాశం కలిగింది. హైకోర్టు ఆశించిన విధంగా న్యాయ వైద్యశాస్త్రంలో అంతర్జాతీయ ప్రమాణాలు పాటించడానికి నియమ నిబంధనావళి రూపొందించడం ఈ విశేషజ్ఞుల కమిటీకి పెద్ద కష్టమైన పని కాకపోయినప్పటికీ దానిని ఆచరణలో పెట్టాలంటే మన శవాగారాలను ఆధునీకరించాల్సిన అవసరం ఉంది.

గతంతో పోల్చుకుంటే కొంత మేర మార్చురీల అభివృద్ధి జరిగింది. కానీ రాష్ట్రంలో చాల చోట్ల శవాలను భద్రపరిచే శీతల వ్యవస్థ అవసరాలకు సరిపోయేలా లేదు. కోల్డ్ స్టోరేజీలను కూడా సరిగా నిర్వహించటం లేదు. మన మార్చురీలలో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణకు, ముఖ్యంగా ద్రవ వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలి. శవపరీక్షలు చేయడానికి కావల్సిన ఆధునిక పనిముట్లు చాల చోట్ల అందుబాటులో లేవు. ప్రపంచం అంతా ఎలక్ట్రిక్ రంపాలతో పుర్రెలను తొలచి మెదడును పరీక్షిస్తుంటే, మనం మాత్రం పాత పద్ధతిలో ఇంకా సుత్తి, శానం వాడుతుండడం బాధాకరం. శవపరీక్షలు చేసే వైద్యులకి అవసరమైన రక్షణ తొడుగులను, అదనపు పరీక్షలు నిర్వహించడానికి కావల్సిన సరంజామాను సమకూర్చుకోవడం అనునిత్యం ఒక యుద్ధంలా మారింది. కొన్ని అసహజ మరణాలని పరిశోధించడానికి బాడీ శాంపిల్స్‌ని దూరంగా ఉన్న ప్రయోగశాలలకు పంపాలి. అప్పటి దాకా ఆ నమూనాలని కాపాడేందుకు డీప్ ఫ్రీజర్‌లు, ప్రత్యేక సంరక్షణ ద్రవ్యాలు అవసరం అవుతాయి. ఈ మౌలిక సదుపాయాల కల్పన పని నాణ్యతను ఎంతో పెంచుతుంది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాలలు విషపదార్థాల వల్ల మరణించినవారి శవపరీక్షలలో సరైన ఫలితాలను అందించలేకపోతున్నాయి. అలాగే అనేక విషాలను గుర్తించడంలో అసమర్థంగా ఉన్నాయి. కాలం చెల్లిన విశ్లేషణాత్మక విషశాస్త్ర పద్ధతులు ఉపయోగించడమే దీనికి ముఖ్య కారణం.ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాలల మధ్య, న్యాయ వైద్య విభాగం మధ్య సరిగ్గా సమన్వయం లేకపోవడం వల్ల కొన్ని కేసులలో న్యాయ విచారణ విఫలం అవుతున్నది. ఇంక శవపరీక్ష నివేదికల ప్రమాణాల విషయానికి వస్తే కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సాఫ్ట్‌వేర్ మన రాష్ట్రంలో కూడా వినియోగిస్తే చాల ఉపయోగకరంగా ఉంటుం ది. అవినీతిని నిరోధిస్తూ కొంత పారదర్శకతను సృష్టి రం చేసే అవకాశం ఉంది. హైకోర్ట్ చెప్పిన విధంగా మరణానికి కారణమైన ముఖ్య గాయాలను ఫొటోగ్రాఫ్ లేదా వీడియోగ్రాఫ్ చేసి ఇంటర్‌నెట్‌లో భద్రపరచడం సంవత్సరాల పాటు జరిగే న్యాయ ప్రక్రియను బలోపేతం చేస్తుంది. ప్రపంచ స్థాయి ప్రమాణాలను ఆంధ్రప్రదేశ్ న్యాయ వైద్య వ్యవస్థలో తీసుకురావాలన్న న్యాయమూర్తుల ఉన్నత ఆలోచనకు జోహార్లు. అయితే, ఆ మొత్తం ప్రక్రియ జరగడానికి మన మార్చురీలలో, న్యాయ వైద్య ప్రయోగశాలల్లో, పోలీస్ వ్యవస్థలో, అలాగే వృత్తి పట్ల మన అంకిత భావంలో పెను మార్పులు అవసరం.

# 'గాంధీ' పేరులేని ఏ నేతను మీరు గౌరవించారు?



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంతిమయాత్రను మీడియా, సోషల్ మీడియాల్లో చూసినవారు కాంగ్రెస్ నకిలీ గాంధీలను మాత్రమే గౌరవిస్తుందని, దిగ్గజాలను సైతం అవమానిస్తుందని వ్యాఖ్యానిస్తున్నారు. మన్మోహన్ సింగ్ ప్రజా నాయకుడేమీ కాదని, గాంధీల కంటే గొప్పవాడు కాదని సంకేతం ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఎవరినీ అంతిమ యాత్ర వాహనం దరిదాపుల్లోకి రానివ్వలేదు. ఒంటరిగా, భారంగా మన్మోహన్ సింగ్ అంతిమయాత్ర సాగింది. రాహుల్‌గాంధీ తాను యువరాజునన్నట్లుగా అంతిమ యాత్ర వాహనం మీద కూర్చున్నారు. అంతేతప్ప గౌరవసూచకంగా నడుద్దామని కూడా ఆలోచించలేదు. 74 సంవత్సరాల వయస్సులో ప్రధాని హోదాలో నరేంద్ర మోదీ వాజపేయి అంతిమ యాత్ర ముందు నాలుగు కిలోమీటర్లు నడిచారు. వాజపేయి అంతిమ యాత్ర కొన్ని వేలమంది మధ్య సాగింది. ప్రధాని మోదీతో పాటు బీజేపీ ముఖ్యనేతలంతా అంతిమయాత్రలో నడుస్తూనే పాల్గొన్నారు. బీజేపీ ప్రధాన కార్యాలయం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలోని రాష్ట్రీ స్మృతి స్థలం వరకూ నడుచుకూంటూనే వెళ్లారు. అది తమ పార్టీకి, దేశానికి నిస్వార్థంగా సేవ చేసిన నాయకుడికి బీజేపీ ఇచ్చిన గౌరవం.

మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం అత్యున్నత గౌరవంతో కూడిన వీడ్కోలును ఇచ్చింది. నిగమ్ బోధ్‌లో అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తే కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేసింది. మన్మోహన్ స్మారకం నిర్మించేందుకు స్థలాన్ని కేంద్రం కేటాయించిందన్న విషయాన్ని దాచిపెట్టి తప్పుడు ప్రకటనలు చేసింది. అంతేనా! అంత్యక్రియలు చేసినప్పుడు వీడియోల్లో కాంగ్రెస్ నేతలు కనపడలేదని కూడా పవన్ ఖేరా వంటి వారు ఆరోపించడాన్ని బట్టి మన్మోహన్ మరణాన్ని రాజకీయ లబ్ధికి ఎలా వాడుకోవాలో వారు ముందే మేథోమథనం చేసినట్లుగా అర్థం చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం మన్మోహన్ సింగ్‌ను అవమానించిందని ఏకపక్షంగా ఆరోపించిన రాహుల్‌గాంధీ సంతాప దినాల్లోనూ నూతన సంవత్సర వేడుకలకు వియత్నాం వెళ్లిపోయారు. ఇదా కాంగ్రెస్ పార్టీకి గొప్ప సేవలు చేసిన మన్మోహన్‌కు ఇచ్చే గౌరవం?

మన్మోహన్‌కు గౌరవంపై కాంగ్రెస్ చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ దిగ్గజాల్లో ఒకరు అయిన ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ట ముఖర్జీ వ్యక్తం చేసిన అభిప్రాయాలు నకిలీ గాంధీల అసలైన ముఖాలను బయటపెట్టేలా ఉన్నాయి. ప్రణబ్ ముఖర్జీ కోసం ఘాట్ నిర్మాణం చేయాలని అడగలేదేమని ఆమె అడిగిన ప్రశ్నకు సమాధానం లేదు. అలాగే తెలుగు దిగ్గజమైన పీవీ నరసింహారావుకు కాంగ్రెస్ చేసిన అవమానాన్ని అందరూ గుర్తుచేసుకుంటున్నారు. పీవీ నరసింహారావుకు రెండు గజాల స్థలం కేటాయించలేదనీ, గాంధీ కుటుంబానికి కాకుండా కాంగ్రెస్ ఎవరికైనా భారతరత్న ఇచ్చిందా అనీ పీవీ నరసింహారావు సోదరుడు మనోహర్‌రావు సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ నిర్వాకం కారణంగానే దేశ రాజధానిలో ఘాట్ లేని ఏకైక ప్రధానిగా పీవీ నరసింహారావు మిగిలిపోయారు. ఇంతటి అవమానం చేసింది కాంగ్రెస్ పార్టీ కాదా? దేశాన్ని ఆర్థికంగా గట్టెక్కించిన పీవీ నరసింహారావుకు భారతరత్న ఇచ్చి గౌరవించింది బీజేపీ. దేశానికి సేవ చేసినవారు ఎవరైనా సరే బీజేపీకి ముఖ్యమేననీ, ఇందులో పార్టీ తేడాలు ఏమీ ఉండవనీ ఎన్నోసార్లు నిరూపించింది. దేశాన్ని ఆర్థికంగా గట్టెక్కించిన నేతగా పీవీ నరసింహారావును అందరూ గౌరవిస్తారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఆయన పార్థివ దేహాన్ని ఏఐసీసీ ఆఫీసులోకి కూడా రానివ్వలేదు. అసలు ఢిల్లీలోనే అంత్యక్రియలు జరపకుండా హైదరాబాద్‌కు పంపించివేశారు. పోనీ హైదరాబాద్‌లో అయినా గౌరవంగా చేశారా అంటే అదీ లేదు. భారతరత్న అటల్ బిహారీ వాజపేయి పరమపదించినప్పుడు బీజేపీ ముఖ్యనేత అమిత్ షా స్వయంగా ఆయన అస్థికల్ని పవిత్ర నదుల్లో కలిపారు. నాయకుడు అంటే ఈ రకమైన అభిమానం రాజకీయ పార్టీకి ఉండాలి.

ఉక్కుమనిషిగా దేశాన్ని బలోపేతం చేసిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ను కాంగ్రెస్ ఎప్పుడైనా గుర్తించిందా? ఆయనను స్మరించుకోవడానికి ఏదైనా ఒక స్మారక కట్టడాన్ని కాంగ్రెస్ పార్టీ కట్టించిందా? ప్రధాని అవ్వాల్సిన ఆయనను ఉప ప్రధానిగా ఉంచింది. చనిపోయిన తర్వాత పూర్తిగా ఆయన పేరు ప్రఖ్యాతులను గాంధీ కుటుంబం కోసం మరుగునపడేలా చేసింది. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే పటేల్‌కు గుర్తింపు లభించింది. స్టాట్యూ ఆఫ్ యూనిటీని నిర్మించి ఆయన ఉన్నతిని ఆకాశమంత స్థాయిలో నిలబెట్టింది. గాంధీ కుటుంబం నుంచి కాకుండా కాంగ్రెస్ నుంచి ప్రధాని అయిన మరో దిగ్గజ నేత లాల్ బహదూర్ శాస్త్రిని కూడా కాంగ్రెస్ గుర్తుకు తెచ్చుకునే ప్రయత్నం చేయదు. ఆయన మరణంపై ఉన్న అనుమానాలపై చర్చ జరగకుండా అడ్డుకుంది. రెండుసార్లు పదమూడు రోజులు ప్రధానిగా పని చేసిన గుల్జారీలాల్ నందాను, ఉపప్రధానిగా చేసిన మొరార్జీ దేశాయ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ తమ పార్టీ నేతలుగా గుర్తించినట్లుగా కనిపించలేదు. ఇంత ఘోరమైన గత చరిత్రను పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ ఎవరిపై నిందలు వేయాలని అనుకుంటోంది? కాంగ్రెస్ ఇప్పటికీ పాత చింతకాయ పచ్చడి రాజకీయాలు చేస్తూ ఏదో బావుకుందామని అనుకుంటోంది. కానీ ప్రజలు ఆ నీచ రాజకీయాలను అసహ్యించుకుంటున్నారు.

# ప్రజాస్వామ్య భారతానికి అండ మన రాజ్యాంగం



"రాజ్యాంగం కేవలం న్యాయవాదుల పత్రం మాత్రమే కాదు, ఇది జీవన వాహనం. దాని ఆత్మ నిత్యం యుగస్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది" అన్న అంబేడ్కర్ మాటలు చెరగని సత్యాలు. మన రాజ్యాంగ నిర్మాతలు వ్యక్తి ఆధారిత వికాసాన్ని ఆశిస్తూ దేశానికి ఆచరణీయ పాలనా నమూనాను రూపొందించారు. గత ఏడున్నర దశాబ్దాలుగా దేశానికి దిక్సూచిగా పనిచేస్తున్న రాజ్యాంగ అమలును పరిశీలిస్తే దీని నిర్మాతల దార్శనికత దేశ ప్రజలకు తెలుస్తుంది.

12 భాగాలు, 395 అధికరణలు, దేశకాలానుగుణంగా కొత్త విషయాల్ని జోడించిన 106 సవరణలతో కూడిన రాజ్యాంగం సుమారు ఏడున్నర దశాబ్దాలుగా భారతదేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లేందుకు ప్రధాన భూమికను వహిస్తోంది. స్వాతంత్ర్యోద్యమ ఫలితంగా సాధించిన స్వయం పాలనలోంచి, స్వేచ్ఛావాయువుల్లోంచి ప్రజలే మన రాజ్యాంగాన్ని రాసుకున్నారు. 1950 జనవరి 26న అమల్లోకి వచ్చిన మన రాజ్యాంగం పురాతన భారతీయ సంప్రదాయాల మీద నిర్మితమైనది. నాలుగు వేల సంవత్సరాల చరిత్రలో ఈ దేశ ప్రజల అనుభవాలు రాజ్యాంగంలో నిక్షేపితమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ఆధునిక రాజ్యాంగాలు చాలా విఫలమయ్యాయి. కాని భారత రాజ్యాంగం అలా కాకుండా నిలిచి వెలుగుతున్నది.ప్రతి భారతీయ పౌరుడూ కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా స్వేచ్ఛగా తన భావాలను, అభిప్రాయాలను వెల్లడించగలుగుతున్నారంటే అది భారత రాజ్యాంగం సాధించిన గొప్ప విజయమనే చెప్పాలి. అధికరణ 19(1)ఎ భారతీయ పౌరుల్ని ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వెర్సస్ రాజ్ నారాయణ్‌కి సంబంధించిన కేసులో ప్రతి భారతీయ పౌరుడూ సమాచారాన్ని స్వీకరించడంతో పాటు వ్యాప్తి చేసే హక్కును కలిగివున్నాడని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. భిన్నత్వంలో ఏకత్వం, లౌకికవాదం, మత సహనం, అందరికీ సమాన అవకాశాలు, అట్టడుగు వర్గాల కోసం ప్రత్యేక చట్టాలు, సంక్షేమ కార్యక్రమాలు భారత రాజ్యాంగం ప్రసాదించింది. రాజ్యాంగ రచనలో కార్యదక్షత వహించిన డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సంపూర్ణ ప్రజాస్వామ్యాన్ని ఆకాంక్షించారు. సమ ప్రజాస్వామ్య పద్ధతుల్ని రాజ్యాంగ పరిషత్తు తీసుకొచ్చింది. వ్యత్యాసం లేని ప్రజాస్వామ్యాన్ని తీర్మానించింది. పరిపూర్ణ ప్రజాస్వామ్యానికి రాజ్యంగ రచయితలు పునాదులు వేశారు.

ప్రజల ఆర్థిక, సాంఘిక జీవితంలో విప్లవాత్మక మార్పులను రక్తపాతం లేకుండా తీసుకొచ్చే ప్రక్రియే ప్రజాస్వామ్యం అని ఈ సందర్భంలోనే డాక్టర్ అంబేడ్కర్ పేర్కొన్నారు. ఇటువంటి రాజకీయ ప్రజాస్వామ్యం వర్ధిల్లాలంటే సాంఘిక, ఆర్థిక ప్రజాస్వామ్యాలు రక్తమాంసాల పాత్ర పోషిస్తాయని వివరించారు. కులం ద్వారా వచ్చిన వెనుకబాటుతనంతో ఉత్పత్తి కులాలు అణచివేతకు గురయ్యాయని, వీటిని అధిగమించాలంటే ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థే దివ్యఔషధమనీ ఆయన అన్నారు. ఎటువంటి వాదప్రతివాదాలూ లేకుండానే పరిషత్ దీనిని ఆమోదించింది. ఈ నేపథ్యంలోనే వివిధ వర్గాల ప్రజల మధ్య ఐక్యతను సాధించేందుకు వివిధ సంక్షేమ విధానాలు రూపొందాయి. సహృదయ భావజాలాన్ని పెంపొందించే నిర్ణయాలు కూడా జరిగాయి. రాజ్యాంగ రచనాసంఘం అధ్యక్షునిగా డాక్టర్ అంబేడ్కర్ రాజ్యాంగ పరిషత్ సమావేశంలో ప్రజాస్వామ్య మూలాలు భారతీయుల వారసత్వ సంపద అన్నారు. జె.ఎస్.మిల్, హెరాల్డ్ లాస్కీ, మెకావర్ చెప్పిన పాశ్చాత్య ప్రజాస్వామ్యం భారతదేశానికి సరిపడదని అంబేడ్కర్ పేర్కొన్నారు. భారతదేశ సామాజిక చట్రం అందుకు భిన్నంగా ఉందన్నారు.

వివిధ కులాలుగా, మతాలుగా, వర్గాలుగా, ప్రాంతాలుగా, భాషలుగా, సంస్కృతులుగా విభజన చెందిన ఈ సమాజం, 'ఏకతా' భావనకు చేరుకోవడానికి అవసరమైన మానసిక పరివర్తనను పెంపొందించే రాజకీయవ్యవస్థ అవసరాన్ని రాజ్యాంగ పరిషత్ తెరమీదికి తీసుకొచ్చింది. ప్రజల మనోభావాలకు అనుగుణంగా మార్పులు, చేర్పులకు అవకాశం వుండాలని సభ్యులు కోరుకున్నారు. ఇది సమాజ ఆశయాలను, ఆకాంక్షలను ప్రతిబింబించేదిగా ఉండాలి. రాజ్యాంగం అందించిన ప్రాథమిక హక్కులు నిర్లక్ష్యానికి గురికాకూడదు. దీనిని విస్మరించి పాలకులు స్వప్రయోజనాల కోసమే పనిచేస్తే, బలహీనవర్గాల అభివృద్ధి, సంక్షేమం కుంటుబడుతుంది. ఇక్కడే ప్రజాస్వామ్యానికి ముప్పువాటిల్లే పరిస్థితులు ఏర్పడతాయి. అందుకే రచనాసంఘం ప్రజాస్వామ్యమంటే కేవలం ప్రభుత్వ ఏర్పాటు ఒకటే కాదని వివరణ ఇచ్చింది. ప్రజాస్వామ్యం పట్ల ప్రజలకు సంపూర్ణ అవగాహన కలిగినప్పుడే ఓటుహక్కు విలువ తెలుస్తుందని రాజ్యాంగ పరిషత్తు భావించింది. రాజకీయపార్టీల లక్ష్యాలు, వారి కార్యాచరణను ప్రజలు అంచనా వేయగలగాలనేది వారి ఉద్దేశం. అప్పుడే పారదర్శకంగా ఓటుహక్కు వినియోగించుకోగలుగుతారన్నారు. రాజ్యం - కులం - మతవ్యవస్థల ఉనికి, స్వరూపస్వభావాలు మనిషిని ఏ రకంగా ప్రభావితం చేస్తున్నాయో తెలుసుకున్నప్పుడే సంపూర్ణ ప్రజాస్వామ్యం మనగలుగుతుందని రచనా సంఘం పేర్కొంది. అందుకే "ఒకవ్యక్తి - ఒకే ఓటు, ఒక ఓటు - ఒకే విలువ" అనే సూత్రానికి అవిశ్రాంతంగా కృషి జరిగింది. ఇది ఆచరణలోకి వచ్చే వరకు డాక్టర్ అంబేడ్కర్ చాలా కృషి చేశారు.రచనా సంఘం మూడు రకాల ప్రజాస్వామ్యం గురించి చర్చించింది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వ సిద్ధాంత ప్రాతిపదికగా కలిగిన జీవనవిధానం సామాజిక ప్రజాస్వామ్యం. ప్రజల మధ్య ధనిక, పేద వ్యత్యాసాలు తగ్గిపోయి సామాజిక సహజీవనానికి బాటలు వేసేది ఆర్థిక ప్రజాస్వామ్యం. పెట్టుబడిదారీ ఆర్థిక విధానం కొన్ని సందర్భాల్లో ప్రజాస్వామ్య లక్ష్యాలకు అడ్డంకిగా నిలుస్తుందన్నారు. ఈ విధానంలో వ్యక్తి స్వేచ్ఛ, ఇతర హక్కులకు సైతం రక్షణ కొరవడుతుంది. అందుకే శ్రేయోరాజ్యాన్ని ప్రతిపాదించారు. రాజ్యాంగంలో సంక్షేమ రాజ్యస్థాపనకు తగిన ఆదేశిక సూత్రాలను పొందుపరిచారు. రాజ్యాంగం ద్వారా బలహీనవర్గాలు జీవనోపాధి పొందే విధంగా వీటిని రూపొందించారు. సామాజిక వనరుల మీద యాజమాన్య నియంత్రణ ప్రజలకే వుండాలని పరిషత్ ఆకాంక్షించింది. సంపద, ఉత్పత్తికారకాలు ఏ కొద్దిమంది చేతుల్లోనో కేంద్రీకృతం కాకూడదని, బలహీనవర్గాల విద్య, ఉపాధి ఆర్థిక విషయాలను రాజ్యమే పరిరక్షించాలని ఆశించారు. ఆదేశిక సూత్రాల అమలు ద్వారా ఆదర్శ ప్రజాస్వామ్యాన్ని నిర్మించవచ్చని, ఇటువంటి కార్యాచరణ సాధ్యం కావాలంటే ప్రభుత్వమే ఈ బాధ్యత వహించాలనేది రచనా సంఘం తరుపున అంబేడ్కర్ సూచించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పనితీరు బాగుంటేనే అది వర్ధిల్లుతుంది. దీనికి ప్రధానంగా రెండు విషయాలు మూలస్తంభాలుగా నిలవాలి. ఒకటి సమర్థవంతమైన పాత్రపోషించగల ప్రతిపక్షం, రెండు స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కును వినియోగించుకోగల పరిస్థితులు. ఇవి ఉన్నప్పుడే అణగారిన ప్రజానీకం విముక్తి సుసాధ్యమవుతుంది.

ప్రజాస్వామ్యం అంతరించిపోతే ప్రజల ఆకాంక్షలు నీరుగారిపోతాయన్నది రచనా సంఘం హెచ్చరిక. రాజకీయ పార్టీల బాధ్యతాయుతమైన పాలనతోనే రాజ్యాంగం మనగలుగుతుంది. ఈ సందర్భంలోనే దేశీయ రాజనీతి సిద్ధాంతకర్తలు నాడు రాజ్యాంగాన్ని కొనియాడారు. సమైక్య జీవన వేదంగా ఈ ముసాయిదా సాక్షాత్కరిస్తుందన్నారు. అంఖండ భారతాన్ని నిర్మించి పటిష్టపరిచిన రాజ్యాంగం ఆమోదం పొందిన రోజుని ఉత్సవంగా జరుపుకుందాం.

## రామాయణంలో స్త్రీ పాత్రల ఔచిత్యం

భక్తి




రామాయణ, భారత, భాగవతాలు భారతీయులకు పవిత్ర గ్రంథాలు. భారత సాహిత్యానికే అవి పట్టుకొమ్మలు. భారతీయ జీవన విధానానికి దర్పణాలు. మానవ జీవన విధాన రూపకల్పనకు చక్కగా ఉపకరించే సమున్నత సాధనాలు.ఆదర్శ మానవ జీవితానికి దారిచూపే కరదీపిక రామాయణం. మూడు కుటుంబ జీవితాలను మన ముందుంచి, ఏది ఉత్తమ జీవితమో చెప్తూ, కుటుంబ బాంధవ్యాలను ఉదాహరణగా నిర్వచించి, ఎవరితో ఎలా మసలుకోవాలో సున్నితంగా సూచించే కావ్యం ఇది. అందుకే రామాయణానికి వైశిష్ట్యం కల్పించి, ఆరాధించారు.వాల్మీకి రామాయణాన్ని ఆధారంగా చేసుకొని, ప్రాంతీయ భాషల్లో పలు రామాయణాలు వెలువడ్డాయి. తెలుగులో తొలి రామాయణం 'భాస్కర రామాయణం'. ద్విపదగా, చంపూ పద్ధతిలో రూపొందిన మొదటి రామాయణం. అది జానపద ప్రభావం లేక ఇంచుమించు మూల రామాయణ కథ ఆధారంగానే సాగింది.రామాయణాన్ని సాహిత్య చరిత్రలో కుటుంబ, సామాజిక ఆదర్శాల ద్వారా జీవితంలో విస్తృతమైన దృక్పథాన్ని ప్రవేశపెట్టిన మొదటి రచనలలో ఒకటిగా చెప్పవచ్చు. స్త్రీ పాత్రల గురించిన నిర్దిష్టమైన అధ్యయనంతో గుర్తించబడిన విలువలు లేదా ఆదర్శాలు ఏవీ చెప్పకుండా వదలలేదని చెప్పవచ్చు. మానవ ఆలోచనల భావోద్వేగం, ఉనికి సంపూర్ణతను ప్రదర్శిస్తుంది.భారతదేశమే కాకుండా ప్రపంచంపై దాని ప్రభావాన్ని విస్తృతం చేస్తుంది. రామాయణమంతా సీత పాత్ర విస్తరిస్తుంది. 'సీతాయః చరిత మహత్' అనే వ్యక్తీకరణ దీనికి నిదర్శనం. కథాంశం మార్చడానికి (మంథర)బీ కథాంశ మలుపు (కౌసల్య, సుమిత్ర, కైకేయి)బీ అనుబంధించడం (శబరి, అహల్య)బీ ఏకపక్ష పాత్ర (ఊర్మిళ)బీ ఇలా మనకు ఎన్నో స్త్రీ పాత్రలు నిజ జీవితపు సారూప్యతను కనిపింపజేస్తాయి.స్త్రీ పాత్రల ఔచిత్యం: భాస్కర రామాయణంలో మొదట అహల్య వృత్తాంతంలో ప్రత్యేకత కనిపిస్తుంది. ఇంద్రుడు అహల్యను మోసగించి గౌతముడు లేని సమయాన కోరి వస్తాడు. తన కూతతో పొద్దు పొడిచిన సంకేతం ఇచ్చాడు. గౌతముడు అనుష్టానాలు నిర్వర్తించుకోవడానికి వెళ్తాడు. ఆ సమయం చూసుకొని ఇంద్రుడు ఆశ్రమంలో ప్రవేశిస్తాడు. దివ్య దృష్టి కలిగిన గౌతముడు అన్ని తెలుసుకోవచ్చు కానీ, 'బుద్ధారెడ్డి' సామాన్య మానవుడి కల్పనలు కోడికూతతో తెల్లవారిందని భ్రమపడే విధంగా చిత్రించాడు. తిరిగివచ్చిన గౌతముడు అహల్యను శపిస్తాడు. రంగనాథ రామాయణంలో 'పడతి పాషాణమై పడి యుండు నీవు' అని శపించినట్లు ఉన్నది. మంథర': ఈ పాత్రను బుద్ధారెడ్డి రాముడు చిన్నప్పుడు తన కాలు విరిచినందుకు ప్రతీకారం తీర్చుకునే స్వభావం కలదిగా చిత్రిస్తాడు. యజ్ఞదత్తుడు మరణించినప్పుడు అతని తండ్రితో పాటు తల్లికూడా ఎంతగానో విలపించిందని చెప్పడంలో ఆ పాత్రలో మాతృహృదయాన్ని వ్యక్తపరిచాడు.ఊర్మిళ: రంగనాథ రామాయణంలో ఊర్మిళాదేవి నిద్ర ఘట్టాన్ని వివరిస్తాడు. అరణ్యవాసానికి వెళ్లిన తన భర్త (రాముని వెంట లక్ష్మణుడు) వెళ్లినప్పుడు, లక్ష్మణ కర్తవ్య నిర్వహణ కోసం నిద్రాదేవి తనను ఆవహించడం, లక్ష్మణుడు తిరిగి రాగానే, నిద్రాదేవి వెళ్లిపోవడం దీనిలో చెప్పబడింది.సీత: సీతాదేవిని హిందూ మతంలోనే విశ్వాసాల ప్రతీకగా చూపబడింది. విష్ణువు అవతారమైన శ్రీరాముని ధర్మపత్ని హిందూ సమాజంలో స్త్రీ ప్రవర్తనకు, ఆలోచనకు సీతా చరిత్ర మార్గదర్శకంగా నిలిచిపోయింది. సకల గుణాలు కలిగిన సాధ్విగా, భారతీయులకు నిత్యం ఆరాధించే సుగుణాల రాశిగా పేరొందింది. రామాయణ కథంతా సీతే ప్రధాన పాత్ర వహించింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
హైదరాబాద్
5
సోమవారం
06 । జనవరి । 2025




## ఫేస్ మేకప్‌ను ఇలా సాధారణ చిట్కాలతో



ఆడపిల్లలకు అందంగా రెడీ అవ్వడం అంటే మహా ఇష్టం. పెళ్లిళ్లతోపాటు ఇతర ఫంక్షన్లలో మేకప్ కంపల్సరీగా ఉండాల్సిందే. కొంతమంది మేకప్ లేకుండా బయట అడుగు కూడా వేయరు. అయితే, మేకప్ వేసే ముందు దాన్ని తొలగించడం గురించి కూడా తెలుసుకోవాలి. ముఖానికి మేకప్ ఎక్కువ సేపు ఉంచడం చర్మ ఆరోగ్యానికి ఏ మాత్రం మంచిది కాదు. అలాంటి మేకప్‌ని తొలగించడం అనుకున్నంత సులభం కాదు. మేకప్‌ను సరైన మార్గంలో తొలగించడానికి ఈ కొన్ని చిట్కాలను అనుసరించండి.

**క్లెన్సింగ్ ఆయిల్:**
క్లెన్సింగ్ ఆయిల్‌తో ముఖంపై మేకప్‌ను శుభ్రం చేసుకోవచ్చు. క్లెన్సింగ్ ఆయిల్ మొండి మేకప్‌ను తొలగించడమే కాకుండా, రసాయనాలతో నిండిన మలినాలను తొలగించడంలోనూ సహాయపడుతుంది. ఇది చర్మానికి హాని కలిగించదు.

**మేకప్ రిమూవర్:**
మార్కెట్‌లో లభించే ఈ లిక్విడ్ మేకప్ రిమూవర్ తేమ కారణంగా మేకప్‌ను సులభంగా తొలగించగలదు. ఇది చర్మాన్ని తేమగా ఉంచుతుంది. అలాగే ఎటువంటి జిడ్డు లేకుండా ముఖాన్ని శుభ్రపరుస్తుంది.

**మేకప్ రిమూవర్ వైప్స్:** మార్కెట్‌లో లభించే వైప్స్‌తో మేకప్ తొలగించుకోవచ్చు. ఈ మేకప్ రిమూవల్ వైపర్ చర్మంలోని మలినాలను తొలగిస్తుంది, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది.

**బాదం నూనె:** వంటగదిలో ఉండే ఈ వస్తువులు మేకప్‌ను తొలగించడానికి కూడా ఉపయోగపడతాయి. కాబట్టి ఇంట్లో జీడిపప్పు, బాదం నూనె ఉంటే మేకప్‌ను తొలగించుకోవచ్చు.

# నా కష్టం... వేరొకరికి రాకూడదని...



పదిహేనేళ్లకే పెళ్లి. పద్దెనిమిదేళ్లు నిండకుండానే ఒక బిడ్డకు తల్లి. వద్దు వద్దని మొత్తుకున్నా పుట్టింటివాళ్లు బరువు వదిలించుకున్నారు. అత్తింటివారు మాఇంటికి రావద్దని అన్నారు. అందరూ ఉండి ఒంటరి అయ్యారు 24 ఏళ్ల రోషిణీ పర్వీన్. కానీ ఆమె కుంగిపోలేదు. విపత్కర పరిస్థితులకు ఎదురొడ్డి ఆత్మవిశ్వాసంతో నిలబడ్డారు. బాల్య వివాహాలను అరికడుతూ... ఎందరో బాలికల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నారు.

“నా బాల్యం అంతా ముళ్ల బాటలోనే సాగింది. బాగా చదువుకొని... ఒకరిపై ఆధారపడకుండా నా బతుకు నేను బతుకుదామని అనుకున్నా. కానీ ఆ సంకల్పానికి మా అమ్మానాన్నలే విఘాతం కలిగించారు. బీహార్ రాష్ట్రం కిషన్‌గంజ్ జిల్లాలోని మారుమూల పల్లె సిమల్‌బారీలో ఓ సాధారణ కుటుంబం మాది. ఎనిమిదో తరగతి వరకు అంతా బాగానే సాగింది. ఎప్పుడైతే తొమ్మిదో తరగతిలోకి అడుగుపెట్టానో అప్పటి నుంచీ ఊహించని కష్టాలు వచ్చిపడ్డాయి. మా ఇంట్లోవాళ్లు పెళ్లి సంబంధాలు చూడడం మొదలుపెట్టారు. ‘ఇంకా పదో తరగతి కూడా పూర్తవ్వలేదు. అప్పుడే పెళ్లేంటి?’ అని అడిగాను. నాకు ఇంకా చదువుకోవాలని ఉందని, అప్పటివరకు ఓపిక పట్టమని ప్రాధేయపడ్డాను. అమ్మానాన్న వినలేదు. రోజూ ఎవరూ ఒకరు నన్ను చూడ్డానికి వచ్చేవారు. చాలా సంబంధాలు తిప్పి పంపాను. అయినా వాళ్ల ప్రయత్నం ఆగలేదు. చివరకు నా పోరాటం వృథా అయింది. బలవంతంగా పెళ్లి చేశారు. అది కూడా నాకంటే వయసులో మూడు రెట్లు పెద్దవాడితో. అప్పుడతనికి 45 సంవత్సరాలు. అత్తింటికి వెళ్లేవరకు అతని వయసు నాకు తెలియదు. వివాహ బంధం అంటే ఏంటో కూడా అవగాహన లేదు. వేధింపులు ఎక్కువయ్యాయి. దాంతో భయం వేసి మూడు నెలలకే మా ఇంటికి వెళ్లిపోయాను.

**పుట్టింటివారూ పట్టించుకోలేదు...**

కొన్నాళ్లకు తెలిసింది... నేను గర్భవతిని అని. తరువాత బాబు పుట్టాడు. భర్త దగ్గరకు వెళ్లమని అమ్మానాన్న చెప్పారు. నేను ఆ నరకంలోకి మళ్లీ వెళ్లాలనుకోలేదు. కానీ ఇంట్లోవాళ్లు బలవంతం చేశారు. వెళితే... అత్తింటివాళ్లు నన్ను లోపలికి రానివ్వలేదు. ఏడాది దూరంగా ఉన్నానని, అందుకే నేను తనకు వద్దని నా భర్త తెగేసి చెప్పాడు. మా ఇంట్లోవాళ్లు కూడా నన్ను రానివ్వలేదు. అందరూ ఉండి ఎవరూ లేని అనాథనయ్యాను. చంకలో పసి బిడ్డతో రోడ్డున పడ్డాను. అలాగని బాధతో కూర్చోలేదు. నా కాళ్ల మీద నేను నిలబడాలని ఆ క్షణమే బలంగా నిర్ణయించుకున్నాను.

**బంధాలు తెంచుకుని...**

నన్ను వద్దనుకున్న భర్త, నాకు ఆశ్రయం ఇవ్వని తల్లిదండ్రులు, సామాజిక కట్టుబాట్లు... బంధాలన్నిటినీ తెంచుకొని ధైర్యంగా అడుగు బయటకు వేశాను. నా కోసం, నా బిడ్డకు బంగారు భవిష్యత్తు కోసం కృషి చేయాలని సంకల్పించాను. తొలుత ఒక షోరూమ్‌లో హెల్పర్‌గా చేరాను. అదే సమయంలో ‘చైల్డ్‌లైన్ ఇండియా ఫౌండేషన్’లో వాలంటీర్‌గా పని చేశాను. అక్కడ నాలా భయంకరమైన కథలున్న మహిళలు చాలామందిని చూశాను. బాల్య వివాహానికి బలయింది నేనొక్కదాన్నే కాదని అప్పుడు అర్థమైంది. అలాంటి మహిళల గళం నేనెందుకు కాకూడదనే ఆలోచన వచ్చింది. నాటి నుంచి మహిళల హక్కుల సాధన, సాధికారత దిశగా అడుగులు వేశాను. ముఖ్యంగా బాల్య వివాహాలను నియంత్రించడంపై దృష్టి పెట్టాను.

**పాఠశాలల్లో పునాది...**

సమాజంలో రుగ్మతలు రూపుమాపి, బాల్య వివాహాలు అరికట్టాలంటే తల్లిదండ్రులతో పాటు బాలికలకు కూడా అవగాహన కల్పించాలి. ఆ ఉద్దేశంతోనే పలు గ్రామాల్లోని బాలికలతో పదిహేను బృందాలు ఏర్పాటు చేశాను. స్థానిక పెద్దలు, నాయకుల సాయం కూడా తీసుకున్నాను. వారందరి సహకారంతో ఎక్కడైనా బాల్య వివాహాలకు సంబంధించిన సమాచారం సేకరిస్తాను. ఎక్కడైనా అందుకు ఏర్పాట్లు జరుగుతుంటే తక్షణం వెళ్లి, పెద్దలతో మాట్లాడి ఆపడానికి ప్రయత్నిస్తాను. ఒకవేళ వినకపోతే తదనంతర పరిణామాల గురించి వివరిస్తాను. అప్పటికీ దారికి రాకపోతే పోలీసుల సహాయం తీసుకొంటాను.

**ఇక్కడే ఎక్కువ...**

‘నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే’ (ఎన్‌ఎఫ‌హెచ్‌ఎస)-5 నివేదిక ప్రకారం... 20 నుంచి 24 ఏళ్ల మధ్య వయసుగల ప్రతి ఐదుగురు మహిళల్లో ఇద్దరు 18 ఏళ్లు నిండకుండా పెళ్లి చేసుకున్నవారే. అంత చిన్న వయసులో వివాహ బంధంలోకి అడుగుపెట్టడంవల్ల వాళ్లు విలువైన జీవితాన్ని కోల్పోతున్నారు. అది వారికి జీవితాంతం ఒక మాయని గాయంలా మిగిలిపోతోంది. అలాగే మహిళల అక్రమ రవాణా కూడా పెద్ద సమస్యగా మారింది. వీటన్నిటిపైనా ఒక యుద్ధమే చేస్తున్నా. అమ్మాయిలు నిర్భయంగా తమ జీవితానికి ఏంకావాలో నిర్ణయించుకొనే స్వేచ్ఛను కల్పించేందుకు కృషి చేస్తున్నా. స్వయంసాధికారత దిశగా వారిని నడిపించేందుకు నావంతు ప్రయత్నం ఇది.” ‘యునిసెఫ్’తో కలిసి...

‘సేవ్ ది చిల్డ్రన్, యునిసెఫ్’ తదితర స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేస్తూ వచ్చాను. ఆ క్రమంలో బీహార్‌లోని చాలా గ్రామాలు తిరిగాను. బాల్య వివాహాలవల్ల కలిగే అనర్థాలను తల్లిదండ్రులకు చెప్పాను. అది వారి భవిష్యత్తును మొగ్గలోనే చిదిమేస్తుందని, అది చట్టవిరుద్ధమని వివరించాను. ఫలితంగా ఇప్పటికి పదుల సంఖ్యలో బాల్య వివాహాలు ఆపగలిగాను. నా ప్రయత్నానికి ప్రోత్సాహకంగా రెండేళ్ల కిందట జెనీవాలో జరిగిన సదస్సులో ‘యునైటెడ్ నేషన్స్’ నాకు ప్రతిష్టాత్మక అవార్డునిచ్చి సత్కరించింది. సమాజంలో పాతుకుపోయిన కట్టుబాట్లను దాటి, మహిళల జీవితాల్లో మంచి మార్పునకు కృషి చేస్తున్నందుకుగానూ నన్ను కొనియాడింది.

# గ్రామాన్నే తీర్చిదిద్దింది..



ఒక సర్పంచ్‌గా ఆమె చేసిన చిన్న ప్రయత్నం ఆ గ్రామ మహిళల ఆలోచనా విధానాన్నే మార్చేసింది. గృహిణి పేరుతో ఇంటి ముందు తగిలించిన నేమ్ ప్లేట్... వారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచింది. మగవారికి మగువ ఎందులోనూ తీసిపోదని చెబుతూ... వారిని సాధికారత దిశగా అడుగులు వేయిస్తున్నారు శేషన్‌దీప కౌర్ సిద్ధూ. ప్రస్తుతం పదవిలో లేకపోయినా... తన ప్రాంత మహిళలకు మార్గదర్శి అయ్యారు ఈ మాజీ సర్పంచ్.

“తెల్లారి లేచింది మొదలు రాత్రి పడుకొనే వరకూ ఇంట్లో ఆడవారికి క్షణం తీరిక దొరకదు. కానీ వారి కష్టం ఎవరికీ పట్టదు. వారి ఆవేదన అరణ్యరోదన. కనీస గుర్తింపునకు నోచుకోని జీవితాలు గృహిణులవి. కాలంతో పోటీపడి పరుగెడుతున్నా... ప్రపంచం మన అరచేతులోకి వచ్చేసినా... మా గ్రామంలో ఇంకా అసమానతలే. ఇది నన్ను కలచివేసింది. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే ఎవరో ఒకరు తొలి అడుగు వేయాలి. నేను చేసింది అదే. సర్పంచ్‌గా నాకు వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకొని... గ్రామీణ మహిళల్లో చైతన్యం నింపే ప్రయత్నం చేశాను. పంజాబ్ బతిండా జిల్లా మానక్‌ఖానా గ్రామం మాది. చిన్నప్పటి నుంచి నేను చదువులో ముందుండేదాన్ని. సివిల్స్ సాధించాలన్నది ఆశయం. దాని కోసం ఢిల్లీలో చదువుకొంటూ సన్నద్ధమయ్యాను.

**గ్రామానికి తిరిగివచ్చి...**

సివిల్స్ కోసం కఠోరంగా శ్రమించాను. 2018లో తొలిసారి పరీక్ష రాశాను. కానీ విఫలమయ్యాను. అది నన్ను బాగా కుంగదీసింది. అంత కష్టపడినా ర్యాంకు సాధించలేకపోవడంతో తిరిగి మా గ్రామానికి వచ్చేశాను. ఈసారి ఇంటి దగ్గరే ఉండి చదువుకొందామని నిర్ణయించుకున్నాను. కానీ మనం ఒకటి తలిస్తే దైవం మరోలా తలుస్తుందంటారు. నా విషయంలోనూ అదే జరిగింది. మా ఊళ్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకొని... నన్ను సర్పంచ్‌గా ఉండమని అడిగారు. పురుషాధిక్యం ఉన్న మా ప్రాంతంలో ఒక మహిళకు ఇలాంటి అవకాశం రావడం అరుదైన పరిణామం. గతంలో మా గ్రామంలో ఏ మహిళ కూడా ఈ పదవిని అలంకరించలేదు. దాంతో అడగంగానే సరేనన్నాను.

**మార్పు వైపు తొలి అడుగు...**

సర్పంచ్ అయ్యాను. బానే ఉంది. కానీ అసలు సర్పంచ్‌గా నా విధులు, అధికారాలు ఏమిటన్న దానిపై స్పష్టత లేదు. ఎక్కడ మొదలు పెట్టాలి? ఎలా మొదలుపెట్టాలి? అంతా అయోమయం. కానీ మార్పు తేవడానికి నాకు లభించిన అద్భుత అవకాశం ఇది. దీన్ని వదులుకోకూడదని నిశ్చయించుకున్నాను. ఢిల్లీలో ఉండగా మహిళా సాధికారతకు సంబంధించి నేను కొన్ని స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేశాను. ఆ అనుభవం నాకు ఇక్కడ పనికివచ్చింది. ఒకరిపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదిగేందుకు కావల్సిన అంశాలపై దృష్టి పెట్టాను. అంతేకాదు, ఎప్పుడూ గుమ్మం దాటని ఆడవారి జీవితాల్లో వెలుగులు నింపి, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే ధ్యేయంగా పని చేయాలని అనుకున్నా. అందులో భాగంగా తొలుత తమ ఆశయాల సాధన దిశగా మహిళలను ప్రోత్సహించాను.

**గ్రంథాలయంతో మొదలు...**

ఆరంభంలో అందరూ నన్ను అవహేళన చేశారు. నీవల్ల ఏమవుతుందంటూ ప్రశ్నించారు. ఎవరు ఏమన్నా, ఎంత నిరుత్సాహపరిచినా... నా సామర్థ్యం ఏమిటో నాకు తెలుసు. సర్పంచ్‌గా నా తొలి ముద్ర గ్రంథాలయ నిర్మాణం. అధ్వాన్నంగా ఉన్న రోడ్ల పనుల వంటివి పక్కన పెట్టి ఎవరికీ ఉపయోగంలేని గ్రంథాలయం ఏంటని చాలామంది ప్రశ్నించారు. నాకు పిచ్చి పట్టిందని కొందరు వ్యాఖ్యానించారు. అది ఒక భవనం మాత్రమే కాదు... గ్రామంలోని భవిష్యత్ తరాల ఆశలు, ఆశయాలకు ఒక చిహ్నమని చెప్పాను. పిల్లల ఎదుగుదలలో గ్రంథాలయాల పాత్ర ప్రముఖమైనదని వివరించాను. అందులో అన్ని వయసులవారికీ ఉపయోగపడేలా పంజాబీ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో విలువైన పుస్తకాలు పెట్టాము. భద్రత కోసం సీసీటీవీ కెమెరాలు అమర్చాం. క్రమంగా గ్రామస్తులందరూ గ్రంథాలయానికి వెళ్లడం అలవాటుగా మార్చుకున్నారు.

**కన్నీళ్లు పెట్టుకున్నారు...**

గ్రామ అభివృద్ధితో పాటు మహిళల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాను. ఆ క్రమంలోనే ఇంటి ముందు నేమ్ ప్లేట్లు నన్ను ఆకర్షించాయి. అవి చూసినప్పుడు అనిపించింది... ‘వాటిపై మగవారి పేరు మాత్రమే ఎందుకు రాయాలి’ అని! గృహిణుల పేరుతో నేమ్ ప్లేట్లు రాయించాను. ప్రతి ఇంటి ముందూ వాటిని తగిలించాము. అవి చూసుకొని మహిళలు భావోద్వేగానికి లోనయ్యారు. ‘మా ఆత్మగౌరవాన్ని నిలబెట్టావంటూ’ కృతజ్ఞతలు చెప్పారు. ఒక యువతి నా దగ్గరకు వచ్చి... ‘ఇప్పటివరకు నన్ను బయటకు అడుగుపెట్టనివ్వలేదు. నా నిర్ణయాలు నేను తీసుకొనే స్వేచ్ఛ లేదు. కానీ ఇవాళ ఇంటి ముందు నా పేరు చూసినప్పుడు ఎంతో గర్వంగా అనిపించింది’ అంటూ కన్నీళ్లు పెట్టుకుంది. ఇలా ఒక మహిళ పేరుతో డోర్ ప్లేటు కనిపించడం మా ఊళ్లో ఇదే మొదలు. ఈ ఏడాది సర్పంచ్‌గా నా పదవీకాలం అయిపోయింది. కానీ మహిళను సాధికారత వైపు నడిపించేందుకు, వారి జీవితాల్లో మార్పు తెచ్చేందుకు నా పయనం సాగుతూనే ఉంటుంది.”

**మహిళలకు ప్రత్యేకం...**

మార్పు వైపు నేను వేసిన మలి అడుగు... మహిళలు, పిల్లల కోసం ప్రత్యేక పార్కు ఏర్పాటు. నిత్యం ఇంటి పనుల్లో తలమునకలయ్యే ఆడవారికి తమకంటూ కాస్త సమయం కూడా దొరకదు. సరదాగా కాసేపు సేద దీరేందుకు అవకాశం ఉండదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని, తీరిక సమయంలో కాస్తంత ఆహ్లాదంగా గడిపేలా ఈ పార్కును తీర్చిదిద్దాము.

## ఈ అద్భుతమైన హెూం రెమెడీ ఒక వారంలో పగిలిన మడమలను సరిచేస్తుంది..



పగిలిన మడమల నివారణలు: చలికాలం రాగానే శరీరంలోని చర్మంలో అనేక మార్పులు సంభవిస్తాయి. చాలా మంది చర్మం పగుళ్లు, మడమల సమస్యతో బాధపడుతుంటారు. కొంతమందికి చర్మం ఎక్కువగా దెబ్బతింటుంది. అయితే, చర్మంలో పగుళ్లు, మడమల్లో పగుళ్లు పెద్ద సమస్యగా మారతాయి. అయితే, ఈ అద్భుతమైన హెూం రెమెడీ ఒక వారంలో పగిలిన మడమలను సరిచేస్తుంది.

**మాయిశ్చరైజర్:**
చలికాలంలో చర్మానికి తేమ అవసరం. కాబట్టి మంచి నాణ్యత గల మాయిశ్చరైజర్‌ను ఉపయోగించడం చాలా ముఖ్యం, ముఖ్యంగా పాదాల చర్మం యొక్క తేమను నిర్వహించడానికి మాయిశ్చరైజర్ సహాయపడుతుంది. మాయిశ్చరైజర్ చర్మాన్ని లోతుగా పోషించే పదార్థాలను కలిగి ఉంటుంది.

**నూనెతో మసాజ్ చేయండి:**
రాత్రి పడుకునే ముందు కొబ్బరి నూనె లేదా ఆలివ్ నూనెతో మీ మడమలను మసాజ్ చేయండి. ఈ నూనెలు యాంటీఆక్సిడెంట్, హైడ్రేటింగ్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇది చర్మాన్ని మృదువుగా చేస్తుంది. అంతేకాకుండా పగిలిన మడమలను నయం చేస్తుంది.

గోరువెచ్చని నీటిలో నానబెట్టండి:
పగిలిన మడమలను నయం చేయడానికి, గోరువెచ్చని నీటిలో కొంచెం ఉప్పు కలపి మీ పాదాలను నానబెట్టండి. ఇది చర్మాన్ని మృదువుగా చేయడంతో పాటు మడమల పగుళ్లకు ఉపశమనాన్ని అందిస్తుంది.

**ఆహారం:**
చర్మం, మడమల పగుళ్లను నివారించడానికి విటమిన్లు ఎ, సి, ఇ అధికంగా ఉండే ఆహారాన్ని తినండి. దీని కోసం క్యారెట్, ఆకుకూరలు, పండ్లు, డ్రై ఫ్రూట్స్ తినవచ్చు. ఇవి మీ చర్మానికి లోపలి నుండి పోషణనిస్తాయి. అంతేకాకుండా పొడిబారకుండా కాపాడతాయి. గట్టిగా ఉన్న బూట్లు ధరించడం మానుకోండి. పాదాలకు సౌకర్యవంతమైన, మృదువైన బూట్లు ధరించండి.

నీరు తీసుకోవడం:
చలికాలంలో ప్రజలు తక్కువ నీరు తాగుతారు. చలికాలంలో శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచుకోవడం చాలా ముఖ్యం. వీలైనంత ఎక్కువ నీరు త్రాగండి, ఎందుకంటే ఇది మీ చర్మాన్ని లోపల నుండి హైడ్రేట్ చేస్తుంది, పొడిబారకుండా కాపాడుతుంది.


# మడమల్లో పగుళ్లా!



చలికాలం వస్తోందంటే కొంతమందికి అది ఒక పీడకలలాగే అనిపిస్తుంది. పాదాలు, మడమలు పగిలి రక్తం వెలికి రావడం, దాని తాలూకు నొప్పి, మంటలు కొందరికి నిజంగానే నరకాన్ని తలపిస్తాయి. నిజానికి ఈ సమస్యను చిన్నపాటి చిట్కా వైద్యాలతోనే అధిగమించవచ్చు. ముఖ్యంగా చలి కాలమంతా రోజుకు రెండు సార్లు మాయిశ్చరైజర్‌తో పాదాల్ని శుభ్రం చేసుకోవడం ఒక పద్ధతి. ఇలా చేయడం వల్ల పాదాలు ఎండిపోవడం గానీ, గరుకుగా మారడం గానీ ఉండదు. గోరు వెచ్చని నీళ్లల్లో కొంచెం తేనె వేసి, ఆ నీళ్లల్లో పాదాలు ఉంచితే పాదాలు పగుళ్లు పోయి మృదువుగా మారతాయి. ఆయుర్వేద శాస్త్రం, బ్యాక్టీరియా, సెప్టిక్ సమస్యల నుంచి మడమలు, పాదాల్ని కాపాడుకోవడానికి ఈ విధానాన్నే సూచిస్తుంది. తేనెలో మాయిశ్చరైజర్‌గా ఉపయోగపడే గుణాలు కూడా ఉన్నాయి. వీటన్నింటితో పాటు, పాదాల పరిరక్షణలో ఆలివ్ ఆయిల్ పాత్ర కూడా కీలకలమే. పాదాలు పగుళ్లు బారిన చోట ఆలివ్ ఆయిల్‌తో మర్దనా చేస్తే ఆ భాగాల్లో రక్తప్రసరణ పెరుగుతుంది. చాలామంది స్నానానికి ముందు ఆలివ్ ఆయిల్ మర్దనం చేసుకోవడంలోని ఉద్దేశం ఇదే. వీటితో పాటు చలికాలంలో పాదాలకు కాటన్ సాక్స్ వాడటం చాలా మేలు. ఇవి కాలుష్యాలనుంచి, దుమ్ము, ధూళినుంచి కాపాడతాయి. పాదాల్ని కాపాడటంలో హెర్బల్ క్రీములు బాగా ఉపయోగపడతాయి. ఈ క్రీమును గోరువెచ్చని నీళ్లతో కలిపి పాదాలు పగిలిన చోట పూయాలి. ఉదయం వేళల్లోనూ, నిద్ర కు ముందు ఇలా రోజుకు రెండు సార్లు ఈ క్రీమును వాడి తే మడమల, పాదాల బాధలు చాలా వరకు తగ్గిపోతాయి.

**కార్డియో ఎక్సర్‌సైజ్**
గుండె వేగం పెరిగేలా చేసే వ్యాయామాల వల్ల తక్కువ సమయంలో ఎక్కువ క్యాలరీలు ఖర్చవుతాయి. ఇందుకోసం ఈ కార్డియో ఎక్సర్‌సైజెస్ బెస్ట్ ఛాయిస్. ట్రెడ్‌మిల్: ట్రెడ్‌మిల్ మీద పరిగెత్తగలిగేంత వేగం, గ్రేడ్ సెట్ చేసుకుని ఆగకుండా 20 ని.లు పరిగెత్తేకంటే మధ్యలో 3 ని.లపాటు వేగం తగ్గించి తిరిగి పెంచుతూ పరిగెత్తితే రెట్టింపు ఫలితం ఉంటుంది. సైడ్ జంప్: నిలబడ్డ చోటునుంచి కుడి, ఎడమ పక్కకు జంప్ చేసి తిరిగి యథాస్థానానికి రావాలి. ఇలా 20 సార్లు చేయాలి. స్పాట్ లెగ్ లిఫ్ట్: కాలు మడిచి పైకి లేపి తిరిగి దించేయాలి. అలా రెండో కాలితో కూడా చేయాలి.

# బిజినెస్




## హైదరాబాద్‌లో స్టాండర్డ్ గ్లాస్ మరో యూనిట్



**హైదరాబాద్-నవభూమి:**రాష్ట్రానికి చెందిన ప్రత్యేక ఇంజినీరింగ్ పరికరాల తయారీ సంస్థ స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్..హైదరాబాద్‌లో మరో ప్లాంట్‌ను నెలకొల్పబోతున్నది. ఇప్పటికే నగరం చుట్టు తొమ్మిది యూనిట్లు ఉండగా, రూ.130 కోట్ల పెట్టుబడితో పదో యూనిట్‌ను నెలకొల్పబోతున్నట్లు, వచ్చే ఏడాదిన్నరలోగా ఈ యూనిట్ అందుబాటులోకి రాబోతున్నట్లు కంపెనీ చైర్మన్ నాగేశ్వర్ రావు తెలిపారు. నగరానికి సమీపంలోని జిన్నారం వద్ద 36 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేయతలపెట్టిన ఈ యూనిట్‌లో ఆయిల్-గ్యాస్, పెట్రోకెమికల్స్, వంటనూనెలకు సంబంధించి రియక్టర్లను తయారు చేయనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం సంస్థ చేతిలో రూ.450 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయని, వీటిని వచ్చే ఏడాదిలోగా సరఫరా చేయనున్నట్లు తెలిపారు. దేశీయంగా రియక్టర్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ సరికొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు, వీటిని దేశవ్యాప్తంగా సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.540 కోట్లుగా ఉన్న టర్నోవర్, ప్రతియేటా రెండంకెల వృద్ధిని న వె ా ద ం
చేసుకుంటున్నదని, ఇదే క్రమంలో వచ్చే ఐదేండ్లలో రూ.4 వేల కోట్ల టర్నోవర్ చేరుకునే అవకాశాలున్నాయన్నారు.

సోమవారం నుంచి ఐపీవో..వచ్చే సోమవారం నుంచి ఐపీవోకి రాబోతున్నట్లు సంస్థ ప్రకటించింది. షేరు ధరల శ్రేణిని రూ.133 నుంచి రూ.140గా నిర్ణయించింది. రూ.10 ముఖ విలువ కలిగిన 1.42 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో విక్రయించనుండటంతో రూ.400 కోట్ల వరకు నిధులు సమకూరవచ్చునని తెలిపింది.

# గతవారం ట్రేడింగ్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు భారీ నష్టం..




**న్యూఢిల్లీ-నవభూమి:**గతవారం దేశీయ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈ-30 లిస్టెడ్ కంపెనీల్లోని టాప్ 10 కంపెనీల్లో నాలుగు కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.96,605.66 కోట్లు కోల్పోయాయి. వాటిల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంకు, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) భారీగా నష్టపోయాయి. మరోవైపు, రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతీ ఎయిర్ టెల్, ఇన్ఫోసిస్, ఐటీసీ, భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ), హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్) లాభ పడ్డాయి. టాప్-10 సంస్థల్లో మిగతా ఆరు సంస్థలు తమ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.82,861.16 కోట్లకు పెంచుకున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 37,025.46 కోట్లు పతనమై రూ.13,37,919.84 కోట్లకు చేరుకున్నది. ఐసీఐసీఐ బ్యాంక్ ఎం-క్యాప్ రూ.29,324.55 కోట్ల నష్టంతో రూ. 8,93,378.50 కోట్ల వద్ద స్థిర పడింది. టీసీఎస్ ఎం-క్యాప్ రూ.24,856.26 కోట్లు కోల్పోయి రూ.14,83,144.53 కోట్లకు పరిమితమైంది. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) ఎం-క్యాప్ రూ. 5,399.39 కోట్ల పతనంతో రూ.7,08,168.60 కోట్లకు చేరుకున్నది.మరోవైపు, రిలయన్స్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.41,138.41 కోట్ల వృద్ధితో రూ.16,93,373.48 కోట్ల వద్ద ముగిసింది. హిందూస్థాన్ యూనీ లివర్ ఎం-క్యాప్ రూ.15,331.08 కోట్లు పెరిగి రూ.5,65,194.18 కోట్లకు చేరుకుంది. ఎల్ఐసీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 13,282.49 కోట్లు పెరిగి రూ.5,74,689.29 కోట్ల వద్ద నిలిచింది. ఇన్ఫోసిస్ ఎం-క్యాప్ రూ.9,031.19 కోట్లు వృద్ధి చెంది 8,04,834.34 కోట్ల వద్ద ముగిసింది.

ఐటీసీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3,878.63 కోట్లు పెరిగి రూ.6,03,064.44 కోట్ల వద్ద నిలిచింది. భారతీ ఎయి టెల్ ఎం-క్యాప్ రూ.199.36 పెరిగి రూ.9,10,934.58 కోట్లకు సరిపెట్టుకుంది. గత వారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత టాప్ టెన్ సంస్థల్లో రిలయన్స్ మొదటి స్థానంలో కొనసాగుతున్నది. తర్వాతీ స్థానాల్లో టీసీశ్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీ బ్యాంకు, హిందూస్థాన్ యూనీ లివర్ నిలిచాయి.

## బీమా సఖి యోజన స్కీం ఇలా అప్లై చేయండి.. నెలకు రూ.7 వేలు పొందండి..



**న్యూఢిల్లీ-నవభూమి:**మహిళల కోసం ప్రత్యేకంగా ఎల్ఐసీ బీమా సఖీ పథకాన్ని కేంద్రం ఇటివల ప్రారంభించింది. ఈ స్కీం ప్రధాన లక్ష్యం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం, మహిళల్లో బీమా అవగాహన పెంచడం, బీమా కోసం వారిని ప్రోత్సహించడం. మహిళల ఆర్థిక అక్షరాస్యతను ప్రోత్సహించడంతోపాటు వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం. ఈ పథకం కింద శిక్షణ సమయంలో మహిళలు రూ. 2 లక్షల కంటే ఎక్కువ ఆర్థిక సహాయం, కమీషన్ ప్రయోజనం పొందుతారు. అయితే దీని కోసం ఎలా దరఖాస్తు చేయాలి, ఉండాల్సిన అర్హతల వివరాలను ఇక్కడ తెలుసుకుందాం.

బీమా సఖి యోజన స్కీంలో శిక్షణ తర్వాత మహిళలను %వా×జ% ఏజెంట్లుగా నియమిస్తారు. గ్రాడ్యుయేట్ మహిళలు కూడా డెవలప్‌మెంట్ ఆఫీసర్లుగా అవకాశం పొందుతారు. ఈ స్కీం కోసం ప్రభుత్వం తొలుత రూ. 100 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది.

**వయో పరిమితి**

18 నుంచి 70 సంవత్సరాలు

విద్యా అర్హత

కనీసం 10వ తరగతి ఉత్తీర్ణత

శిక్షణ సమయంలో నెలవారీ స్టైఫండ్:

మొదటి సంవత్సరం: నెలకు రూ. 7,000

రెండో సంవత్సరం: నెలకు రూ. 6,000

మూడో సంవత్సరం: నెలకు రూ. 5,000

మొత్తం ప్రయోజనం: మూడేళ్లలో రూ. 2 లక్షల కంటే ఎక్కువ, అలాగే విక్రయించిన పాలసీలపై కమీషన్ లభిస్తుంది.

వచ్చే మూడేళ్లలో 2 లక్షల మంది మహిళలకు ఎల్ఐసీ ఏజెంట్లుగా శిక్షణ ఇవ్వాలని లక్ష్యం

మొదటి దశలో 35 వేల మంది మహిళలకు శిక్షణ ఇవ్వనున్నారు.

శిక్షణలో బీమా, ఆర్థిక సేవల గురించి పూర్తి సమాచారం ఇవ్వబడుతుంది. తద్వారా మహిళలు పాలసీలను సమర్థవంతంగా విక్రయించవచ్చుఎలా దరఖాస్తు చేయాలంటే

బీమా సఖి స్కీమ్ కోసం దరఖాస్తు కోసం అధికారిక వెబ్‌సైట్ (https://licindia.in/test2)పై క్లిక్ చేయండి

ఆ తర్వాత క్లిక్ ఫర్ బీమా సఖి ఆప్షన్‌పై క్లిక్ చేయండి.

అప్పుడు వచ్చిన ఫారమ్‌ను మీ పేరు, పుట్టిన తేదీ, చిరునామా వంటి వివరాలతో పూరించండి

దీని తర్వాత వచ్చిన క్యాప్చా కోడ్‌ను నమోదు చేసి "సమర్పించు"పై క్లిక్ చేయండి

అప్పుడు మీరు ఆ జిల్లా పరిధిలోకి వచ్చే శాఖల పేర్లను చూస్తారు. మీరు పని చేయాలనుకుంటున్న బ్రాంచ్‌ని ఎంచుకుని "సబ్మిట్ లీడ్ ఫారమ్"పై క్లిక్ చేయండి

ఫారమ్‌ను సమర్పించిన తర్వాత మీరు స్క్రీన్‌పై సందేశాన్ని చూస్తారు. మీ మొబైల్ నంబర్‌కు నోటిఫికేషన్ కూడా వస్తుంది.

# స్మార్ట్‌సిటీపై ప్రభుత్వం శీతకన్ను



**హైదరాబాద్-నవభూమి:** జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీ ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం మీనమేశాలు లెక్కిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం స్మార్ట్‌సిటీ ప్రాజెక్టును మంజూరు చేసినప్పటికీ పనులు చేపట్టడానికి పరిశ్రమల మంత్రిత్వ శాఖ ముందుకురావడం లేదు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే దీనికి అవసరమైన భూసేకరణ చేసినప్పటికీ ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీకి సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేయడంలో విఫలమవుతున్నారు. ఎన్ఐసీడీపీ కింద కేంద్రం గతేదాది ఆగస్టులో జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీనీ ప్రాజెక్టును మంజూరు చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్-నాగపూర్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా మంజూరైన ఈ స్మార్ట్‌సిటీ మొదటి దశలో రూ. 2,361 కోట్లతో 3,245 ఎకరాల్లో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.ఈ ప్రాజెక్టుతో రూ.10 వేల కోట్ల పెట్టుబడులు, 1.74 లక్షల ఉద్యోగాలు లభించనున్నాయని అంచనా. ఆటోమొబైల్, రవాణా, ఎలక్ట్రికల్ విడిభాగాలు, మెటల్స్-నాన్ మెటాలిక్ మినరల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర పరిశ్రమలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణలో భాగంగా ప్లగ్ అండ్ ప్లే, వాక్ టూ వర్క్ విధానంలో ఈ స్మార్ట్‌సిటీలను అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్దేశించింది. అత్యాధునిక మౌలిక సదుపాయాల కల్పన ద్వారా భారీగా పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు సమతుల అభివృద్ధికి ఇది తోడ్పాటును అందించే అవకాశముంది. పీఎం గతిశక్తి నిబంధనల ప్రకారం ఇండస్ట్రియల్ ఇకోసిస్టం, స్కిల్డ్ వర్క్‌ఫోర్స్‌తో, విద్యా, వైద్య సదుపాయాలు, రవాణా వ్యవస్థతో కూడిన సమీకృత అభివృద్ధి, మంచినీరు, విద్యుత్, గ్యాస్, టెలికం, రోడ్డు, రైలు, ఎయిర్‌పోర్టు తదితరవాటి కనెక్టివిటీ, పర్యావరణానికి హాని కలుగని విధంగా వీటిని తీర్చిదిద్దాల్సివుంది.

**కేసీఆర్ హయాంలోనే భూసేకరణ..**

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జహీరాబాద్, న్యాలకల్, ఝరాసంఘం మండలాల పరిధిలో సుమారు 13,500 ఎకరాల్లో నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్-జహీరాబాద్(నిమ్జ్) కోసం సేకరించాలని నిర్ణయించగా, అందులో 10 వేల ఎకరాల భూసేకరణ పూర్తయింది. దీనికి పర్యావరణ అనుమతులు కూడా లభించాయి. ప్రస్తుతం కేంద్రం మంజూరు చేసిన ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీ కూడా ఈ ప్రాంతంలోనే ఉంది. సంగారెడ్డి జిల్లాలోని న్యాలకల్, ఝరాసంగం మండలాల్లోని 17 గ్రామాల్లో జహీరాబాద్ పారిశ్రామిక ప్రాంతం కేంద్రంగా ఈ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ నిర్మాణం చేయాలని నిర్ణయించారు. మొత్తం రెండు దశల్లో, దాదాపు 12,500 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు విస్తరించే విధంగా ప్రతిపాదనలున్నాయి. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్ మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్(ఎన్ఐసీడీఐటీ) ఫ్రేమ్ వర్‌లో భాగంగా.. 3,245 ఎకరాల్లో మొదటి దశలో పనులు ప్రారంభించాల్సి ఉంది. అనుకూలతలున్నా పడని ముందడుగు..

ఈ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ పూణె-మచిలీపట్నం జాతీయ రహదారికి(ఎన్‌హెచ్-65)కి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. దీంతోపాటుగా నిజాంపేట్-బీదర్ రాష్ట్ర రహదారి(ఎస్‌హెచ్-16), జహీరాబాద్-బీదర్ రాష్ట్ర రహదారి(ఎస్‌హెచ్-14) సమీపంలోనే ఉన్నది. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుకు కేవలం 65 కిలోమీటర్లు, ప్రతిపాదిత రీజనల్ రింగ్‌రోడ్డుకు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈ ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీ పూర్తయితే సుమారు 1.74 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించడంతోపాటు పన్నుల రూపంలో ప్రభుత్వానికాదాయం సమకూరే అవకాశాలున్నాయి. అయినా ప్రభుత్వం దీనిపై ఉదాశీన వైఖరి ప్రదర్శిస్తున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీకి అవసరమైన పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు అధికావర్గాలు చెబుతున్నాయి. ఇది ఎప్పటికి సాకారమవుతుందో వేచి చూడాల్సిందే.


## ఆర్‌బీఐ పసిడి తంత్ర!



**ముంబై-నవభూమి:** సగటు భారతీయులకే కాదు.. మన దేశ సెంట్రల్ బ్యాంకైన భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ)కూ పసిడిపై మక్కువే. ఈ మధ్య కాలంలో ఆర్‌బీఐ బంగారం కొనుగోళ్లను గణనీయంగా పెంచింది. గత అక్టోబరు, నవంబరులో మరో 20 టన్నుల బంగారం కొనుగోలు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో మొదటి 8 నెలల్లో (ఏప్రిల్-నవంబరు) ఆర్‌బీఐ 50 టన్నుల బంగారం పోగేసింది. దీంతో రిజర్వ్ బ్యాంక్ వద్దనున్న మొత్తం బంగారం నిల్వలు 876.18 టన్నులకు పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో పసిడి ధరలు 19 శాతం మేర పెరిగినప్పటికీ, అక్టోబరు-నవంబరు కాలంలో కాస్త నిలకడగానే కొనసాగాయి. దాంతో ఆర్‌బీఐ కొనుగోళ్లను పెంచింది.

విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వల వివిధీకరణ వ్యూహం లో భాగంగానే ఆర్‌బీఐ పసిడి నిల్వలను పెంచుకుంటోంది. ఎందుకంటే, విదేశీ కరెన్సీలు ప్రధానంగా డాలర్ విలువలో హెచ్చుతగ్గులు మన ఫారెక్స్ నిల్వలపై చూపే ప్రభావాన్ని తగ్గించుకునేందుకు బంగారం నిల్వలు దోహదపడనున్నాయి. గత నెల 27తో ముగిసిన వారంలో భారత్ వద్ద విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు 411 కోట్ల డాలర్ల మేర తగ్గి 64,027 కోట్ల డాలర్లకు పరిమితమైనట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ నిల్వలు 847 కోట్ల డాలర్ల మేర తగ్గాయి. 2024 సెప్టెంబరు చివర్లో ఆల్‌టైం రికార్డు స్థాయి 70,488 కోట్ల డాలర్లకు పెరిగిన ఫారెక్స్ నిల్వలు.. గత కొన్ని వారాలుగా నిల్వలు క్షీణిస్తూ వస్తున్నాయి.

# రుణాలు తీసుకోవడం గగనమే




**ముంబై-నవభూమి:** సామాన్యులకు రిజర్వుబ్యాంక్ గట్టిషాకిచ్చింది. ఒకేసారి పలు బ్యాంకుల్లో వ్యక్తిగత రుణాలు తీసుకోవాల నుకునేవారికి సెంట్రల్ బ్యాంక్ పరిమితులు విధించింది. బ్యాంకులు విరివిగా రుణాలు మంజూరు చేస్తుండటంపై గతంలో ఆందోళన వ్యక్తంచేసిన సెంట్రల్ బ్యాంక్..వీరికి ముకుతాడువేయడానికి ఏకంగా నూతన మార్గదర్శకాలను విడుదల చేసింది. దీంతో ఈ నూతన సంవత్సరంలో తక్కువ వ్యవధిలో పలు బ్యాంకుల్లో ఎక్కువ సంఖ్యల్లో రుణాలు తీసుకోవడం ఇక కుదరకపోవచ్చు. ఈ నూతన నిబంధనలతో ఒకేసారి పలు బ్యాంకుల్లో రుణాలు తీసుకోవడం అంత సులభం కాదు. పలువురు ఖాతాదారులు తమ సంపాదనకు మించి రుణాలు తీసుకుంటున్నారని, తిరిగి చెల్లింపులు జరపడంలో విఫలంకావడంతో బ్యాంకుల్లో నిరర్థక ఆస్తులు పెరగడానికి ఇవే కారణమని గుర్తించిన ఆర్బీఐ, వీటికి చెక్ పెడుతూ నూతన మార్గదర్శకాలను రూపొందించి విడుదల చేసింది.

బ్యాంకులు తమ రుణ రికార్డులను ప్రతి పదిహేను రోజులకోసారి నివేదించాల్సి ఉండటమే ఇందుకు కారణం. గతంలో ఈ గడువు నెలరోజులుగా ఉండేది. రికార్డులు తరుచూ అప్‌డేట్ అవుతుండటం వల్ల రుణాలు తీసుకునేవారి విషయంలో ఎక్కువ తనిఖీలు జరిగే అవకాశాలుంటాయి. తద్వారా ఒకేసారి పలుచోట్ల రుణాలు తీసుకునేందుకు అవకాశం లేకపోవచ్చు. వ్యక్తిగత రుణాలు తీసుకొని ఎగ్గొట్టే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుండటంతో బ్యాంకులను ఇప్పటికే హెచ్చరించిన ఆర్బీఐ..ఈ రుణాల మంజూరుకు చెక్‌పెట్టింది. గతేడాది ఆగస్టులోనే ఈ మార్గదర్శకాలను విడుదల చేసినప్పటికీ, జనవరి 1, 2025 నుంచి అమలులోకి తేవాలని స్పష్టంచేసింది. ప్రస్తుతం ఈ కఠిన నిబంధనలు అమలులోకి రావడంతో రుణాలు తీసుకోవడం కష్టతరంకానున్నది. వేరువేరు రుణాలకు సంబంధించి ఈఎంఐలు, ప్రతినెలలో వేర్వేరు తేదీల్లో చెల్లింపులు జరుపుతుంటారు..నెల రోజులకోసారి ఆర్థిక సంస్థలు తమ రుణ సమాచారాన్ని వెల్లడించడం వల్ల, బకాయిలు తిరిగి చెల్లింపులు లేదా ఎగవేతల సమాచారాన్ని అందించడానికి 40 రోజుల వరకు సమయం అవుతున్నది%ఠా%ఈ నూతన మార్గదర్శకాలతో 15 రోజుల్లో రిపోర్టింగ్ చేయాల్సి ఉండటంతో ఈ ఆలస్యాలు భారీగా తగ్గనున్నాయని విశ్లేషకులు వెల్లడించారు. పలు బ్యాంకులు రుణాల మంజూరుపై ఎస్బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి గతంలోనే ఆందోళన వ్యక్తంచేశారు. సెంట్రల్ బ్యాంక్ తాజాగా విడుదల చేసిన మార్గదర్శకాలతో రుణాల తీసుకోకుండా అడ్డుకట్టవేయవచ్చునని చెప్పారు.

## ఉబర్ క్యాబ్ డ్రైవర్ వల్ల ఫ్లైట్ మిస్.. రూ.54 వేలు చెల్లించాలని ఆదేశం..




**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రస్తుతం మహానగరాల్లో ఎక్కడి నుంచి ఎక్కడకు వెళ్లాలన్నా చాలా మంది ఓలా, ఉబర్ వంటి ఆన్‌లైన్ ట్రాన్స్‌పోర్ట్ సేవలను వాడుకుంటున్నారు. మొబైల్‌లో యాప్ ద్వారా బుక్ చేస్తే నిమిషాల వ్యవధిలో వచ్చే క్యాబ్‌లు నిర్దిష్ట సమయానికే గమ్య స్థానానికి చేర్చుతాయి. అయితే కొందరు డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల వినియోగదారులు తీవ్రంగా ఇబ్బందులపాలవుతున్నారు. ఢిల్లీ కి చెందిన ఓ వ్యక్తి అలాంటి సమస్యనే ఎదుర్కొన్నాడు. దాంతో సదరు సంస్థపై న్యాయపోరాటానికి దిగాడు. మూడేళ్ల పోరాటం తర్వాత అతడికి అనుకూలంగా కోర్టు తీర్పునిచ్చింది.

ఢిల్లీకి చెందిన ఓ వైద్యుడు తెల్లవారుఝామున మూడు గంటలకు ఉబర్ క్యాబ్‌ను బుక్ చేసుకున్నాడు. బుక్ అయిన క్యాబ్ ఎంతకీ రాలేదు. కాల్ చేస్తే సదరు క్యాబ్ డ్రైవర్ రాలేదు. ఉబర్ ఇండియా కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసినా ఎలాంటి స్పందనా లేదు. దీంతో అప్పటికప్పుడు వేరే ట్యాక్సీ మాట్లాడుకుని ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నాడు. అయితే అప్పటికే అతడు ఎక్కాల్సిన విమానం వెళ్లిపోయింది. దీంతో ఆ తర్వాత విమానానికి టికెట్ బుక్ చేసుకుని వెళ్లాడు. తాను సకాలంలో విమానం అందుకోలేకపోవడానికి కారణమైన ఉబర్ ఇండియాపై జిల్లా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశాడు.ఈ కేసు మీద మూడేళ్ల పాటు కోర్టులో విచారణ జరిగింది. ఉబర్ ఇండియా సేవా లోపం కారణంగానే వినియోగదారుడికి సమస్య ఎదురైందని కోర్టు అంగీకరించింది. విమానాన్ని అందుకోలేకపోవడమే కాకుండా, అధిక ధరకు మరో టిక్కెట్టు కొనుక్కోవాల్సి వచ్చిందని, దీనికి ఉబర్ ఇండియా సేవా లోపం కారణమని కోర్టు ఓ అభిప్రాయానికి వచ్చింది. దాంతో అదనపు టిక్కెట్టు ధర రూ.20 వేలు, మానసిక ఒత్తిడి ఎదుర్కొన్నందుకు రూ.30 వేలు చెల్లించాలని ఆదేశించింది. ఆ డబ్బులను 45 రోజుల్లోగా చెల్లించాలని సూచించింది. ఆ గడువు లోగా చెల్లించలేకపోతే రూ.6 శాతం వడ్డీతో కట్టాల్సి ఉంటుందని పేర్కొంది.

# బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..



**ముంబై-నవభూమి:**గత కొన్ని రోజులుగా బంగారం, వెండి ధరలలో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. అయితే ఈరోజు (డిసెంబర్ 5న) మాత్రం దేశంలో వీటి ధరల్లో పెద్దగా మార్పులేదు. ఈ క్రమంలో నేడు ఉదయం 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 78,860కు చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.72,300కు చేరింది. అదే సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 78,710కు చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ.72,150కు చేరుకుంది. అయితే రానున్న రోజుల్లో బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంటున్నారు. ఇక వెండి ధరల విషయానికి వస్తే ఇవి కూడా నిలకడగా ఉన్నాయి. నేడు కిలో వెండి ధర రూ.91,500గా ఉంది.

దేశంలోని ప్రధాన నగరాల్లో 22 క్యారెట్ గోల్డ్ రేట్, 24 క్యారెట్ గోల్డ్ రేట్

చెన్నైలో రూ. 72,150 రూ. 78,710

ఢిల్లీలో రూ. 72,300 రూ. 78,860

కోల్‌కతాలో రూ. 72,150 రూ. 78,710

బెంగళూరులో రూ. 72,150 రూ. 78,710

హైదరాబాద్‌లో రూ. 72,150 రూ. 78,710

విజయవాడలో రూ. 72,150 రూ. 78,710

అయోధ్యలో రూ. 72,300 రూ. 78,860

ఆగ్రాలో రూ. 72,300 రూ. 78,860

ముంబైలో రూ. 72,150 రూ. 78,710

వడోదరలో రూ. 72,200 రూ. 78,760

కేరళలో రూ. 72,150 రూ. 78,710

పూణేలో రూ. 72,150 రూ. 78,710

బంగారం స్వచ్ఛత తెలుసుకోవడం ఎలా?

బంగారం స్వచ్ఛతను గుర్తించడానికి %×మా% (ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్) ద్వారా హాల్ మార్కులు ఇస్తారు. 24 క్యారెట్ల బంగారు ఆభరణాలపై 999, 23 క్యారెట్‌లపై 958, 22 క్యారెట్‌పై 916, 21 క్యారెట్‌పై 875, 18 క్యారెట్‌పై 750 అని రాసి ఉంటుంది. ఎక్కువగా బంగారాన్ని 22 క్యారెట్లలో విక్రయిస్తుండగా, కొందరు 18 క్యారెట్లను కూడా ఉపయోగిస్తున్నారు. 24 క్యారెట్ల బంగారం 99.9% స్వచ్ఛమైనది. 22 క్యారెట్ల బంగారం దాదాపు 91 శాతం స్వచ్ఛమైనది. 22 క్యారెట్ల బంగారంలో 9% రాగి, వెండి, జింక్ వంటి ఇతర లోహాలను కలపడం ద్వారా ఆభరణాలను తయారు చేస్తారు.

## పొగ మంచు ప్రభావంతో ఢిల్లీలో రెండో రోజూ 400 విమాన సర్వీసులు ఆలస్యం.. 45 విమానాల రద్దు..!




**ముంబై-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీలో దట్టమైన పొగమంచుతో దృశ్య గోచరత తగ్గిపోవడంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వరుసగా రెండో శనివారం 19 విమాన సర్వీసులు దారి మళ్లించగా, పలు విమాన సర్వీసులు రద్దు చేశారు. 400కి పైగా విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత శనివారం తెల్లవారుజామున 12.15 గంటల నుంచి 1.30 గంటల వరకూ 19 విమాన సర్వీసులు దారి మళ్లించామని ఢిల్లీ విమానాశ్రయ అధికారి ఒకరు చెప్పారు. వాటిలో 13 దేశీయ సర్వీసులు, నాలుగు అంతర్జాతీయ విమానాలు, మరో రెండు నాన్ షెడ్యూల్ విమానాలు ఉన్నాయని తెలిపారు. ఢిల్లీ కేంద్రంగా నడిచే 45కి పైగా విమాన సర్వీసులను రద్దు చేసినట్లు వెల్లడించారు.

ఫ్లైట్ రాడార్24 డాట్ కాం ప్రకారం ఢిల్లీ విమానాశ్రయానికి వచ్చే 400 పై చిలుకు విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ విమానయాన సంస్థ ఇండిగో తెల్లవారుజామున విమానాల ఎరైవల్స్, డిపార్చర్స్ తాత్కాలికంగా నిలిపివేసింది. దట్టమైన పొగ మంచు వల్ల ఢిల్లీతోపాటు ఉత్తర భారతంలోని పలు నగరాల పరిధిలో విమాన సర్వీసులపై ప్రభావం చూపిందని ఎయిర్ ఇండియా తెలిపింది.శుక్రవారం కూడా దట్టమైన పొగ మంచు వల్ల ఢిల్లీతోపాటు చండీగఢ్, అమృత్‌సర్, శ్రీనగర్, గువాహటి, పాట్నా పరిధిలో పగటి వేళల్లో కూడా విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్లు ఢిల్లీ విమానాశ్రయ సంస్థ తెలిపింది. ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయ సంస్థ రోజూ సుమారు 1300 విమాన సర్వీసులు నడుపుతోంది.

## అట్టుడికిన బీజాపూర్..



చర్ల -నవభూమి: ఛత్తీసగఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో టీవీ రిపోర్టర్ ముకేశ్ చంద్రాకర్ హత్యకు నిరసనగా జర్నలిస్టు సంఘాలు శనివారం ఆ జిల్లా బంద్ నిర్వహించాయి. హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని రోడ్లపై బైఠాయించి నిరసన తెలిపాయి. చిరు వ్యాపారులు కూడా బంద్ పాటించి మద్దతు తెలిపారు. ఇటు ముకేశ్ చంద్రాకర్ అంతిమయాత్రలో భారీగా ఆదివాసీలు పాల్గొన్నారు. ఈ కేసులో రితేశ్ చంద్రాకర్, దినేశ్ చంద్రాకర్, మహేంద్ర అనే ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.మరో నిందితుడు సురేశ్ చంద్రాకర్ పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. ముకేశ్ చంద్రాకర్‌ను ఇంటికి పిలిచి రాడ్‌లతో కొట్టి హత్య చేసి, సెప్టిక్‌ట్యాంక్‌లో పడేశారని వివరించారు. రోడ్డు నిర్మాణ పనులపై వార్తలు కవర్ చేసిన విషయంలో గొడవ జరిగినట్లు అనుమానిస్తున్నామన్నారు. రూ.56 కోట్ల ఓ రోడ్డు పనిని, రూ.120 కోట్లుకు రీటెండర్ చేసిన వ్యవహారంలో ఈ హత్య జరిగిందని జర్నలిస్టు సంఘాలు ఆరోపిస్తున్నాయి. కాగా, జర్నలిస్టు ముకేశ్ హత్యను నిరసిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్లలో జర్నలిస్టు సంఘాల నాయకులు శనివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలంటూ ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

## ఈ జాతర కోసం 13,000 రైళ్లు.. ఈసారి 40 కోట్ల మంది వస్తారని..



ముంబై-నవభూమి: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఈసారి ప్రారంభమయ్యే మహా కుంభమేళాకు భారీగా భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదే క్రమంలో రైల్వే శాఖ కూడా అప్రమత్తమైంది. మహా కుంభమేళా 2025ని సందర్శించే యాత్రికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, భారతీయ రైల్వే 50 రోజుల్లో 13,000 రైళ్లను నడపనుంది. ఇందులో ఈ కార్యక్రమానికి ముందు, తర్వాత 2-3 అదనపు రోజుల్లో కూడా ఇవి నడవనున్నాయి. ఈ నేపథ్యంలో 10,000 సాధారణ రైళ్లు, 3,000 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తున్నారు. కుంభమేళా జరిగే 50 రోజులలో వీటిని సుదూర ప్రాంతాలకు నడపనున్నారు.

సుదూర ప్రాంతాలకు 700 మేళా ప్రత్యేక రైళ్లు, 200-300 కిలోమీటర్ల ప్రయాణాలకు 1,800 స్వల్ప దూర రైళ్లు నడపబడతాయి. ఇది కాకుండా ప్రయాగ్‌రాజ్, చిత్రకూట్, బనారస్, అయోధ్య వంటి చుట్టుపక్కల నగరాలకు చేరుకోవడానికి రింగ్ రైల్ సేవలు కూడా ఉంటాయి. యాత్రికులు సాఫీగా, సురక్షితంగా ఉండేలా నార్త్ సెంట్రల్ రైల్వే మరో ప్రణాళికను సిద్ధం చేసింది. గందరగోళం, రద్దీని నివారించడానికి ప్రజల కదలికను వన్-వేగా ఉంచుతుంది. తద్వారా రద్దీని నివారించవచ్చు. అలాగే గందరగోళం, రద్దీని తగ్గించడానికి ప్రయాణీకులు తమ ప్లాట్‌ఫారమ్‌లకు వెళ్లే ముందు 'ప్యాసింజర్ సెంటర్'కి మళ్లించబడతారు.

**ఎప్పటి నుంచి.. ఎప్పటి వరకు**

ఈసారి ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా మహోత్సవం జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరగనుంది. ఈసారి మహా జాతరకు దాదాపు 40 కోట్ల మందికిపైగా వస్తారని అంచనా వేశారు. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తారని, రద్దీని ఎదుర్కొనేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని ఉత్తర మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ట్రాఫిక్ జామ్‌ను తగ్గించడానికి అక్కడ స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణం చేపడుతున్నారు. బ్రిడ్జి చాలా పటిష్టంగా ఉందని దీని నిర్మాణంలో నిమగ్నమైన వ్యక్తి ఉమేష్ కుమార్ పాండే అన్నారు. దీని నిర్మాణానికి గత 45-50 రోజులుగా కృషి చేస్తున్నామని, దాదాపు పూర్తయిందన్నారు. ట్రాఫిక్ జామ్‌ల నిర్వహణలో ఈ వంతెన ఉపయోగకరంగా ఉంటుంది.

**అన్ని విభాగాలు పూర్తి స్థాయిలో**

కుంభమేళా ప్రతి సంవత్సరం గంగా, యమునా, సరస్వతి నదుల సంగమం వద్ద నిర్వహించబడుతుంది. ఇది చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యతను కలిగి ఉంది. రైల్వేతో పాటు అన్ని శాఖలు కూడా జాతర సన్నాహాల్లో చురుగ్గా ఉన్నాయి. అదనంగా నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, స్థానిక ఏజెన్సీలు ఈ కార్యక్రమం కోసం మాక్ డ్రిల్‌లను నిర్వహించాయి. తద్వారా ఏదైనా అత్యవసర పరిస్థితిని ఎదుర్కోవచ్చు. ఈ కార్యక్రమం 12 సంవత్సరాలకు ఒక్కోసారి జరగడం వలన, దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు.

## తిండి ఒక్కటే కాదు గురూ!



న్యూఢిల్లీ-నవభూమి: భారతీయ కుటుంబ వ్యయ విధానాల్లో గణనీయ మార్పు వచ్చిందని, ఆహారం కంటే ఆహారేతర వస్తువులు, అవసరాలపై ఎక్కువగా దృష్టి పెడుతున్నారని ఎస్బీఐ నివేదిక వెల్లడించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పప్పులు, తృణధాన్యాల వినియోగం 5 శాతానికి పైగా తగ్గిందని పేర్కొంది. ఆహారం కంటే ఆహారేతర వస్తువులపై అధిక వ్యయం అనేది ఆర్థిక వృద్ధి, ప్రభుత్వ విధానాలు, జీవనశైలి వంటి అంశాల వల్ల ప్రాధాన్యతా మార్పులను ప్రతిబింబిస్తోందని తెలిపింది. గ్రామీణ, పట్టణ ప్రాంతం అనే తేడా లేకుండా ఆహారంపై చేస్తున్న ఖర్చులో గణనీయమైన తగ్గుదల కనిపిస్తోందని ఎస్బీఐ నివేదిక పేర్కొంది. 'గ్రామీణ ప్రాంతాల్లో ఆహారంపై ఖర్చు 2011-12లో 52.9 శాతం ఉండగా.. అది 2023-24కు 47.04కు తగ్గింది. పట్టణ ప్రాంతాల్లో 42.62 నుంచి 39.68 శాతానికి పడిపోయింది' అని వివరించింది. కుటుంబాల బడ్జెట్‌లలో ఆహారేతర వస్తువులు అధిక ప్రాధాన్యత దక్కించుకుంటున్నాయని, గ్రామాల్లో వీటి భాగం 47.1 నుంచి 52.96 శాతానికి, పట్టణాల్లో 57.38 నుంచి 60.32 శాతానికి ఎగబాకిందని తెలిపింది. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెరిగిందని, ఆసక్తికరంగా జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ కారణంగా కుటుంబ వ్యయాల్లో పన్నులు, సుంకాల వాటా తగ్గిందని, అంతకుముందు పన్ను విధానంతో పోలిస్తే తగ్గిన జీఎస్టీ రేట్ల వలన దుస్తులు, ఫుట్‌వేర్‌పై ఖర్చు తగ్గిందని పేర్కొంది. ఆహారం నుంచి ఆహారేతర వ్యయానికి మార్పు చెందడం మారుతున్న భారత సామాజిక-ఆర్థిక చిత్రాన్ని చూపుతోందని ఎస్బీఐ నివేదిక అభిప్రాయపడింది.

## వాడే ఇంధనం ఆధారంగా వాహనాలకు స్టిక్కర్లు

న్యూఢిల్లీ-నవభూమి: కాలుష్య నియంత్రణ చర్యల్లో భాగంగా దేశ రాజధానికి ఆవల ఉన్న ప్రాంతాల్లోని వాహనాలకు కూడా రంగుల స్టిక్కర్లు అతికించే విషయాన్ని పరిశీలిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. వాహనంలో ఉపయోగించే ఇంధనం ఆధారంగా రాజధాని ప్రాంతంలోని వాహనాలకు రంగుల స్టిక్కర్లను అతికించాలని గతంలో ఆదేశించింది. దాని ప్రకారం పెట్రోలు/సీఎన్‌జీతో నడిచే వాహనాలపై లైట్ బ్లూ కలర్ స్టిక్కర్‌ను, డీజిల్‌తో నడిచే వాహనాలకు ఆరెంజ్ స్టిక్కర్‌ను అతికించాల్సి ఉంటుంది. వాయు నాణ్యత 'పూర్ క్వాలిటీ' అని నివేదిక వచ్చిన రోజుల్లో కాలుష్యాన్ని బాగా వెదజల్లే వాహనాలు ఢిల్లీలోకి రాకుండా అడ్డుకునేందుకు ఈ స్టిక్కర్లు ఉపయోగపడతాయి. రాజధానికి చుట్టపక్కల ఉన్న రాష్ట్రాల్లో దీన్ని అమలు చేయాలంటూ వచ్చిన ఫిర్యాదులపై శుక్రవారం సుప్రీంకోర్టు విచారణ జరిపింది. రంగుల స్టిక్కర్లను ఇతర రాష్ట్రాలకు కూడా వర్తింపజేసే విషయాన్ని పరిశీలిస్తామని పేర్కొంది.

# తాజా రిపోర్టు.. కాఫీ.. టీ తాగితే ఆ క్యాన్సర్లకు చెక్!



న్యూఢిల్లీ-నవభూమి: అమెరికా క్యాన్సర్ సొసైటీకి చెందిన 'క్యాన్సర్' అనే జర్నల్ లో ప్రచురించిన విషయాన్ని చెప్పే ముందు.. ఒక అంశాన్ని ప్రస్తావించటం మా బాధ్యతగా భావిస్తున్నాం. కొన్ని అధ్యయనాలు.. వాటికి సంబంధించిన వివరాలు మీడియాలో చదువుతుంటాం. అయితే.. ఇందులోని విశ్వసనీయత ఎంతన్నది ఒక ప్రశ్న. ఎందుకంటే.. ఒక అంశంపై ఒకసారి పాజిటివ్ గా చెప్పిన తర్వాత.. కొంతకాలానికి దానికి విరుద్ధమైన వాదనను వినిపిస్తూ అధ్యయనాలు రావటమే దీనికి కారణం. అయితే.. ఇక్కడ పాయింట్ ఏమంటే.. సదరు అధ్యయన రిపోర్టు వందల పేజీల్లో ఉంటుంది. అందులో 'షరతులు వర్తిస్తాయి' లాంటి పాయింట్లు ఉంటాయి. విషయాన్ని చెప్పే ముందు.. అందరిని ఆకర్షించే పాయింట్ ను బేస్ చేసుకొని కథనాన్ని హైలెట్ చేస్తారు. కాబట్టి.. ఇప్పుడు మేం చెప్పే సమాచారాన్ని అవగాహన కోసం మాత్రమే తీసుకుంటే సరి. ఫలానా సొసైటీ ఫలానా తీరుతో చెప్పింది కాబట్టి.. ఇప్పటికే ఉన్న అలవాట్లను మార్చుకోవటం సరికాదు. అలా అని.. ఏదైనా సరే.. అతిగా వినియోగించటం సరికాదు. అధ్యయనానికి సంబంధించిన అంశాల్ని ఎవరికి వారు తమ సొంత విచక్షణకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని చెప్పటం మా ధర్మమని భావిస్తున్నాం. అసలు విషయం ఏమంటే.. అమెరికాకు చెందిన క్యాన్సర్ సొసైటీ తాజాగా చేసిన అధ్యయనంలో టీ.. కాఫీలు తరచూ తాగే వారిలోతల.. మెడ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తగ్గుముఖం పడతాయని పేర్కొన్నారు. అంతేకాదు.. నోరు.. గొంతు.. స్వరపేటిక క్యాన్సర్ లను సైతం టీ.. కాఫీలు అరికట్టే వీలుందని వెల్లడిస్తున్నారు. ఇందుకోసం పద్నాలుగు అధ్యయనాల నుంచి సేకరించిన సమాచారాన్ని ఇందులో పొందుపర్చారు. ఇంటర్నేషనల్ హెడ్ అండ్ నెక్ క్యాన్సర్ ఎపిడెమాలజీ కన్సార్టియం ఈ అధ్యయనాలను నిర్వహించారు. 9500 మంది తల.. మెడ క్యాన్సర్ రోగులను పరీక్షించటంతో పాటు క్యాన్సర్ నుంచి బయటపడిన 15,700 మందిని సైతం అధ్యయనం చేసిన వారు.. నిత్యం కాఫీ.. టీ తీసుకుంటున్న వారిలో మెడ.. తల క్యాన్సర్ లక్షణాలు తగ్గుముఖం పట్టినట్లుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ అధ్యయనం ప్రకారం అసలు కాఫీ.. టీ తాగని వారితో పోలిస్తే.. రోజుకు నాలుగైదు కప్పుల కాఫీ తీసుకునే వారిలో 17 శాతం క్యాన్సర్ కారకాలు తగ్గుముఖం పడతాయని.. రోజు మొత్తంలో ఎక్కువ కాఫీ తీసుకునే వారిలో నోటి క్యాన్సర్ లక్షణాలు 30 శాతం తక్కువగా ఉంటే.. గొంతు క్యాన్సర్ కారకాలు 22 శాతం తక్కువగా ఉంటాయని తెలిపారు.

నిత్యం 3-4 కప్పుల కాఫీ తాగే వారికి గొంతు కింద భాగంలో వచ్చే హైపోఫారింజీల్ క్యాన్సర్ లక్షణాలు 41 శాతం తక్కువగా ఉంటాయి. అదే సమయంలో రోజుకు ఒక్క సారైనా టీ తాగే వారిలో 9 శాతం వరకు తల.. మెడ క్యాన్సర్ కారకాలు తక్కువగా ఉంటాయని.. అదే పనిగా టీ తాగినా ఇబ్బందులు తప్పవని పేర్కొన్నారు. ఎక్కువగా టీ తాగే వారిలో హైపోఫారింజీల్ క్యాన్సర్ లక్షణాలు 38 శాతం ఎక్కువగా ఉంటాయని వార్నింగ్ ఇచ్చింది. సో.. ఏదైనా సరే మితంగా తీసుకుంటేనే మంచిది.

## మనుషులకు వాడే మందుల్ని పిల్లులకు వాడేస్తున్నారట




న్యూఢిల్లీ-నవభూమి: మిగిలిన ప్రపంచ దేశాలతో పోలిస్తే చైనాలో గుట్టు ఎక్కువ. అలాంటి దేశాలు చాలానే ఉన్నాయి. రాకెట్ స్పీడ్ తో డెవలప్ అవుతూ.. అందుకోలేనంత అభివృద్ధిని సాధిస్తున్న దేశాల జాబితాలో డ్రాగన్ దేశం ముందుంటుంది. అదే సమయంలో దరిద్రపుగొట్టు వైరస్ కు జన్మస్థలిగానూ చైనా ఉంటుంది. ప్రపంచాన్ని వణికించిన కొవిడ్ గురించి తెలిసిందే. ఈ మహమ్మారిని పుట్టించిన చైనా కారణంగా యావత్ ప్రపంచమే స్తంభించి పోయిన పరిస్థితి. ఆధునిక ప్రపంచంలో వైరస్ కారణంగా అన్ని వ్యవస్థలు సడన్ బ్రేక్ వేసినట్లుగా ఆగిపోవటం అందరూ అనుభవించిందే. అందుకే ఆ దేశంలో ఏదైనా వైరస్ వృద్ధి చెందుతున్నా.. కేసుల సంఖ్య పెరుగుతున్నా ప్రపంచ దేశాలు అలెర్టు అవుతుంటాయి. తాజాగా హెచ్ఎంపీవీ అనే వైరస్ కలకలాన్ని రేపుతోంది. అయితే.. దీని తీవ్రత ప్రపంచం మీద ఉండదని చెబుతున్నా.. ఎవరికి వారు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా ఆ దేశంలో పెంపుడు పిల్లుల్లో 'ఫీలైన్ ఇన్ఫెక్షియస్ పెర్టోనిటిస్' అనే ప్రాణాంతక వైరల్ వ్యాధి పెరుగుతోంది. ఈ వైరస్ బారిన పడే పిల్లులు వాటి శరీరం మొత్తం వ్యాపించేసి.. తెల్ల రక్త కణాలకు సోకుతుంది. దీనికి చెక్ పెట్టేందుకు వినియోగించాల్సిన మందులు చాలా ఖరీదుతో కూడుకున్నవి. దీంతో.. ఈ మందులకు బదులుగా.. ఈ వైరస్ బారిన తమ పెంపుడు పిల్లులు పడకూడదన్న ఉద్దేశంతో మనుషుల్లో కొవిడ్ వైద్యానికి వాడే మందుల్ని వేస్తున్నట్లుగా కథనాలు వస్తున్నాయి. ఈ వైరస్ ను కొవిడ్ యాంటీ వైరల్ మందులు ప్రభావం చూపుతాయని ఒక అధ్యయనంలో తేలినట్లుగా తెలుస్తోంది. ఆ మందుల్ని వాడేస్తున్న చైనీయుల తీరును పలువురు తప్పు పడుతున్నారు. మరోవైపు.. కొవిడ్ మందుల్ని తమ పెంపుడు పిల్లుల్లో వాడుతున్నప్పుడు వాటి పరిస్థితి మెరుగవుతున్న విషయాన్ని తాము గుర్తించినట్లుగా నెటిజన్లు చెబుతన్నారు. అయితే.. మనుషులు వాడే మందుల్ని.. జంతువులకు వాడటం వల్ల వాటి ఆరోగ్యాన్ని మనమే చెడగొడుతున్నట్లుగా చెబుతున్నారు. పిల్లుల సంగతి ఇలా ఉంటే.. మననుషులకు వ్యాపిస్తున్న 'హెచ్ఎంపీవీ' వైరస్ తో పాటు.. ఇప్పుడు 'హ్యూమన్ మెటానిమో వైరస్' కూడా ఎక్కువగా వ్యాప్తి చెందుతోందని చెబుతున్నారు. దీని కారణంగా ప్రజలు పెద్ద ఎత్తున ఆసుపత్రుల ఎదుట క్యూ కడుతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఈ వైరస్ బారిన పడిన వారి లక్షణాల్ని చూస్తే.. ఫ్లూ.. ఇతర శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల మాదిరే ఉంటాయనిన చెబుతున్నారు. దగ్గు.. జ్వరం.. ముక్కు దిబ్బడగా అనిపించటం.. శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులు కనిపిస్తాయని చెబుతున్నారు. మరోవైపు.. ఈ వైరస్ తీవ్రత తమ దేశంలో తక్కువగా ఉన్నట్లు చైనా చెబుతోంది. కారణం ఏమైనా కానీ.. సిత్రవిచిత్ర వైరస్ లతో చైనా ప్రపంచాన్ని తరచూ వణికిస్తోందని చెప్పక తప్పదు.

## ఈ చైనా ఉందే...భూగోళాన్నే వణికిస్తోందిగా !



న్యూఢిల్లీ-నవభూమి: చైనా అంటేనే ఇపుడు హడల్ అనుకునే పరిస్థితి వస్తోంది. ఒక విధంగా చైనా అదే కోరుకుంటోందా అన్న చర్చ కూడా ఉంది. తాను ఏమిటో ప్రపంచానికి చాటి చెప్పాలని చైనా ఎపుడూ తపిస్తూ ఉంటుంది. తాను ప్రపంచాన్ని వణికించాలని ఉవ్విళ్ళూరుతూ ఉంటుంది. ఇపుడు వైరస్ ల రూపంలో చైనా అదే పనిని చేస్తోంది. ఈ విషయంలో చైన సూపర్ సక్సెస్ అవుతోంది అని అంటున్నారు. సరిగ్గా అయిదేళ్ళ క్రితం కరోనా వైరస్ ని ప్రపంచానికి పరిచయం చేసింది చైనా. ఈ వైరం పుణ్యమాని లక్షలలో జనాలు చనిపోయారు. %ూశ్రీంశీ =ఘుం% - 3 నెలల్లో తీసుకునే అప్పుల్లో తెలుగు ప్రభుత్వాల లెక్కేంది? భూగోళం మొత్తం గిర గిరా తిరిగింది. ఎంతటి వారు అయినా కనిపించని కరోనా వైరస్ కి భయపడి దాగి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆర్థికంగా సంపన్న దేశాలు సైతం దెబ్బ తిన్నాయి. సుమారుగా రెండేళ్ళ పాటు ప్రపంచం ఎక్కడికీ కదలని పరిస్థితి ఉంది. ఇపుడు చూస్తే 2025 నెల, సరిగ్గా మళ్లీ అదే రూపంలో అవే లక్షణాలతో వైరస్ చైనాలో వీర విహారం చేస్తోంది అన్న చేదు వార్తలు ప్రపంచాన్ని భయం గుప్పిట ఉంచుతున్నాయి. ఇక్కడ మరో యాంటీ సెంటిమెంట్ ని కూడా అంతా గుర్తు చేస్తున్నారు. ఆనాడూ జనవరి ఫస్ట్ బుధవారం వచ్చిందని ఈనాడూ బుధవారం వచ్చిందని అపుడూ కొత్త ఏడాది మొదట్లోనే చైనాలో కరోనా దూకుడు చేసి తరువాత ప్రపంచానికి పాకిందని ఇపుడు కూడా సరిగ్గా అలాగే జరుగుతుందా అన్న చర్చ సాగుతోంది. చైనా ఎపుడూ ఉన్నది ఉన్నట్లుగా చెప్పదు. అదే ప్రపంచానికి కూడా పట్టుకున్న అతి పెద్ద అనుమానం. చైనాలో ఇపుడు విజృంభిస్తున్న వైరస్ మామూలే అని ఆ దేశం అంటోంది. శీతాకాలంలో వచ్చే జలుబు దగ్గు లాంటిదే అని అంటోంది. కానీ దీనిని నమ్మితే మాత్రం కరోనా తరహాలో లోకాన్ని చుట్టేస్తుందని దెబ్బైపోతామని ప్రపంచ దేశాలు అంటున్నాయి. అందువల్ల ఇప్పటి నుంచే అలెర్ట్ కావాలని కరోనా గుణపాఠాలను సీరియస్ గా తీసుకున్న వారూంతా అంటున్నారు. ఇక చైనాలో వైరస్ ధాటికి చాలా మంది శ్వాస ఆడక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు ఇది కరోనాకు అమ్మ మొగుడులా ఉందని కూడా అంటున్నారు. ఈ వైరస్ కి కూడా వ్యాక్సిన్ అయితే లేదు. కరోనా వ్యాక్సిన్ నే దీనిని వాడాలని అంటున్నారు. చైనాలో వేగంగా వ్యాపిస్తున్న దాని పేరు హెచ్ఎంపీవీ వైరస్. దీనిని ఏ మందులూ లేవని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడమే మార్గమని అంటున్నారు. ఇకపోతే ఈ వైరస్ తో పాటు మరో మూడు వైరస్ లు కూడా చైనాలో చాలా చురుకుగా ఉన్నాయని అంటున్నారు. దాంతో చైనా వైరస్ లకు పుట్టిల్లుగా మారిందని ప్రపంచ దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఐదంస్తుల అపార్ట్‌మెంట్ నేలమట్టం ఈ వైరస్ ల నుంచి కాపాడుకోవడం ఎలా అన్న దాని మీదనే ప్రస్తుతం ప్రపంచ దేశాలు దృష్టి సారిస్తున్నాయి. చైనా బయటకు చెప్పడం లేదు కానీ అక్కడ ఆసుపత్రులు అన్నీ కిటకిటలాడుతున్నాయి. అదే సమయంలో మరణాలు కూడా ఎక్కువగానే ఉన్నాయా అంటే హెచ్ఎంపీవీ వైరస్ తీవ్ర ప్రభావమే చూపిస్తోంది అని అంటున్నారు. ఇక చైనా భారత్ కి పొరుగు దేశంగా ఉంది. దాంతో భారత్ కూడా ఫుల్ అలెర్ట్ అయింది. తగిన చర్యలకు ప్రభుత్వం ఉపక్రమిస్తోంది. చైనాకు పొరుగున ఉన్న జపాన్ లోని హాంకాంగ్ కి హెచ్ఎంపీవీ వైరస్ పాకడంతో భారత్ ఇక ఎమెర్జెన్సీ మోడ్ లో పనిచేయాల్సిందే అని అంటున్నారు. ఏది ఏమైనా 2025 వస్తూనే ఇలా వైరస్ వార్తను ప్రపంచానికి మోసుకు రావడం బ్యాడ్ గానే అంతా చూస్తున్నారు. సాధ్యమైనంత తొందరగా ఈ ప్రమాదం నుంచి బయట పడాలని అన్ని దేశాలూ కోరుకుంటున్నాయి


# రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ..



చెన్నై-నవభూమి: అన్నా విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ మహిళామోర్చా నాయకురాళ్లు ఆందోళనలు జరిపేందుకు డీఎంకే ద్రావిడ తరహా ప్రభుత్వం అనుమతివ్వడం లేదని, ఈ పరిస్థితులను చూస్తే రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతున్నట్లు అవగతమవుతోందని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ ఆరోపించారు. ఈ వార్తను కూడా చదవండి: నారాయణపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్.. ఎంతమంది మావోలు మృతంటే..శనివారం సాయంత్రం మహిళామోర్చా నాయకురాలు ఉమారవి, ఆ పార్టీ జాతీయ కార్యాచరణ మండలి సభ్యురాలు ఖుష్బూ, సినీ నటి రాధిక( మాజీ ఎమ్మెల్యే విజయతరణి గిండిలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆర్ఎన్ రవిని కలుసుకుని వినతిపత్రం సమర్పించారు. అన్నా విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై జరిగిన అత్యాచారం కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని కోరారు.

ఆ సార్... ఎవరో వెల్లడించండి: ఈ సందర్భంగా రాజ్‌భవన్ వెలుపల తమిళిసై మీడియాతో మాట్లాడుతూ.. అన్నావర్శిటీ ఉదంతంపై తాము వెలువరించిన అనుమానాలను గవర్నర్ ఓపిగ్గా విన్నారని చెప్పారు. ఆ విశ్వవిద్యాలయంలో సీసీ కెమెరాలుపనిచేయకపోడం, బాధితురాలికి ప్రత్యేక పరీక్షలు నిర్వహించకపోవడం వంటి విషయాలపై గవర్నర్ కూడా ఆందోళన వ్యక్తం చేశారని తెలిపారు. అత్యాచార ఘటనలో ప్రధాన నిందితుడు ఎవరితోనో మాట్లాడుతూ 'సార్.. సార్' అని పిలిచారని, ఆ సార్ ఎవరో వెల్లడించాలన్నదే తమ డిమాండ్ అని చెప్పారు. ఈఉదంతంపై సీఎం స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి మౌనంపాటించడం గర్హనీయమన్నారు. మిత్రపక్షాలకు చెందిన వైగో, తిరుమావళవన్ వంటి నాయకులకు ఆందోళనలు జరిపేందుకు అనుమతులిచ్చిన డీఎంకే ప్రభుత్వం అత్యాచారం బాధితురాలికి మద్దతుగా మహిళా మోర్చా విభాగం జరుపతలపెట్టిన ఆందోళనలకు అనుమతి ఇవ్వకపోవడం చూస్తే రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెనీ ఉందని రుజువవుతోందన్నారు. అత్యాచార నేరస్థులకు ప్రభుత్వం అండగా ఉండటం వల్లే తాము సీబీఐ విచారణ కోరుతున్నామని చెప్పారు.

## భారత్‌లో మత విద్వేష మంటలు




న్యూఢిల్లీ-నవభూమి: సామాజిక జీవనంలో మతవిద్వేషం బుసలు కొడుతున్న దేశాల్లో భారత్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉందని ప్యూ రీసెర్చ్ సెంటర్ తాజా నివేదిక వెల్లడించింది. 2022 సంవత్సరంలో మొత్తం 198 దేశాల్లో పరిస్థితులను అధ్యయనం చేసిన ప్యూ సంస్థ తాజాగా ఆ వివరాలతో ఒక నివేదికను విడుదల చేసింది. 'సామాజిక వర్గాల మధ్య శత్రుత్వ భావన' (ఎస్‌హెచ్ఐ) ఇండెక్స్‌లో గరిష్ఠంగా 10 పాయింట్లకుగాను భారత్ 9.3 పాయింట్లతో తొలి స్థానంలో ఉందని ఈ నివేదిక తెలిపింది. తర్వాత స్థానాల్లో వరుసగా నైజీరియా (8.7), సిరియా (8.1), పాకిస్థాన్ (7.9), ఇరాక్ (7.8), ఈజిప్టు (7.4), ఆఫ్గనిస్థాన్ (7.3) నిలిచాయి. 7.2 పాయింట్లకన్నా ఎక్కువ ఉన్న దేశాలను సామాజిక అశాంతి అత్యధిక స్థాయిలో నెలకొన్న దేశాలుగా ప్యూ సంస్థ వర్గీకరిస్తుంది. మతం కారణంగా ఒక వర్గం ప్రజల్ని వేధింపులకు గురి చేయటం, మూకదాడులు జరపటం, ఉగ్రవాదం, మిలిటెంట్ చర్యలు, మతమార్పిళ్లపై ఉద్రిక్తతలు, మతపరమైన సంకేతాలు, వేషధారణపై ఆంక్షలు వంటి అంశాల ప్రాతిపదికన ఎస్‌హెచ్ఐ ఇండెక్స్‌లో దేశాలకు స్కోరు కేటాయిస్తారు. ఒక నిర్దిష్ట మతంపై లేదా కొన్ని మతాలపై ప్రభుత్వం నిర్బంధం విధించే అంశం ఆధారంగా ప్యూ సంస్థ జీఆర్ఐ అనే మరో ఇండెక్స్‌ను రూపొందించింది. ఈ ఇండెక్స్‌లో భారత్ పరిస్థితి కొంత మెరుగ్గానే ఉన్నట్లు తెలిపింది.జీఆర్ఐ ఇండెక్స్‌లో 10 పాయింట్లకుగాను భారత్‌కు 6.4 స్కోరు చేసింది. 6.6 లేదా అంతకంటే ఎక్కువ పాయింట్లు ఉన్న దేశాలను అత్యధిక ప్రమాదంలో ఉన్న దేశాలుగా ప్యూ వర్గీకరిస్తుంది. వీటిలో 8.4 పాయింట్లతో ఈజిప్టు తొలిస్థానంలో నిలవగా.. తదుపరి స్థానాల్లో ఆఫ్గనిస్థాన్ (8.2), ఇరాన్ (8.2), సిరియా (7.9), ఇండొనేషియా (7.9) ఉన్నాయి. ఎస్‌హెచ్ఐ, జీఆర్ఐ ఇండెక్స్‌లు రెండింటినీ పరిగణనలోకి తీసుకుంటే.. 25 దేశాల్లో పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని తెలిపింది. వాటిలో భారత్, నైజీరియా, సిరియా, పాకిస్థాన్, ఇరాక్ తొలి ఐదు స్థానాల్లో ఉన్నాయి. 62న్న దేశాల్లో జీఆర్ఐ, ఎస్‌హెచ్ఐ స్కోరు తక్కువగా లేదా సాధారణ స్థాయిల్లో ఉంది. వీటిలో కెనడా, దక్షిణ కొరియా తదితర దేశాలున్నాయి. 16న్న దేశాల్లో జీఆర్ఐ చాలా ఎక్కువగా ఉన్నప్పటికీ ఎస్‌హెచ్ఐ తక్కువగా ఉంది. అంటే, ప్రభుత్వ ఆంక్షల తీవ్రత అధికం కానీ, ప్రజల మధ్య మతపరమైన ఉద్రిక్తతలు లేవు. ఈ దేశాల్లో చైనా, క్యూబా ఉన్నాయి. 10న్న దేశాల్లో జీఆర్ఐ తక్కువగా ఉన్నప్పటికీ.. ఎస్‌హెచ్ఐ ఎక్కువగా నమోదైంది. అంటే, ప్రభుత్వ ఆంక్షలు లేకపోయినా మైనారిటీల మీద విద్వేషం ఎక్కువగా ఉన్నాయి. ఇటువంటి దేశాల్లో బ్రెజిల్, ఫిలిప్పీన్స్ మొదలైనవి ఉన్నాయి.

**ప్రపంచవ్యాప్తంగా ఆందోళనకర పరిస్థితి**

2021తో పోల్చితే జీహెచ్ఐ అత్యధికం నుంచి అధికం ఉన్న దేశాల సంఖ్య 55 నుంచి 59కి పెరిగింది. కాగా, 2007లో ప్యూ తన సర్వే నివేదికలను విడుదల చేయటం ప్రారంభించినప్పుడు.. ప్రపంచంలో 40 దేశాలు మాత్రమే మతపరమైన వివక్ష, ఉద్రిక్తతలు అత్యధికంగా ఉన్న జాబితాలో ఉన్నాయి. ప్రస్తుతం వాటి సంఖ్య 45కి పెరిగింది. కాగా, మతపరమైన సమూహాలపై ప్రభుత్వ పరంగా ఆంక్షలు ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోయాయని, 198 దేశాలకుగాను 186 దేశాల్లో ఈ పరిస్థితి ఉందని ప్యూ నివేదిక వెల్లడించింది. అమెరికాకు చెందిన ప్యూ రీసెర్చ్ సెంటర్ వివిధ దేశాల్లో పరిస్థితులను సామాజిక అంశాలవారీగా విశ్లేషించి నివేదికలు విడుదల చేస్తుంది.

## హెచ్-1బీతో ఇరు దేశాలకూ ప్రయోజనం





న్యూఢిల్లీ-నవభూమి: హెచ్-1బీ వీసాలపై సాగుతున్న చర్చల నేపథ్యంలో విదేశాంగ శాఖ స్పందించింది. భారత్-అమెరికా సంబంధాల్లో వృత్తి నిపుణుల తరలింపు ఒక కీలక అంశమని తెలిపింది. వీరు అందించే సాంకేతిక నైపుణ్యంతో ఇరు దేశాల ఆర్థిక సంబంధాలకు పరస్పర ప్రయోజనం చేకూరుతుందని ఆ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య ఆర్థిక, సాంకేతిక భాగస్వామ్యం బలంగా ఉందని, ఇది నిరంతరం వృద్ధి చెందుతోందని, ఇందులో వృత్తి నిపుణుల పాత్ర ఎంతో కీలకమని వివరించారు. అమెరికా-భారత్ ఆర్థిక సంబంధాలను మరింత మరింత బలోపేతం చేసుకోవాలని ఆశిస్తున్నామని జైస్వాల్ వెల్లడించారు.



## అల్లు అర్జున్‌కు రాంగోపాల్ పేట్ పోలీసులు నోటీసులు

సినీ నటుడు అల్లు అర్జున్‌కి హైదరాబాద్ రాంగోపాల్ పేట్ పోలీసులు నోటీసులు పంపారు. సంధ్య థియేటర్ ఘటనలో గాయపడి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను పరామర్శించేందుకు అల్లు అర్జున్ వెళుతున్నాడని సమాచారం అందుకున్న పోలీసులు బన్నీని రావోద్దని సూచించారు. ఒకవేళ పరామర్శకు వస్తే తమ సూచనలు పాటించాలన్నారు. ఏదైనా జరిగితే అల్లు అర్జున్ బాధ్యత వహించాల్సి వస్తుందని నోటీసుల్లో పేర్కొన్నారు.పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ మృతిచెందడంతో పాటు ఆమె కుమారుడు శ్రీతేజ్ తొక్కిసలాటలో గాయపడి ప్రస్తుతం కిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. అయితే రేవతి మరణానికి అల్లు అర్జున్ కారణమంటూ ఆయనపై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదుచేసి అరెస్టు చేశారు. నాంపల్లి కోర్టు రిమాండ్ విధించడంతో ఆయనను పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. అయితే హైకోర్టు మధ్యంతర బెయిల్‌తో ఆయన విడుదలయ్యారు. మరోవైపు నాంపల్లి కోర్టు విధించిన రిమాండ్ ముగియడంతో రెగ్యులర్ బెయిల్ కోసం అల్లు అర్జున్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ కేసుపై శుక్రవారం విచారణ చేపట్టిన నాంపల్లి కోర్టు అల్లు అర్జున్‌కి రెగ్యులర్ బెయిల్‌ను మంజూరు చేసింది. ఇక బెయిల్ మీద బయటకు వచ్చిన అల్లు అర్జున్‌కి కోర్టు పలు షరతులను విధించింది.

నవచిత్ర






## సంక్రాంతికి వస్తున్నాం.. ఇప్పుడు అందరి ఫోకస్ దానిపైనే..



టాలీవుడ్ సీనియర్ హీరో వెంకటేష్.. సంక్రాంతి వస్తున్నాం మూవీతో సంక్రాంతి స్పెషల్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాలో మీనాక్షీ చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్ రాజు నిర్మించారు. ఇప్పటికే అనిల్ రావిపూడి, వెంకటేష్ కాంబోలో వచ్చిన ఎఫ్ 2, ఎఫ్ 3 సినిమాలు మంచి హిట్ అవ్వడంతో.. ఇప్పుడు సంక్రాంతి వస్తున్నాం మూవీపై అనౌన్స్మెంట్ నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. దానికి తగ్గట్లే మేకర్స్ సందడి చేస్తున్నారు. ఎప్పటికప్పుడు కొత్త కొత్త అప్డేట్స్ తో మూవీపై ఆడియన్స్ లో పాజిటివ్ బజ్ క్రియేట్ చేస్తున్నారు. ! కొద్ది రోజుల క్రితం ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన మేకర్స్.. చాలా వెరైటీగా.. నెవ్వర్ బిఫోర్ అనేలా సందడి చేస్తున్నారు. వివిధ ప్రమోషనల్ వీడియోస్ తో అందరి దృష్టిని తమ సినిమా వైపు తిప్పుకున్నారు. ఇప్పటికే మూడు సాంగ్స్ ను రిలీజ్ చేయగా.. చార్ట్ బస్టర్స్ గా నిలిచాయి. అంతే కాదు మూవీపై సూపర్ హైప్ క్రియేట్ చేశాయి. దీంతో ఇప్పుడు అంతా థియేట్రికల్ ట్రైలర్ కోసం అంతా వెయిట్ చేస్తున్నారు. సంక్రాంతి సినిమాలు గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్ ట్రైలర్స్ ఇప్పటికే విడుదలై మంచి రెస్పాన్స్ అందుకున్న విషయం తెలిసిందే. దీంతో సంక్రాంతికి వస్తున్నాం ట్రైలర్ ఎలా ఉంటుందో.. వెంకీ తన అభిమానులను ఎలా అలరిస్తారోనని అంతా డిస్కస్ చేసుకుంటున్నారు. మొత్తానికి సంక్రాంతికి వస్తున్నాం ట్రైలర్ పై అందరి ఫోకస్ ఉందన్నమాట. అయితే రేపు (జనవరి 6) ట్రైలర్ ను రిలీజ్ చేయనున్నట్లు ఇప్పటికే మేకర్స్ ప్రకటించారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ను నిజామాబాద్ లోని కలెక్టర్ గ్రౌండ్ లో నిర్వహించనున్నారు మేకర్స్. అందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. ఇక జనవరి 14వ తేదీన సంక్రాంతికి వస్తున్నాం మూవీ రిలీజ్ కానుంది. 72 రోజుల్లో షూటింగ్ ను పూర్తయిందని రీసెంట్ గా అనిల్ రావిపూడి చెప్పి షాకిచ్చారు. మూవీని బడ్జెట్ విషయం

## త్రివిక్రమ్ శ్రీనివాస్ వల్ల నా ఆనందం కోల్పోయాను.. నటి పూనమ్ కౌర్ కామెంట్స్



ఇండస్ట్రీ సమస్యలతోపాటు సామాజిక అంశాలపై ఎప్పటి కపుడు తనదైన శైలిలో స్పంది స్తుంటుంది నటి పూనమ్ కౌర్ ఏదో ఒక ట్వీట్‌తో వార్తల్లో నిలుస్తుండే ఈ భామ తాజాగా ఎక్స్‌లో చేసిన పోస్ట్ హాట్ టాపిక్‌గా మారింది. త్రివిక్రమ్ పై చాలా కాలం క్రితమే ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అతని కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్నా. త్రివిక్రమ్ వల్ల నా జీవితంలో ఆనందం కోల్పోయాను. ఇప్పటివరకు త్రివి క్రమ్‌ను ఎవరూ ప్రశ్నించలేదు. త్రివిక్రమ్‌కు పెద్దల సపోర్ట్ ఉందని ట్వీట్ చేసింది పూనమ్ కౌర్ .అయితే దీనిపై మా అసోసియేషన్ స్పందించింది. మా అసోసియేషన్ కోశాధికారి శివబాలాజీ మాట్లాడుతూ.. మాకు పూనమ్‌కౌర్ నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నాడు. ట్వీట్ చేయడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. మా అసోసియేషన్, కోర్టును ఆశ్రయిస్తే పూనంకౌర్‌కు న్యాయం జరుగుతుందని స్పష్టం చేశాడు. ఈ వ్యవహారం ఎలాంటి మలుపులు తిరుగుతుందో...

## నాన్న, బాబాయ్‌లతో కాదు మామతో చరణ్ పార్టీ



యూత్ పార్టీకి వెళ్లాలంటే వారి ప్రాధాన్యత ఎలా ఉంటుంది? నాన్నతో లేదా బాబాయ్‌లు, మామ .. ఎవరితో కలిసి వెళ్లడానికి ఇష్టపడతారు? అంటే కచ్చితంగా 'మామ' అయితేనే పార్టీకి సరిజోడు అని చాలామంది కుర్రాళ్లు ఒప్పుకుంటారు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కూడా అందుకు అతీతుడు కాదు. అన్‌స్టాపబుల్ విత్ ఎన్బీకే షోలో హోస్ట్ బాలకృష్ణ అడిగిన ఓ చిలిపి ప్రశ్నకు చరణ్ ఇచ్చిన సమాధానం అంతే ఆసక్తిని కలిగించింది. చరణ్ తండ్రి గారైన చిరంజీవితో కలిసి బాబాయ్ లు నాగబాబు, పవన్ కళ్యాణ్ ఉన్న ఫోటో చూపించి.. వీళ్ళ ముగ్గురిలో పార్టీకి వెళ్లాలంటే ఎవరితో వెళ్తావు? అని హోస్ట్ ఎన్బీకే అడిగారు. దీనికి చరణ్ స్పందిస్తూ.. ముగ్గురితో వెళ్ళను. మా మామతో వెళ్తాను. మామ అరవింద్ పార్టీకి బెస్ట్ అని అన్నారు. అయితే చిరంజీవి, పవన్ కళ్యాణ్ పార్టీలకు దూరం. వారి స్థాయికి తగ్గట్టు హుందాగా ఉంటారు. అయితే అల్లు అరవింద్ మామతో చరణ్ తన సాన్నిహిత్యం ఎలా ఉంటుందో చెప్పేందుకే అలా సరదాగా వ్యాఖ్యానించారని అర్థమవుతోంది. నిజానికి మామ కూడా వయసు, అనుభవాల రీత్యా పెద్ద మనిషి. అలాంటి వారితో పార్టీలు కుదురుతాయా? షోలో తన పక్కనే ఉన్న స్నేహితుడు శర్వాతో అయితే పార్టీ బాగా సెట్టవుతుందేమో! ప్రస్తుతం మామ అరవింద్ గురించి చరణ్ సరదా వ్యాఖ్యలు వెబ్ లో వైరల్ అవుతున్నాయి. ఇదే ఇంటర్వ్యూలో చరణ్ కుమార్తె క్లిన్ కారాను ఎప్పుడు అందరికీ చూపిస్తారు? అని హోస్ట్ ఎన్బీకే ప్రశ్నించారు. క్లిన్ తనను 'నాన్న' అని పిలిచినప్పుడు అందరి ముందుకు తీసుకు వస్తానని చరణ్ ప్రామిస్ చేసారు. 2025లో ఒక మగబిడ్డను తమకు కానుకగా ఇవ్వాలని చరణ్‌ని తన కుటుంబ సభ్యులు కోరుకున్న విషయాన్ని కూడా ఒకే 'లేఖ' ద్వారా బయటపెట్టారు. ప్రభాస్ పెళ్లెప్పుడు? అంటూ చరణ్‌ని బాలయ్య ప్రశ్నించిన విధానం ఆకట్టుకుంది. ఇక ఈ ప్రోమోలో.. చరణ్ తల్లి, నానమ్మ మాట్లాడిన వీడియోను చూపించారు. ఈ వేదికపై గేమ్ ఛేంజర్‌కు కావాల్సినంత ప్రమోషన్ కూడా చేసారు. పూర్తి ఎపిసోడ్ ఆహాలో 8 జనవరి సాయంత్రం 7గం.లకు స్ట్రీమింగ్ కానుంది.

## డాకు మహారాజ్ సినిమాకు టికెట్ల ధరల పెంపు.. బెనిఫిట్ షోలకు అనుమతి



నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం డాకు మహారాజ్ సినిమాకు ఏపీ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. టికెట్ ధరల పెంపుతో పాటు బెనిఫిట్ షోలకు అనుమతినిచ్చింది. ఈ సినిమా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుండగా.. ఉదయం నాలుగు గంటల నుంచి బెనిఫిట్ షోలకు అనుమతినిస్తూ.. ప్రీమియర్ షో టికెట్ ధరలను రూ.500(జీఎస్‌టీతో కలిపి)గా ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది.

అలాగే విడుదలైన మొదటిరోజు నుంచి జనవరి 25 వరకు రోజుకు ఐదు షోలకు అనుమతి ఇచ్చింది. ఈ షోలకు మల్టీప్లెక్సుల్లో టికెట్‌పై రూ.135, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.110 పెంపునకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే సంక్రాంతి బరిలో ఉన్న గేమ్ ఛేంజర్ సినిమాతో పాటు సంక్రాంతికి వస్తున్నాం సినిమాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టికెట్ల రేట్ల పెంపునకు అనుమతినివ్వగా తాజాగా ఈ లిస్ట్‌లో డాకు మహారాజ్ కూడా చేరింది.డాకు మహారాజ్ సినిమా విషయానికి వస్తే.. 2023లో వాల్తేరు వీరయ్యతో బ్లాక్ బస్టర్ అందుకున్న బాబీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

## అషు రెడ్డి- ట్రెండీ డ్రెస్సులో హీటెక్కించేలా..



అందాల ఆషు రెడ్డి సోషల్ మీడియాలో గత కొంతకాలంగా విపరీతంగా వైరల్ అవుతోంది. రెగ్యులర్ గా ఈ బ్యూటీ తన గ్లామర్ పిక్స్ ని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేస్తూ ఉంటుంది. అయితే ఈ గ్లామర్ ఫోటో షూట్ లు బాలీవుడ్ హీరోయిన్స్ రేంజ్‌లో చాలా ఎక్స్ట్రీమ్ గా ఉంటాయి. కొత్త కొత్త అవుట్ ఫిట్ లతో అటు మోడ్రన్, ఇటు ట్రెడిషన్ ని కలిపేసి ఆషు రెడ్డి ఫోటోషూట్ లతో కలర్ ఫుల్ గా కనిపిస్తూ వస్తోంది. హీరోయిన్స్ కి ఏ మాత్రం తీసిపోని అందంతో ఆమె ఇన్ స్టాగ్రామ్ లో మెరిసిపోతుంది. సోషల్ మీడియాలో జూనియర్ సమంత అనే బ్రాండ్ తో అందరికి చేరువ అయిన ఆషు రెడ్డి తరువాత 'బిగ్ బాస్' రియాలిటీ షోలో పార్టిసిపేట్ చేసి బాగా పాపులర్ అయ్యింది. ఆరంభంలో బొద్దుగా ఉండే ఈ అమ్మడు తరువాత ఫిట్ నెస్ పైన ఫోకస్ చేసి స్లిమ్ లుక్ లోకి మారిపోయింది. జూనియర్ సమంత అనే ఇమేజ్ కి దూరంగా వచ్చి ఆషు రెడ్డిగానే తనకంటూ బ్రాండ్ క్రియేట్ చేసుకుంది. ఇదే బ్రాండ్ తో ప్రస్తుతం ఇన్ స్టాగ్రామ్ ని షేక్ చేస్తోంది. ఈమె ఫోటోలని లక్షల్లో నెటిజన్లు రెగ్యులర్ గా వీక్షిస్తున్నారు. ట్విట్టర్ లో కూడా ఆషు రెడ్డి గ్లామర్ ఫోటోలు వైరల్ అవుతూ ఉంటాయి. ఇదిలా ఉంటే ఆషు రెడ్డి తాజాగా ఇన్ స్టాగ్రామ్ లో బ్లాక్ కలర్ నెట్ టాప్ వేసుకొని అదిరిపోయే లుక్స్ తో ఉన్న ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. ఈ ఫోటోలలో ఆషు చాలా గ్లామర్ గా కనిపిస్తోంది. ఫోటోలకి ఆమె అదిరిపోయే క్యాప్షన్ కూడా ఇచ్చింది. నాకు ఎలాంటి స్టైలిష్ అవసరం లేదు. ఎందుకంటే నేనే ఒక స్టైల్ అంటూ మెన్షన్ చేసింది. ఆమె కాన్ఫిడెంట్ ని ఎస్టాబ్లిష్ చేసే విధంగా ఈ ఫోటోలు వాటికి ఆమె పెట్టిన క్యాప్షన్ ఉండటం విశేషం. ఇదే లుక్ ని మెయింటేన్ చేస్తే కచ్చితంగా టాలీవుడ్ లో ఆషు రెడ్డికి నటిగా అవకాశాలు పెరగడం గ్యారెంటీ అని అనుకుంటున్నారు.

## వరుసగా రెండోసారి.. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఆస్ట్రేలియా



**సిడ్నీ-నవభూమి:** పదేండ్ల తర్వాత బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని గెచుకున్న ఆస్ట్రేలియా.. వరుసగా రెండో సారి డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరింది. జూన్‌లో జరిగే ఫైనల్‌లో దక్షిణాఫ్రికాతో తలపడనుంది. ఇంగ్లాండ్‌లోని లార్డ్స్ వేదికగా గద కోసం పోరాడనున్నాయి. రెండేండ్ల క్రితం జరిగిన ఫైనల్‌లో భారత్‌ను ఓడించిన ఆస్ట్రేలియా ట్రోఫీని ముద్దాడింది.కాగా, సిడ్నీ వేదికగా జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ చివరి మ్యాచ్‌లో ఆసీస్ ఘన విజయం సాధించింది. భారత్ విధించిన 162 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ అలవోకగా ఛేదించింది. ఓపెనర్లు ఉస్మాన్ ఖవాజా (41), కొన్‌స్టాప్ (22) భారత బౌలర్లపై తొలి నుంచే ఎదురుదాడికి దిగారు. దూకుడుగా ఆడుతూ లక్ష్యాన్ని తగ్గించేకు ప్రయత్నించారు. వారిద్దరూ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన లబుషేన్, స్టీవ్ స్మిత్ ఆకట్టుకోలేకపోయారు. అయితే ట్రావిస్ హెడ్ (34), వెబ్‌స్టర్ (39) మరో వికెట్ పడకుండా అడ్డుకున్నారు. ఆచితూచి ఆడుతూ జట్టును విజయతీరాలకు చేర్చారు.దీంతో పదేండ్ల తర్వాత బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని ఆస్ట్రేలియా 3-1 తేడాతో గెలుపొందింది. 2016-17 నుంచి 2022-23 మధ్య నాలుగుసార్లు భారత్ ఈ ట్రోఫీని సొంతం చేసుకున్నది. ఇప్పుడు బీజీటీ సిరీస్‌లో ఓడింది. ఈ నేపథ్యంలో టీమ్‌ఇండియాకు ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఆశలు గల్లంతయ్యాయి. 2023-25 డబ్ల్యూటీసీ సైకిల్‌లో భారత్‌కు ఇదే చివరి మ్యాచ్. సిరీస్‌లో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో ఓడిపోయింది. దీంతో 2021, 2023లో డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరిన భారత్ ఈసారి అర్హత సాధించలేకపోయింది.

## ఐదో టెస్ట్‌లో విజయం.. బోర్డర్ గవాస్కర్ సిరీస్ కైవసం చేసుకున్న ఆస్ట్రేలియా



**సిడ్నీ-నవభూమి:** బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా జరిగిన ఐదో టెస్ట్‌లో ఆరు వికెట్ల తేడాతో భారత్‌పై ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. దీంతో ఐదు టెస్టుల సిరీస్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకుంది ఆస్ట్రేలియా.

సిడ్నీ వేదికగా జరిగిన చివరి టెస్టులో 141/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 157 పరుగులకే ఆలౌట్ అయ్యింది. దీంతో 162 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్ జట్టు ప్రారంభం నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్లుగా వచ్చిన కొన్‌స్టాస్, మార్నస్ లబుషేన్ దూకుడుగా ఆడుతుండగా.. ప్రసిధ్ కృష్ణ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించి కొన్‌స్టాస్ 22 పరుగుల వద్ద ఔటయ్యాడు. దీంతో 39 పరుగుల వద్ద ఆసీస్ తొలి వికెట్ కోల్పోయింది. అనంతరం ప్రసిధ్ కృష్ణ బౌలింగ్‌లోనే మరో ఓపెనర్ మార్నస్ లబుషేన్ కూడా ఔటయ్యాడు. ఆఫ్‌సైడ్ వెళ్లే బంతిని ఆడి జైస్వాల్‌కు క్యాచ్ ఇచ్చాడు లబుషేన్.అనంతరం బ్యాటింగ్‌కి వచ్చిన స్మిత్ 4 పరుగులకే వెనుదిరగగా.. క్రీజులోకి వచ్చిన ట్రావిస్ హెడ్, ఉస్మాన్ ఖావాజా స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. అయితే దూకుడుగా ఆడుతున్న ఖావాజను 41 పరుగుల వద్ద సిరాజ్ బౌలింగ్‌లో పెవిలియన్‌కి చేరాడు. దీంతో 104 పరుగుల వద్ద నాలుగో వికెట్ కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్‌కి దిగిన వెబ్ స్టార్ మిగిలిన టార్గెట్‌ని పూర్తి చేశాడు.

నవక్రీడ

## ఖవాజా ఔట్.. మహ్మద్ సిరాజ్‌కు ఫస్ట్ వికెట్.. ఆసీస్ 111/4



**సిడ్నీ-నవభూమి:** బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ చివరి టెస్టులో భారత్ ఓటమి దిశగా పయణిస్తున్నది. ఏస్ పేసర్ బుమ్రా గైర్హాజరుతో బలహీనపడిన టీమ్‌ఇండియా బౌలింగ్‌ను ఆస్ట్రేలియా బ్యాటర్లు సులభంగా ఆడేస్తున్నారు. 172 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదిస్తున్న ఆసీస్ 4 వికెట్లు కోల్పోయి 111 పరుగులు చేసింది.

మొదటి నుంచి ధారాలంగా పరుగులు ఇస్తున్న మహ్మద్ సిరాజ్ (%వీశీష్ఘుఎఎవవ ాఱఅతీఘఎ%) 10వ ఓవర్‌లో తొలి వికెట్ తీసుకున్నాడు. సెటిల్డ్ బ్యాట్స్‌మెన్ ఉస్మాన్ ఖవాజాను (41) ఔట్ చేశాడు. సిరాజ్ వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్ 1వ బాల్‌కు పుల్‌షాట్ ఆటడానికి యత్నించి పంత్‌కు క్యాచ్ ఇచ్చి వెనుతిరిగాడు. దీంతో టెస్టుల్లో సిరాజ్ 100 వికెట్లు పడగొట్టాడు. మిగిలిన మూడు వికెట్లను ప్రసిద్ధ్ కృష్ణ పడగొట్టాడు. తొలుత రన్స్ ఇచ్చినప్పటికీ అవకాశం చిక్కినప్పుడల్లా ప్రసిద్ధ్ ఆసీస్ బ్యాటర్లను ఔట్‌చేశాడు. కాగా, విజయానికి ఆస్ట్రేలియా మరో 51 పరుగులు మాత్రమే చేయాల్సి ఉన్నది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**